
'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 256

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

శనివారం 7-12-2019


విజయవాడలోని ఓ మహిళా కళాశాలలో విద్యార్థినుల ఆనందోత్సాహం



ఘటనా స్థలంలో నిందితుల మృతదేహాలు.. (ఇన్‌సెట్లో) చెన్నకేశవులు, ఆరిఫ్ చేతుల్లో తుపాకులు



# నిందితుల ఎన్‌కౌంటర్

## 'దిశ'ను దహనం చేసిన ప్రాంతానికి సమీపంలోనే నలుగురి కాల్చివేత

- 'సీన్ రీ కన్‌స్ట్రక్షన్' తర్వాతి రోజు షాద్‌నగర్‌కు నిందితులు
- పాతిపెట్టిన ఆధారాల కోసం తీసుకెళ్లగా పోలీసులపై దాడి
- ఎస్సై, కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు
- పిస్టళ్లు లాక్కుని కాల్పులు జరిపిన ఆరిఫ్, చెన్నకేశవులు
- రాళ్లు, కర్రలతో నవీన్, శివ దాడి
- ఆత్మరక్షణ కోసం పోలీసుల ఎదురు కాల్పులు
- అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన నలుగురు నిందితులు
- చటాన్‌పల్లికి 300 మీటర్ల దూరంలో ఘటన

యావత్ దేశాన్ని కుదిపేసిన దిశ హత్యాచార ఉదంతంలో నిందితులు పోలీసు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆధారాల సేకరణ కోసం శుక్రవారం తెల్లవారుజామున దిశను కాల్చిన ప్రదేశానికి నిందితులైన మహ్మద్ ఆరిఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చింతకుంట చెన్నకేశవులను తీసుకెళ్లగా అనూహ్యంగా వారు పోలీసులపై తిరగబడ్డారు. రాళ్లు రువ్వి, కర్రలతో దాడి చేయడంతోపాటు పోలీసుల చేతిలోని తుపాకులు లాక్కొని కాల్పులకు తెగబడ్డారు. లొంగిపోవాలని హెచ్చరించినా ఏమాత్రం లెక్క చేయలేదు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో నలుగురు నిందితులూ అక్కడికక్కడే మృతి చెందారు. ఉదయం 5:45 నుంచి 6:15 గంటల మధ్య ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.

- వివరాలు, కథనాలు 2,4,5ల్లో

## అన్యాయం చేశారు!

- 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్‌పై భగ్గుమన్న మృతుల తల్లిదండ్రులు
- పోలీసుల తీరుపై మండిపాటు
- గుడిగండ్ల, జక్లేర్ గ్రామాల్లో హై అలర్ట్

-వివరాలు 4లో

## ఆత్మరక్షణ కోసమే..


ఫైల్ ఫొటో

దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై సైబరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్

- 4లో

## జస్టిస్ ఫర్ దిశ!

### వారికి క్షమాభిక్ష అర్హత లేదు

అత్యాచార నేరాల్లో ఉరి శిక్ష పడిన వారందరూ క్షమాభిక్ష కోరుతూ పిటిషన్లు దాఖలు చేస్తారు. వారికి రాజ్యాంగం ఆ హక్కుని కల్పించింది. అయితే పోక్సో చట్టం కింద శిక్ష పడిన వారికి ఆ హక్కు ఉండకూడదు. దానికి అనుగుణంగా సరైన దిశలో కేంద్ర ప్రభుత్వం అడుగులు వెయ్యాలి. చట్టాలను పునఃసమీక్షించాలి.

- రామ్‌నాథ్ కోవింద్, రాష్ట్రపతి

### ఎన్‌కౌంటర్‌పై విచారణ

నిందితుల నుంచి అవాంఛనీయ ఘటన జరిగే అవకాశం ఉంటుందని తెలిసినా.. పోలీసులు అప్రమత్తంగా లేకపోవడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై విచారణ జరుపుతాం. కస్టడీలో ఉన్నప్పుడు ఈ ఘటన జరగడం.. సమాజానికి తప్పుడు సందేశాన్ని పంపుతుంది.

- ఎన్‌హెచ్‌ఆర్సీ


ఖమ్మంలో యువతుల హర్షం

## నా కూతుర్ని చంపిన వాళ్లింకా బతికే ఉన్నారు

'నిర్భయ' తల్లి



అత్యాచారాలకు బలైన తమ బిడ్డల తరఫున న్యాయం కోసం పోరాడుతున్న నిర్భయ, ప్రత్యూష తల్లుల మనోవేదన

- ఫ్యామిలీలో

## నా కూతురి కేసులో అసలు తీర్పే రాలేదు

ప్రత్యూష తల్లి



## తారోద్వేగం

దిశకు జరిగిన అన్యాయంపై మన తారలు ఆగ్రహానికి గురయ్యారు. తమ భావావేశాన్ని ట్విట్టర్ వేదికగా వ్యక్తపరిచారు. నిందితుల ఎన్‌కౌంటర్‌తో బాధిత కుటుంబానికి న్యాయం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు.















సెల్యూట్ టు తెలంగాణ పోలీస్ అన్న స్టిక్కర్‌తో ఓ బైకర్


ఎన్‌కౌంటర్ జరిగిన చటాన్‌పల్లి బ్రిడ్జి వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు




## చర్లపల్లి టు చటాన్‌పల్లి

### ఆ ఆరున్నర గంటలు ఇలా...

**సాక్షి, హైదరాబాద్:** దిశ అత్యాచారం తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో నిందితుల కస్టడీ, కేసు దర్యాప్తు అంశాలను సైబరాబాద్ పోలీసులు అత్యంత రహస్యంగా ఉంచారు. తదుపరి విచారణ నిమిత్తం నలుగురు నిందితులను చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి కస్టడీలోకి తీసుకోవడానికి, పది రోజుల పాటు విచారించడానికి అనుమతిస్తూ షాద్‌నగర్ కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రెండు రోజుల పాటు జైల్లోనే నిందితుల్ని విచారించిన పోలీసులు గురువారం రాత్రి మాత్రమే బయటకు తీసుకొచ్చారు. చర్లపల్లి–చటాన్‌పల్లి మధ్య ఆరున్నర గంటల పాటు సాగిన ప్రక్రియలో ఆ నలుగురూ హతమయ్యారు. నిందితులు ఎవరి కంటా పడకుండా ఉండటానికి పోలీసులు తమ వాహనాల్లోని వెనుక సీటుకు, ముందు సీటుకు మధ్య వారిని పడుకోపెట్టి ప్రయాణించారు. చర్లపల్లి–చటాన్‌పల్లి మధ్య ఎప్పుడు ఏం జరిగిందంటే...

**గురువారం రాత్రి 11.50**
దిశ కేసులో నలుగురు నిందితుల్నీ జైలు అధికారులు సైబరాబాద్ పోలీసు కస్టడీకి అప్పగించారు.

**గురువారం అర్ధరాత్రి 12.10**
నిందితుల్ని జైలు నుంచి బయటకు తీసుకువచ్చిన ప్రత్యేక బృందాలు వేర్వేరు వాహనాల్లో ఎక్కించుకుని బయలుదేరాయి.

**శుక్రవారం తెల్లవారుజాము 1.15**
పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే మీదుగా దాదాపు 50 కి.మీ. ప్రయాణించిన ఈ 'కాన్వాయ్'తొండుపల్లి టోల్‌ప్లాజా వద్దకు చేరుకుంది.

**తెల్లవారుజాము 1.45**
అరగంట పాటు అత్యాచారం జరిగిన ప్రాంతంలో దర్యాప్తు చేసిన పోలీసులు ఆపై నిందితుల్ని తీసుకుని షాద్‌నగర్ పోలీసుస్టేషన్‌కు బయలుదేరారు.

**తెల్లవారుజాము 3.40**
షాద్‌నగర్ స్టేషన్‌లో విచారణ తరువాత నలుగురినీ ఒకే వాహనంలో తీసుకుని హతురాలి సెల్‌ఫోన్ రికవరీ చేయడానికి బయలుదేరారు.

**తెల్లవారుజాము 4.00**
నలుగురు నిందితుల్ని తీసుకుని 10 మంది పోలీసులతో కూడిన బృందం చటాన్‌పల్లి బ్రిడ్జ్ వద్దకు చేరుకుంది.

**తెల్లవారుజాము 5.30**
సెల్‌ఫోన్ అక్కడ పాతిపెట్టాం.. ఇక్కడ పాతిపెట్టాం.. అంటూ పలుచోట్లకు తిప్పిన నిందితులు పోలీసులపై రాళ్ల దాడి చేస్తూ తప్పించుకునే ప్రయత్నం మొదలెట్టారు.

**తెల్లవారుజాము 5.45**
లొంగిపోమంటూ పోలీసులు చేసిన హెచ్చరికల్ని నిందితులు బేఖాతరు చేయడంతో ఆత్మరక్షణకు పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు.

**శుక్రవారం ఉదయం 6.15**
నిందితుల నుంచి స్పందన ఆగిపోవడంతో పోలీసులు ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టారు.

**ఉదయం 6.25**
నలుగురూ హతమైనట్లు గుర్తించిన పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

## ఎస్‌ఎల్‌ఆర్ లాక్కుని ఉంటే!

### పోలీసుల వైపూ భారీ నష్టమే జరిగేది

**సాక్షి, హైదరాబాద్:** దిశ ఘటనలో నిందితులను పోలీసులు తొలి నుంచి తక్కువ అంచనా వేసినట్లు కనిపిస్తోంది. శుక్రవారం నిందితులను చటాన్‌పల్లి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లిన సమయంలో జరిగిన ఎన్‌కౌంటరే ఇందుకు నిదర్శనం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నిందితుల చేతులకు వేసిన బేడీలు తీయగానే ఆధారాలు దాచిపెట్టిన చోటును వెతికినట్లే వెతికి రాళ్ల దాడికి దిగారు. పక్కనే ఎస్కార్టుగా ఉన్న కానిస్టేబుల్ వద్ద ఎస్‌ఎల్‌ఆర్ (సెల్ఫ్ లోడింగ్ రైఫిల్)ను నిందితుడు ఆరిఫ్ లాక్కునే ప్రయత్నం చేశాడు. కానీ కానిస్టేబుల్ ప్రతిఘటించడంతో భారీ ప్రమాదం తప్పింది. ఆ తుపాకీతో నిమిషానికి గరిష్టంగా 30రౌండ్ల వరకు కాల్పులు జరపొచ్చు. ఒకవేళ ఆరిఫ్ ఎస్‌ఎల్‌ఆర్ లాక్కుని ఉంటే.. పోలీసుల్లో ఎవరూ మిగిలేవారు కాదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు.

## తెలంగాణలో సంచలన ఎన్‌కౌంటర్లు ఇవే!

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఏడు ఎన్‌కౌంటర్లు చోటు చేసుకున్నాయి. అన్నీ సంచలన కేసులే కావడం గమనార్హం. వీరిలో నలుగురు మావోయిస్టులు, పేరు మోసిన మాఫియాడాన్, రెండు ఘటనల్లో సిమీ ఉగ్రవాదులు ఉన్నారు.

**2015, ఏప్రిల్ 4:** తెలంగాణలో తొలి ఎన్‌కౌంటర్ జరిగింది. నల్లగొండ సిమీ ఉగ్రవాదుల సంచారంతో వణికిపోయింది. 2013లో మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జైలు నుంచి పారిపోయిన ఐదుగురిలో ఇద్దరు ఉగ్రవాదులు సూర్యాపేటలో బస్సులు తనిఖీ చేస్తున్న సమయంలో పోలీసులపైకి కాల్పులు జరిపి పారిపోయారు. జానకీపురం గ్రామంలో పోలీసులతో జరిపిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు సిమీ ఉగ్రవాదులు హతమయ్యారు.

**2015, ఏప్రిల్ 7:** సిమీ ఉగ్రవాది వికారుద్దీన్ అతని నలుగురు సహచరులను హైదరాబాద్‌లోని కోర్టుకు తీసుకువస్తుండగా ఆలేరు సమీపంలో పోలీసులపైకి దాడికి దిగారు. ఉగ్రవాదులు ఫైర్ ఓపెన్ చేయడంతో పోలీసులు ఎదురుకాల్పులకు పాల్పడ్డారు. ఈ కాల్పుల్లో వికారుద్దీన్‌తోపాటు నలుగురు సహచరులు మరణించారు.

**2015, సెప్టెంబర్ 15:** ఉమ్మడి వరంగల్ జిల్లా వెంగళాపూర్ వద్ద మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒకరు మహిళ.

**2016, ఆగస్టు 8:** షాద్‌నగర్ సమీపంలోని మిలీనియా టౌన్‌షిప్ పరిసరాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మాఫియాడాన్ నయీముద్దీన్ అలియాస్ నయీమ్ హతమయ్యాడు.

**2019, జూలై 31:** కొత్తగూడెం జిల్లా రోళ్లగూడెం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో న్యూడెమోక్రసీ నేత లింగన్న హతమయ్యాడు.

**2019-20:** మణుగూరు మండలం బూరుగుల గ్రామంలో జాడి వీరాస్వామి అలియాస్ రఘును మట్టుబెట్టారు.

**2019, డిసెంబర్ 6:** దిశ కేసులో ఆరిఫ్, శివ, నవీన్, చెన్నకేశవులు చటాన్‌పల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు.

## ఎన్‌కౌంటర్‌పై కేసు నమోదు

**సాక్షి, హైదరాబాద్:** దిశ నిందితుల ఎన్‌కౌంటర్ ఉదంతానికి సంబంధించి శుక్రవారం షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. దిశ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న షాద్‌నగర్ ఏసీపీ వి.సురేంద్ర ఫిర్యాదు మేరకు హత్యాయత్నం (ఐపీసీ సెక్షన్ 307) కింద నమోదు చేశారు. నిందితులను తీసుకుని నేర ఆధారాల సేకరణకు చటాన్‌పల్లిలోని ఘటనాస్థలికి వెళ్లామని, అక్కడ నిందితులు తప్పించుకునే ప్రయత్నంలో పోలీసులపై హత్యాయత్నం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ అరవింద్‌గౌడ్ తీవ్రంగా గాయపడ్డారని, పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో నలుగురు నిందితులు హతమైనట్లు వివరించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన షాద్‌నగర్ పోలీసులు దాని ప్రతిని అధీకృత న్యాయస్థానానికి సమర్పించారు. మరోపక్క దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై కేంద్ర నిఘా వర్గాలు ఆరాతీశాయి. ఓ సమగ్ర నివేదిక రూపొందించి కేంద్ర హోం శాఖకు పంపాయి.

# 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్

### 'దిశ'ను దహనం చేసిన ప్రాంతానికి సమీపంలోనే నలుగురి కాల్చివేత

సాక్షి, హైదరాబాద్/రంగారెడ్డి జిల్లా/షాద్‌నగర్ బృందం:

దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన 'దిశ' అత్యాచార ఘటనలో నిందితులు పోలీసు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. చటాన్‌పల్లి వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో మహ్మద్ ఆరిఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చింతకుంట చెన్నకేశవులు అక్కడికక్కడే మరణించారు. శుక్రవారం తెల్లవారుజామున ఆధారాల సేకరణ కోసం దిశను కాల్చిన ప్రదేశానికి తీసుకొచ్చిన సమయంలో అనూహ్యంగా తలెత్తిన పరిస్థితులు ఎన్‌కౌంటర్‌కు దారితీశాయి. ఉదయం 5:45 నుంచి 6:15 గంటల మధ్యలో పోలీసులు, నిందితులకు జరిగిన కాల్పుల్లో ఆ నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

### షాద్‌నగర్ పీఎస్ నుంచే..

వాస్తవానికి షాద్‌నగర్ కోర్టు ఈ నెల 3 నుంచి 13 వరకు దిశ హత్య కేసు నిందితులను పోలీసు కస్టడీకి ఇచ్చింది. కానీ, పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి నిందితులను చర్లపల్లి జైలులోనే విచారించారు. వారి నుంచి లభించిన కీలక సమాచారం మేరకు చర్లపల్లి నుంచి బుధవారం రాత్రి కస్టడీకి తీసుకున్నారు. అదేరోజు అర్ధరాత్రి సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం తొండుపల్లి టోల్‌గేట్, దిశను కాల్చిన చటాన్‌పల్లి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లారు. తెల్లవారడంతో మళ్లీ నిందితులను షాద్‌నగర్ తీసుకెళ్లారు. గురువారం రోజంతా స్టేషన్‌లోనే విచారించారు. అప్పుడే వారు దిశ మొబైల్, ఇతర వస్తువుల గురించి కీలక సమాచారం వెల్లడించారు. దీంతో రెండోసారి నిందితులను బస్సులో శుక్రవారం ఉదయం 5 గంటలకు చటాన్‌పల్లి బ్రిడ్జి వద్దకి తీసుకొచ్చారు. వారితోపాటు పదిమంది ఎస్కార్టు, మూడు వాహనాల్లో పోలీసులు వచ్చారు.

### వస్తువులు చూపిస్తామంటూ దాడి..

దిశకు చెందిన వాచ్, మొబైల్, పవర్‌బ్యాంకు దాచిన స్థలం చూపిస్తామంటూనే నిందితులు అకస్మాత్తుగా రాళ్లు, కర్రలతో పోలీసులపై దాడికి దిగారు. దాడిలో నందిగామ ఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ అరవింద్‌గౌడ్ గాయపడ్డారు. ఆరిఫ్, చెన్నకేశవులు వారి వద్ద నుంచి పిస్టళ్లు లాక్కుని పోలీసులపై కాల్పులు జరుపుతూ.. పొలాల వైపు పరుగులు తీశారు. పోలీసులకు ఏం జరుగుతుందో కాసేపు అర్థం కాలేదు. తేరుకుని గాయపడ్డవారిని అక్కడే వదిలి మిగిలిన పోలీసులు మైక్‌సెట్‌లో అరుస్తూ లొంగిపోవాలని హెచ్చరించారు. వారి మాట లెక్కచేయని ఆరిఫ్, చెన్నకేశవులు మరోసారి కాల్పులకు దిగారు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. రెండు వర్గాల మధ్య ఉదయం 5.45 నుంచి ఉదయం 6.15 గంటల వరకు కాల్పులు కొనసాగాయి. కాల్పులు ఆగిపోయాక పోలీసులు పరిశీలించి చూడగా.. చటాన్‌పల్లి బ్రిడ్జికి దాదాపు 300 మీటర్ల దూరంలో ఎండిన జొన్న చేనులో ఒకే మడిలో నలుగురి మృతదేహాలు కనిపించాయి. ఇంకా చీకటి తొలగకపోవడంతో వారు ధరించిన దుస్తుల ఆధారంగా చెన్నకేశవులు(నీలిరంగు చొక్కా), నవీన్ (నారింజ), శివ (తెలుపు), ఆరిఫ్ (పసుపు)ను గుర్తించారు. వెంటనే ఘటనాస్థలంలో ఆధారాలు చెదిరిపోకుండా దాదాపు 10 ఎకరాల ప్రాంతాన్ని పోలీసులు స్వాధీనంలోకి తీసుకున్నారు.

### ఆధారాలు సేకరించిన క్లూస్‌టీం..

ఎన్‌కౌంటర్ జరిగిందన్న విషయం ఉదయం 7 గంటల ప్రాంతంలో దావానలంలా వ్యాపించడంతో పెద్ద ఎత్తున జనాలు అక్కడకు చేరుకున్నారు. బెంగళూరు జాతీయ రహదారితోపాటు పాత జాతీయ రహదారి మొత్తం వాహనాలతో నిండిపోయింది. అయితే, పోలీసులు మీడియాతో సహా ఎవరినీ ఘటనా స్థలంలోకి అనుమతించ కుండా ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు. ఉదయం 11 గం. ప్రాంతంలో హైదరాబాద్ నుంచి ప్రత్యేక క్లూస్ అండ్ ఫోరెన్సిక్ బృందాలు అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించాయి. నిందితుల శరీరాల నుంచి బుల్లెట్లు.. వారి చేతులపై గన్‌పౌడర్ రెసిడ్యూ (జీపీఆర్)లను, ఘటనాస్థలం పొడవునా కాల్పుల కారణంగా వెలువడిన పెల్లెట్స్‌ను సేకరించారు. ఆ తర్వాత రెవెన్యూ వర్గాలకు సమాచారం అందించిన పోలీసులు ఘటనాస్థలంలోనే మృతదేహాల పంచనామా ప్రక్రియ పూర్తి చేశారు. క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తున్న సమయంలో కొందరు వైద్యులతో షాద్‌నగర్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో చందూనాయక్ అక్కడకు వచ్చారు. దీంతో మృతులకు అక్కడే పోస్టుమార్టం చేస్తారని ప్రచారం జరిగింది. కానీ, మధ్యాహ్నం 2 గంటలు దాటిన తర్వాతే క్లూస్‌టీం, ఫోరెన్సిక్ టీం ఆధారాల సేకరణ పూర్తయింది. ఈలోపు పరిస్థితులను సమీక్షించిన పోలీసు యంత్రాంగం నిర్ణయాన్ని మార్చుకుని సాయంత్రం 4 గంటల సమయంలో మృతదేహాలను పోస్టుమార్టం కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించింది.

### బుల్లెట్ల కోసం పోలీసుల వెతుకులాట

ఎన్‌కౌంటర్ ప్రదేశంలో పోలీసులు ఉపయోగించిన బుల్లెట్ల కోసం వెతుకులాడారు. నలుగురు నిందితులకు 11 బుల్లెట్ గాయాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఘటన జరిగిన ప్రదేశంలో పడిన బుల్లెట్లను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టారు. అయితే, ఎన్ని బుల్లెట్లు స్వాధీనం చేసుకున్న విషయాన్ని మాత్రం పోలీసులు వెల్లడించలేదు.

### ఉదయం నుంచి ఘటనాస్థలంలోనే..

ఎన్‌కౌంటర్ వార్త తెలియగానే దాదాపు 6 గంటలు దాటాక సైబరాబాద్ సీపీ సజ్జనార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. తొలుత నిందితులు దాడి చేసిన ప్రాంతాన్ని.. తర్వాత వారి శవాలు పడి ఉన్న పొలాన్ని సందర్శించారు. అప్పటి నుంచి మృతదేహాలను తరలించే వరకు అక్కడే ఉన్నారు.

### కేర్‌లో పోలీసులకు చికిత్స..

దాడిలో గాయపడ్డ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ అరవింద్‌గౌడ్‌లను ముందు స్థానిక ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వర్లుకు కుడి నుదుటి భాగంలో గాయం కాగా, అరవింద్‌గౌడ్ కుడి భుజానికి గాయమైంది. ఇరువురికీ స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనలతో హైటెక్‌సిటీలోని కేర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉంది.

### మీడియాతో పోలీసుల వాగ్వాదం..

ఉదయం నుంచి ఘటనా స్థలంలోకి మీడియాను అనుమతించలేదు. దీంతో మీడియా ప్రతినిధులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత ఎట్టకేలకు నిందితుల శవాలు పడి ఉన్న మడిలోకి మీడియాను అనుమతించారు.




### ప్రత్యక్ష సాక్షి.. సామల సత్యం



గత నెల 28వ తేదీ తెల్లవారుజామున 'దిశ' మృతదేహం కాలుతుండగా చూసి పోలీసులకు సమాచారమిచ్చిన సామల సత్యమే తాజా ఎన్‌కౌంటర్‌లోనూ తొలి సాక్షిగా నిలిచాడు. శుక్రవారం తెల్లవారుజామున పొలం పనులకు వెళ్తుండగా దూరం నుంచి ఏవో శబ్దాలు వినిపించాయి. పొలం వద్దకు రాగానే.. పోలీసులు ఎన్‌కౌంటర్ జరిగిం దని, అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించారని 'సాక్షి'తో చెప్పాడు.

### ఆది నుంచి గోప్యంగానే...

ఈ కేసు దర్యాప్తులో పోలీసుల వైఫల్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో దర్యాప్తు మొత్తం అత్యంత గోప్యంగా జరిపారు. ఈ కేసులో తొలి నుంచి పోలీసుల తీరు తీవ్ర వివాదాస్పదం కావడం, సకాలంలో స్పందించలేదని జాతీయ మీడియా విమర్శలు చేయడంతో విచారణను అత్యంత పకడ్బందీగా జరిపారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతివ్వడం, శంషాబాద్ డీసీపీ నేతృత్వంలో 50మందితో ఏడు బృందాలు ఏర్పాటు కావడం చకచకా జరిగిపోయాయి. ఎట్టి పరిస్థితుల్లో 20 రోజుల్లో ఛార్జిషీటు దాఖలు చేయాలన్న పట్టుదలతో ఉన్న సమయంలో నిందితులు ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

### ఎన్‌కౌంటర్‌పై కేంద్రం ఆరా

దిశ కేసు నిందితుల ఎన్‌కౌంటర్‌పై కేంద్ర ప్రభుత్వం ఆరా తీసింది. దిశ కిడ్నాప్, అత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా కలకలం సృష్టించడంతో ఈ కేసు వివరాలను కేంద్ర హోంశాఖ ఎప్పటికప్పుడు తెలుసుకుంటోంది. ఇదే క్రమంలో శుక్రవారం ఉదయం నుంచి చోటు చేసుకున్న పరిణామాలను ఇంటెలిజెన్స్ బ్యూరో ఎప్పటికప్పుడు కేంద్రానికి నివేదించింది. ఇందుకు సంబంధించిన పూర్తి నివేదికను డీజీపీ కార్యాలయం కేంద్రానికి పంపించింది.


ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో సజ్జనార్ చిత్రానికి పాలాభిషేకం చేస్తున్న ప్రజలు


బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న 'దిశ' కాలనీవాసులు

# దిశ ఆత్మకు శాంతి

- నిందితులకు తగిన శిక్ష పడింది
- ఇదొక ఉదాహరణగా మారుతుంది
- దిశ కుటుంబ సభ్యుల మనోగతం..

**శంషాబాద్:** దిశపై దారుణానికి ఒడిగట్టిన నిందితులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారన్న వార్త ఆమె కుటుంబంలో సంతోషాన్ని నింపింది. దిశ తిరిగి రాదన్న బాధలో ఉన్న తమకు ఇప్పుడు కొంత ఉపశమనం కలిగిందని ఆమె కుటుంబ సభ్యులన్నారు. దిశ ఆత్మకు శాంతి చేకూర్చాలని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి దారుణ సంఘటనలు జరగకుండా ఇదో ఉదాహరణలా మారాలన్నారు. మీడియాతో దిశ తల్లిదండ్రులతో పాటు సోదరి తమ అభిప్రాయాలను వెల్లడించారు.

### తగిన శిక్ష పడింది..

మాకు మనశ్శాంతి కలిగింది.. మా బిడ్డ తిరిగి రాదు.. మేము అనుభవిస్తున్న బాధ మళ్లీ ఎవరికీ రాకూడదు. నాకు వాళ్లను (హంతకులను) చూడాలనిపిస్తోంది.. మా అమ్మాయి ఏం తప్పు చేసింది.. ఎంత నరకం అనుభవించిందో.. ఎప్పుడూ అందరి మంచిని మాత్రమే ఆలోచించేది. మీ సోదరి లాంటి దానిని అని చెప్పినా వినకుండా దారుణానికి ఒడిగట్టారు.. వారికి తగిన శిక్ష పడింది.

–విజయమ్మ, దిశ తల్లి


ఎన్‌కౌంటర్ వివరాలను టీవీలో వీక్షిస్తున్న దిశ కుటుంబసభ్యులు. (ఇన్‌సెట్‌లో) దిశ తల్లి

### పోలీసులు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఎన్‌కౌంటర్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు.. ప్రజలంతా మాకు అండగా నిలబడ్డారు. మా బిడ్డ అయితే తిరిగి రాదు.. ఇది కొంతవరకు ఉపశమనం మాత్రమే.. కేసు కోర్టుకు వెళ్తుందని, న్యాయం జరగడానికి ఎంత కాలం పడుతుందోనని అనుకున్నా. ఇంత త్వరగా వారికి శిక్ష పడుతుందని అనుకోలేదు. ప్రతి ఒక్కరూ దిశకు జరిగిన అన్యాయాన్ని వారి బిడ్డకు జరిగిన ఘోరంగానే భావించారు. దేశ విదేశాల నుంచి ఫోన్లు చేసి పరామర్శించారు. వారికి సరైన శిక్ష పడిందనే అనుకుంటా.. పోలీసులు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు. సమాజంలో జరుగుతున్న దారుణాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది..

–శ్రీధర్‌రెడ్డి, దిశ తండ్రి

### దీనిని ఉదాహరణగా తీసుకోవాలి

ఈ ఘటనను ఉదాహరణగా తీసుకోవాలి.. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవని అనుకుంటున్నా.. పోలీసులు నిందితులను 24 గంటల్లో పట్టుకున్నారు. వారికి ఉరిశిక్ష పడుతుందని భావించాను. పోలీసులు ఆత్మరక్షణలో భాగంగా వారిని ఎన్‌కౌంటర్ చేశారని టీవీలో చూశాను. ఎన్‌కౌంటర్ వార్త నాకు సంతోషంగానే ఉంది. పోలీసులకు, ప్రభుత్వానికి, మీడియాకు కృతజ్ఞతలు.. సంఘటన జరిగిన రోజు నుంచి అందరూ మాకు అండగా ఉన్నారు.

–భవ్య, దిశ సోదరి

## దేశం గర్విస్తోంది

### మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్:** దిశ కేసులో నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడంతో యావత్ భారత దేశం గర్విస్తోందని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన షాద్‌నగర్ బైపాస్ మీదుగా హైదరాబాద్ వెళ్తూ ఎన్‌కౌంటర్ జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దిశకు జరిగిన అన్యాయం మరే మహిళకు జరగకూడదని అన్నారు. హంతకులను ఉరితీయాలని ప్రజలు పెద్దఎత్తున డిమాండ్ చేశారని తెలిపారు. దిశ కేసులో నలుగురు నిందితులు ఎన్ కౌంటర్ అయ్యారని తెలుసుకొని ప్రతి ఇంట్లోని వ్యక్తి సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ ఘటనతో తెలంగాణ పోలీసులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగిందని అన్నారు.

# రూ.33,397 కోట్ల పనులకు గ్రీన్‌సిగ్నల్

- కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులకు రూ.25,902 కోట్లు
- సీతారామ ఎత్తిపోతలకు రూ.2,952 కోట్లు
- దుమ్ముగూడెం బ్యారేజీ పనులకు మరో రూ.4,500 కోట్లు
- ఈ నెలాఖరులోగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని సాగునీటి శాఖకు సీఎం కేసీఆర్ ఆదేశాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర సాగునీటి శాఖ పరిధిలో కొత్తగా చేపట్టనున్న పనులకు టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఏకంగా రూ.33,397 కోట్ల పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ఆరంభించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సాగునీటి శాఖను ఆదేశించారు. ఇందులో కాళేశ్వరం పరిధిలోని అదనపు టీఎంసీ పనులకు సంబంధించిన విలువే రూ.25 వేల కోట్లకు పైగా ఉండగా, ఖమ్మం జిల్లాలోని సీతారామ, కొత్తగా చేపట్టనున్న పనుల విలువ మరో రూ.7,400 కోట్ల మేర ఉండనుంది. ఈ పనులకు ఈ నెలాఖరులోగా టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాలని కేసీఆర్ అధికారులను ఆదేశించారు.

### అదనపు టీఎంసీకి భారీగానే..

కాళేశ్వరంలోని మేడిగడ్డ ద్వారా మొదటి దశలో రెండు టీఎంసీల నీటిని మాత్రమే ఎత్తిపోసేలా డిజైన్ చేసి



పనులు పూర్తి చేశారు. అనంతరం మరో టీఎంసీ నీటిని సైతం తీసుకోవాలని నిర్ణయించి ఆ పనులను ఇప్పటికే మొదలు పెట్టారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలోని 3 పంప్‌హౌస్‌లకు కలిపి రూ.7,998 కోట్ల అంచనాతో చేపట్టగా, అదనపు టీఎంసీ పనులను మరో రూ.4,394 కోట్లతో చేపట్టారు. ఈ పనులు జరుగుతున్నాయి. ఇక గురువారం జరిగిన సమీక్ష సందర్భంగా ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు వరకు చేపట్టిన పనుల టెండర్లకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.11,500 కోట్ల ఈ పనులకు వచ్చేవారం టెండర్లు పిలవనున్నారు. ఇక మిడ్‌మానేరు దిగువన మల్లన్నసాగర్ వరకు మొదట టన్నెల్ ద్వారా నీటిని తరలించాలని నిర్ణయించినా, దీని నిర్మాణాలకు చాలా రోజులు పడుతున్న నేపథ్యంలో పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నీటి తరలింపునకు 3 స్థాయిల్లో లిఫ్టులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనిలో మిడ్‌మానేరు నుంచి అనంతగిరి రిజర్వాయర్ వరకు పైప్‌లైన్ వ్యవస్థ నిర్మాణానికి రూ.4,142 కోట్లు, అనంతగిరి నుంచి మల్లన్నసాగర్ వరకు రూ.10,260 కోట్లు అవుతుందని అంచనా వేశారు. మొత్తంగా ఈ నిర్మాణానికి రూ.14 వేల కోట్లకుపైగా వ్యయం అవుతుండగా, ఈ పనుల టెండర్లకు సీఎం ఓకే చెప్పారు. అలాగే ప్రాజెక్టు పరిధిలోని క్యాంపు కార్యాలయాల కోసం రూ.43 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇక సీతారామ ఎత్తిపోతల పథకాన్ని రూ.13,884 కోట్లతో చేపట్టగా, ఇందులో ఇప్పటికే 8 ప్యాకేజీల పనులకు రూ.4,816 కోట్లతో టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టారు. ఇప్పుడు సత్తుపల్లి ప్రధాన కాల్వ ప్యాకేజీ–9 నుంచి జూలూర్‌పాడ్ మండలం వరకు (ప్యాకేజీ–13 వరకు) చేపట్టే పనులకు టెండర్లు ఈ నెలలోనే ఆరంభించాలని సీఎం సూచించారు. ఈ పనులకు రూ.2,952 కోట్లవుతుందని అంచనా వేశారు.

### టెండర్లు పిలిచే పనుల వివరాలు ఇలా..

| పని | అంచనా వ్యయం (రూ.కోట్లలో) |
|---|---|
| ఎల్లంపల్లి–మిడ్‌మానేరు | 11,500 |
| మిడ్‌మానేరు–అనంతగిరి | 4,142 |
| అనంతగిరి–మల్లన్నసాగర్ | 10,260 |
| ఇతర క్యాంపు కార్యాలయాలు | 43 |
| సీతారామ ఎత్తిపోతల(ప్యాకేజీ 9–13) | 2,952 |
| దుమ్ముగూడెం బ్యారేజీ, పవర్‌హౌస్ | 4,500 |
| మొత్తం | 33,397 |

### దుమ్ముగూడెం బ్యారేజీ, పవర్‌హౌస్‌లకు రూ.4,500 కోట్లు..

ఇక దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఫ్లడ్ రిజర్వాయర్ లెవల్ 49.67 మీటర్లు ఉండగా నీటి సామర్థ్యం 1.3 టీఎంసీలుగా ఉంది. దీన్ని మరో 13 మీటర్ల మేర అంటే 63 మీటర్లకు పెంచి 37 టీఎంసీల మేర నీటి నిల్వ చేయాలని సీఎం నిర్ణయించారు. దీంతో పాటే 320 మెగావాట్ల సామర్థ్యంతో పవర్‌హౌస్ నిర్మించాలని సూచించారు. ఇందులో బ్యారేజీ నిర్మాణానికి రూ.3 వేల కోట్లు, పవర్ హౌస్‌కు మరో రూ.1,500 కోట్లు అవుతుందని అధికారులు సీఎంకు నివేదించారు. ఈ బ్యారేజీ ద్వారా ఖమ్మం జిల్లాలో సీతారామ కింద నిర్ణయించిన 6.40 లక్షల ఎకరాలకు నీరివ్వడంతో పాటు, నాగార్జునసాగర్ కింద ఖమ్మం జిల్లాలో ఉన్న 2.60 లక్షల ఎకరాలకు నీరందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఈ పనులకు కూడా నెలాఖరులోగా టెండర్లు పిలిచి పనులు ఆరంభించాలని సీఎం సూచించడంతో ఆ దిశగా అధికారులు కసరత్తు మొదలు పెట్టారు.

- దేశవ్యాప్తంగా ఏఐటీయూసీ జనవరి 8న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ కోరారు. కేంద్రం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరముందన్నారు. శుక్రవారం సంఘం నేతలతో కలసి ఆమె మీడియాతో మాట్లాడారు.




## రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా పల్లా



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రీయ రైతు సమన్వయ సమితి చైర్మన్, డైరెక్టర్‌గా పల్లా రాజేశ్వర్‌రెడ్డిని నియమించింది. ఈమేరకు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. శాసన మండలి సభ్యుడిగా కొనసాగుతున్న పల్లా ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగుతారన్నారు. ఆయనకు క్యాబినెట్ మంత్రి హోదా కూడా కల్పించారు. రైతు సమన్వయ సమితికి చైర్మన్‌గా ఉన్న గుత్తా సుఖేందర్‌రెడ్డి మండలి స్పీకర్‌గా నియమితులవడానికి ముందే ఆ పదవికి రాజీనామా చేశారు. దీంతో అప్పట్నుంచి చైర్మన్ పదవి ఖాళీగానే ఉండటంతో దీన్ని పల్లాతో భర్తీ చేశారు.

## ‘లంబాడోళ్ల తడాఖా’ వాయిదా



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ఆదివాసీల ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించాల్సిన ‘లంబాడోళ్ల తడాఖా’సభ వాయిదా పడిందని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ వెల్లడించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగాల్సిన ఈ సభకు కేంద్రం అనుమతి నిరాకరించిందని ఆయన తెలిపారు. సభను మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే చెప్తామని, లంబాడా సోదరులు సంయమనం పాటించాలని శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

## డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికుల ధర్నా

**సాక్షి, హైదరాబాద్:** రెండేళ్లపాటు కార్మిక సంఘ ఎన్నికలు అవసరం లేదంటూ కార్మికులతో సంతకాలు పెట్టించి లేబర్ కమిషనర్‌కు లేఖలు అందించే వ్యవహారాన్ని నిరసిస్తూ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా డిపోల ఎదుట ధర్నాలు నిర్వహించారు. సంతకాలు పెట్టేందుకు నిరాకరిస్తున్న కార్మికులు ఈ ధర్నాల్లో పాల్గొన్నారు. యూనియన్లు లేకుండా చేస్తే, భవిష్యత్తులో కార్మికుల పక్షాన మాట్లాడే వారే లేకుండా పోతారంటూ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. చాలా డిపోల్లో కార్మికులు సంతకాలు పెట్టేందుకు నిరాకరిస్తే అధికారులు బెదిరిస్తున్నారంటూ వారు ఆరోపించారు. అయితే ఇంతకాలం ఆందోళనలను ముందుండి నడిపిన ముఖ్య నేతల్లో చాలామంది శుక్రవారం ధర్నాల్లో కనిపించలేదు. స్థానిక నేతలే నేతృత్వం వహించి ధర్నాలు నిర్వహించారు.

## అభ్యంతరకరమైన వ్యాఖ్యలు మానుకోవాలి

### బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి

**సాక్షి, హైదరాబాద్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌పై టీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, గువ్వల బాలరాజులు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి అన్నారు. ప్రజా ప్రతినిధులు సభ్యత, సంస్కారంతో మాట్లాడాలని, పిచ్చి ప్రేలాపనలు ఇకనైనా మానుకోవాలని టీఆర్‌ఎస్ నాయకులను హెచ్చరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తెలంగాణలో మాత్రం రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని విమర్శించారు. ఆవేశంలో కొంతమంది మహిళా రైతులు చేసిన ఆరోపణలను, అసహనాన్ని రాష్ట్ర ప్రభుత్వం జీర్ణించుకోలేక వారిపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపించిన విషయం తెలంగాణ రైతాంగం మరిచిపోలేదన్నారు. మంత్రి పదవుల కోసం ఆరాటపడుతూ మాట్లాడకూడని పదాలను వాడి, తమ స్థాయి దిగజార్చుకోవద్దని హితవు పలికారు.




## చంద్రబాబు ఆస్తుల కేసు విచారణ వాయిదా

- వాయిదా వేయాలని కోరిన లక్ష్మీపార్వతి
- అనుమతించి 20కి వాయిదా వేసిన ఏసీబీ కోర్టు

**సాక్షి, హైదరాబాద్:** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదాయానికి మించి ఆస్తుల కేసులో హైదరాబాద్‌లోని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ప్రత్యేక న్యాయస్థానంలో కేసు విచారణ ఈ నెల 20కి వాయిదా పడింది. చంద్రబాబుపై ఏసీబీ కోర్టులో ఫిర్యాదు చేసిన నందమూరి లక్ష్మీపార్వతి సాక్ష్యాన్ని శుక్రవారం నమోదు చేయాల్సివుంది. అయితే తన తరపున సీనియర్ న్యాయవాది హాజరవుతారని, అప్పటి వరకూ కేసు విచారణను వాయిదా వేయాలని కోర్టును లక్ష్మీపార్వతి కోరారు. దీంతో కేసు విచారణ ఈ నెల 20వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని, ఆస్తుల్ని అక్రమంగా కూడబెట్టారని, దీనిపై ఏసీబీ విచారణకు ఆదేశించాలని కోరుతూ లక్ష్మీపార్వతి 2005లో ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేశారు. ఏసీబీ కోర్టు ఈ ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ ప్రారంభించక ముందే చంద్రబాబునాయుడు ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసి తన వాదనలను కూడా వినాలని కోరారు. అందుకు కోర్టు అంగీకరించకపోవడంతో 2005లో హైకోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు పొందారు. ఈ స్టే ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ లక్ష్మీపార్వతి హైకోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో చంద్రబాబునాయుడు ఆదాయానికి మించి ఆస్తుల్ని కూడబెట్టారనే ఫిర్యాదుపై విచారణ జరగకుండా స్టే కొనసాగుతూ వస్తోంది. సివిల్, క్రిమినల్ కేసుల్లో స్టే 6 నెలలకు మించకూడదని సుప్రీం కోర్టు గతేడాది ఇచ్చిన తీర్పు ప్రకారం చంద్రబాబు హైకోర్టు నుంచి పొందిన స్టే గడువు ముగిసిందని గత విచారణ సమయంలో లక్ష్మీపార్వతి తరపు న్యాయవాది ఏసీబీ కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో ఆ స్టేకు ఎటువంటి పొడిగింపు లేదని తేల్చిన ఏసీబీ కోర్టు..లక్ష్మీపార్వతి ఫిర్యాదుపై విచారణలో భాగంగా ఆమె సాక్ష్యాన్ని నమోదు చేయాలని నిర్ణయించింది. సీనియర్ న్యాయవాది హాజరు నిమిత్తం విచారణను వాయిదా వేయాలని లక్ష్మీపార్వతి రెండోసారి చేసిన అభ్యర్థన మేరకు మళ్లీ విచారణ వాయిదా పడింది.



## ఎన్‌కౌంటర్‌ను సమర్థిస్తున్నాం

త్రేతాయుగంలో రావణుడు, ద్వాపర యుగంలో దుశ్శాసనుడు మన ఆడబిడ్డలను కేవలం ఎత్తుకెళ్లారు. కానీ ఈ యుగంలోని రాక్షసులు మన సీతలు, ద్రౌపదులను ఎత్తుకెళ్లి సామూహిక అత్యాచారం చేసి తగలబెడుతున్నారు. అలాంటప్పుడు రాముడు, కృష్ణుడిలా మారకుండా ఎంతకాలమని వారిని పూజిస్తూ ఉంటాం.
*– కైలాశ్ సత్యార్థి, నోబెల్ బహుమతి గ్రహీత*

దిశ ఘటనలో తప్పించుకొనేందుకు యత్నించిన నిందితులను ఎన్‌కౌంటర్ చేసినట్లు పోలీసులు చేసిన ప్రకటనను విశ్వసిస్తున్నా. రాష్ట్రంలో ఫామ్‌హౌస్ సీఎం, డమ్మీ హోం మినిస్టర్ ఉన్నా పోలీసులు మాత్రం బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నారు. *– అరవింద్, ఎంపీ*

దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేయడం శుభపరిణామం. దేశంలో మహిళలపై ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా ఇదే శిక్ష వేయాలి. తెలంగాణ పోలీసులను ఎంతో మంది తిట్టారు. అందులో నేనూ ఒకడిని. నిందితులను ఎన్‌కౌంటర్ చేసినందుకు పోలీసులకు హాట్సాఫ్. పోలీసులు ఇలా వ్యవహరిస్తేనే మహిళలపై దాడులు ఆగుతాయి.
*– బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్*

నిందితులను ఉరితీయాలి లేదా ఎన్‌కౌంటర్ చేయాలన్న ప్రజల డిమాండ్ నెరవేరినందుకు సంతోషిస్తున్నా. నిందితులపై సత్వర చర్యలు తీసుకున్న పోలీసులకు అభినందనలు. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. అవి చూసి దిశలాంటి ఘటనలకు పాల్పడిన వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తాలి.
*– కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క*

కేసీఆర్ సార్‌కు శతకోటి వందనాలు. మీ మౌనం ఎంత భయంకరంగా ఉంటుందో మీ రియాక్షన్ అంతకంటే భయంకరంగా ఉంటుంది. ఇది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని నిరూపించారు. *–టీఆర్ఎస్ ఎమ్మెల్యే కె.చందర్*

పోలీసు ఎన్‌కౌంటర్లను సీపీఐ ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించదని, అయితే ప్రత్యేక కేసుగా భావిస్తూ దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌ను సమర్థిస్తున్నా. దిశపై హత్యాచార నిందితులపై దేశవ్యాప్తంగా ప్రజలు స్పందించారు. రోడ్లపైకి వచ్చి వారిని కాల్చి చంపాలనే డిమాండ్ వచ్చిన విషయం కూడా గుర్తుంచుకోవాలి. *–సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ*

ఇలాంటి ఘటనల్లో నిర్దిష్ట కాలపరిధిలో దోషులకు వేగంగా శిక్షపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాల్లో మార్పులు తీసుకురావాలి. దిశ ఘటనలో దోషులకు కఠినశిక్ష పడాల్సిందే. ఇటీవల కొమురం భీం జిల్లాలో దళిత మహిళపై జరిగిన హత్యాచారం, వరంగల్ జిల్లాలో చోటుచేసుకున్న మానభంగం, హత్య ఘటనలపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి. *– సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి*

దిశ అత్యాచారం, హత్య చేసిన వారికి సరైన శిక్ష పడింది. దీనికి స్వాగతిస్తున్నాం. సత్వర న్యాయం చేశారని భావిస్తున్నాం. ఇకపై రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హత్యాచారం చేసిన వారికి వెంటనే శిక్ష అమలయ్యేలా చట్టాలను మరింత కఠినంగా మార్చాలి. చట్టం తన పని తాను చేసుకుపోయిందని భావిస్తున్నాం.
*– గట్టు శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తెలంగాణ అధ్యక్షుడు*

దిశ నిందితులకు ఎన్‌కౌంటర్ ద్వారా తగిన శాస్తి జరిగింది. పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి నిందితులకు శిక్షపడేలా చేసి వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచారు. శాంతిభద్రతలు కాపాడటంలో రాష్ట్ర పోలీసులు భేష్ అని రుజువైంది. *– టీఎన్జీవో, రాష్ట్ర ఎంప్లాయిస్ అసోసియేషన్*

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా టేకు లక్ష్మి, మానస సంఘటనల నిందితులను ఉరితీసి చూపించాలి. రాష్ట్రంలో దళిత, బహుజన వర్గాల పట్ల వివక్ష జరుగుతోంది. దిశ ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం నిందితులను చంపడం మంచి విషయమే కానీ, అది రాజ్యాంగబద్ధంగా జరిగి ఉంటే బాగుండేది. ఉరిశిక్ష పడే అవకాశమున్న నిందితులను ఎన్‌కౌంటర్ చేయడం దేనికి సంకేతమో చెప్పాలి.
*– చెరుకు సుధాకర్, తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు*

దిశ హత్య కేసు నిందితులను ఎన్‌కౌంటర్ చేయడాన్ని స్వాగతిస్తున్నాం. అలాగే హాజీపూర్ నిందితున్ని కూడా కఠినంగా శిక్షించాలి. మానవ మృగాలకు ఎన్‌కౌంటర్ ఒక గుణపాఠంగా మారుతుంది. దిశ, వరంగల్ హంతకుల మాదిరిగానే దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
*– శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు*

‘ఆయుధాలు లాక్కొని ఎదురుదాడికి దిగితే కాల్చేశామని పోలీసులు చెబుతున్నారు. మిగతా వివరాలు తెలియదు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడయ్యాక స్పందిస్తాం. దుర్మార్గమైన పనిచేశారు కాబట్టి శిక్షించాలనే డిమాండ్ ప్రజల నుంచి వచ్చింది. అది ఏరూపంలో జరిగిన ఓకే అనే భావనలో ఉన్న ప్రజలు ఎన్‌కౌంటర్‌ను సమర్థిస్తూ స్పందిస్తున్నారు. పూర్తి వివరాలు అందాక స్పందిస్తాం. ఇప్పటికిప్పుడు దీనిపై వ్యాఖ్యానాలు చేయలేము’
*– సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం*


ఎన్‌కౌంటర్‌తో దిశకు న్యాయం జరిగిందంటూ శుక్రవారం కరీంనగర్‌లోని గీతాభవన్ చౌరస్తాలో వివిధ కళాశాలల విద్యార్థుల హర్షాతిరేకాలు

# సాహో.. సజ్జనార్!

**సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఆయన పేరే**
**దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌లో కీలక పాత్ర**
**ప్రశంసల వర్షం కురిపిస్తున్న నెటిజన్లు, ప్రజలు**

సాక్షి, హైదరాబాద్

**‘సజ్జనహారం న్యాయానికి జయహారం**
**ఓరుగల్లు భద్రకాళి కళ్లుతెరిచి**
**ఆనతినిచ్చిన ప్రదోషకాలం**
**అపరవీరభద్రుడై సజ్జనార్**
**సలిపిన మృగ సంహారం’**
**సోషల్‌మీడియాలో**
**ఇలాంటి మాటలెన్నో..**

విశ్వనాథ్ చన్నప్ప సజ్జనార్.. ఇప్పుడు దేశవ్యాప్తంగా మారుమోగుతున్న పేరు. దమ్మున్న పోలీస్.. రియల్ సింగం.. ఇలాంటి పోలీస్ రాష్ట్రానికి కనీసం ఒక్కరన్నా ఉండాలి.. పోలీసులు ఎలా ఉండాలో ఈయనను చూసి నేర్చుకోవాలి.. ఐపీఎస్ అధికారిగా ఆయన తెలంగాణలో ఉన్నందుకు గర్విస్తున్నా.. అత్యాచారం చేసేవారికి వెన్నులో వణుకుపుట్టే పేరు సజ్జనార్.. దేశవ్యాప్తంగా ‘యాంటీ రేప్ బ్యూరో’ఏర్పాటు చేసి దానికి బాస్‌గా సజ్జనార్‌ను నియమించాలి. శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి కామెంట్స్ కోకొల్లలు. గత కొన్ని రోజులుగా యావత్తు దేశాన్ని కుదిపేస్తున్న ‘దిశ’కేసుకు ఓ ముగింపునిస్తూ చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్ అంతకంటే పెద్ద సంచలనంగా మారింది. అత్యాచార నిందితుల్లో భయం పుట్టాలంటే తెలంగాణ పోలీస్ తరహా పనిచేయాలంటూ సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా ‘సాహో.. సజ్జనార్’అంటూ నినాదం హోరెత్తుతోంది.

### విమర్శలు పోయి ప్రశంసలు..

పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే ‘దిశ’ఘటన జరిగి ఉండకపోయేదని కొద్ది రోజులుగా దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వం స్పందించలేదని, సీఎం ఆలస్యంగా స్పందించారని, హోంమంత్రి అభ్యంతరకరంగా మాట్లాడారని.. ఇలా ఒకటే విమర్శల దాడి. కానీ శుక్రవారం తెల్లవారుజామునే పరిస్థితి మారిపోయింది. దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌తో తెలంగాణ పోలీసులపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ముఖ్యంగా సైబరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్‌ను తెగపొగిడేస్తున్నారు. కొన్ని చోట్ల ఆయన చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసిన ఫొటోలు షేర్ చేస్తున్నారు. సజ్జనార్ పేరు మారుమోగటంతో చాలామంది ఆయన వివరాల కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతున్నారు. ఆయన పిస్టల్ పట్టుకుని ఉన్న ఫొటో ప్రధానంగా కనిపిస్తోంది.


కరీంనగర్‌లో కేసీఆర్, సజ్జనార్ మాస్క్‌లు ధరించి మద్దతు ప్రకటిస్తున్న విద్యార్థినులు




### ఇదీ సజ్జనార్ నేపథ్యం..

కర్ణాటకలోని దావణగెరె ప్రాంతానికి చెందిన సజ్జనార్.. ధార్వాడ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. 1996 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సజ్జనార్.. ఉమ్మడి ఏపీ క్యాడర్‌కు ఎంపికయ్యారు. జనగాం ఏఎస్పీగా, నల్లగొండ, మెదక్, కడప, గుంటూరు, వరంగల్ జిల్లాలతో పాటు సీఐడీలో ఎస్పీగా పని చేశారు. డీఐజీగా, ఐజీగా పదోన్నతులు పొంది వివిధ విభాగాల్లో కీలక విధులు నిర్వర్తించారు.

### ఎవరినీ వదల్లేదు..

అసాంఘిక శక్తులపై మాత్రమే కాదు తీవ్రవాదులు, ఉగ్రవాదులు సైతం ఆయన తూటాలకు నేలకొరిగారు. డీఐజీగా పదోన్నతి పొందిన తర్వాత మావోయిస్టు వ్యతిరేక నిఘా విభాగమైన ఎస్ఐబీలో పనిచేశారు. ఐజీ అయ్యాక కూడా అక్కడే కొనసాగుతూ ఉగ్రవాద వ్యతిరేక నిఘా విభాగమైన కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్‌కు ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. ఐజీ హోదాలో గతేడాది సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా బదిలీపై వచ్చారు.

### మూడు ఎన్‌కౌంటర్లు..

సజ్జనార్ ఎస్పీ హోదాలో ఉండగా రెండు ఎన్‌కౌంటర్లు జరిగాయి. ప్రస్తుతం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ హోదాలో ఉండగా.. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే ఈ మూడు కేసుల్లో కూడా ప్రధానంగా బాధితుల ‘కాల్చివేత’లే మూలంగా ఉన్నాయి. మెదక్ ఎస్పీగా పని చేస్తుండగా బిక్కు అనే గంజాయి స్మగ్లర్‌ను మట్టుపెట్టారు. తన వ్యవహారాలను అడ్డుకోవడానికి ప్రయత్నించిన కానిస్టేబుల్‌ను పెట్రోల్ పోసి కాల్చేసిన బిక్కు ఆపై పోలీసుల కాల్పుల్లో మృత్యువాత పడ్డాడు. సజ్జనార్ వరంగల్ ఎస్పీగా ఉన్న సమయంలో స్వప్నిక, ప్రణీతలపై యాసిడ్ దాడి జరిగింది. ఆ నిందితులు కూడా ఎన్‌కౌంటర్‌లోనే చనిపోయారు. ఇప్పుడు దిశ కేసులో కూడా బాధితురాలిపై పెట్రోల్ పోసి కాల్చేసిన నలుగురూ కస్టడీలో ఉండగా ఎన్‌కౌంటర్‌కు గురయ్యారు.

### ఆయనది కీలకపాత్ర..

గ్యాంగ్‌స్టర్ నయీం ఆపరేషన్‌కు నేతృత్వం వహించిన వారిలో సజ్జనార్ కూడా ఉన్నారు. ఈయన హయాంలో కొనాపురి రాములు, సాంబశివరావులు వంటి కీలక మావోయిస్టు నేతలు లొంగిపోయారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్‌కు ఇన్‌చార్జ్‌గా ఉండగా.. హుజీ, జేకేహెచ్, జేకేబీహెచ్ తదితర మాడ్యూల్స్‌కు చెందిన ఉగ్రవాదులు అరెస్టయ్యారు. ఘరానా మోసాలకు పాల్పడే వైట్ కాలర్ నేరగాళ్లు కూడా ఈయన పేరుకు వణికిపోతారు. నల్లగొండ ఎస్పీగా ఉండగా అయస్కాంత పరుపుల పేరుతో జరిగిన జపాన్ లైఫ్ స్కామ్‌కు చెక్ చెప్పడంతో మొదలు పెట్టిన సజ్జనార్ సీఐడీలో ఉండగా ఆమ్వే సంస్థ పైనా చర్యలు తీసుకున్నారు.

## ఎన్‌కౌంటర్ సరికాదు..

ఎన్‌కౌంటర్లకు నేను వ్యక్తిగతంగా వ్యతిరేకం. నిందితులు పోలీసుల కస్టడీలో ఉండగానే ఈ ఎన్‌కౌంటర్ అయింది. దీనిపై మెజిస్టీరియల్ విచారణ జరగనుంది. అజ్మల్ కసబ్ లాంటి ఉగ్రవాది కేసులు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఈ కేసులో ఎందుకు అలా జరగలేదు.
*– అసదుద్దీన్ ఒవైసీ, ఎంపీ*

పార్టీ నిర్ణయం వచ్చే వరకు ఎన్‌కౌంటర్‌పై స్పందించం. ఇది ఎమోషన్‌గా మాట్లాడే అంశం కాదు. చట్టం పని న్యాయస్థానం చేయదు. న్యాయస్థానం పని చట్టసభలు చేయవు. అత్యాచార నిందితులను ఎవరు వెనకేసుకురారు. ఏ వ్యవస్థ చేయాల్సిన పని.. ఆ వ్యవస్థ చేయాలి. ఈ ఎన్‌కౌంటర్‌తో సమస్య పరిష్కారం అయితే ఇబ్బంది లేదు. గతంలో ఎన్‌కౌంటర్ జరిగాక అత్యాచారాలు ఆగిపోయాయా. నాకున్న అనుమానాలపై శనివారం ప్రభుత్వాన్ని, పోలీసులను ప్రశ్నిస్తా.. *– కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి*

## ఎన్‌కౌంటర్‌పై అభ్యంతరం

**సాక్షి, హైదరాబాద్:** దిశపై సామూహిక అత్యాచారం, హత్య కేసు నిందితుల ఎన్‌కౌంటర్‌పట్ల ఓవైపు దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతుంటే మరోవైపు ఈ ఉదంతంపై కొందరు ప్రగతిశీలవాదుల నుంచి మాత్రం నిరసన వ్యక్తమవుతోంది. తెలంగాణ పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని నిందితులను ఎన్‌కౌంటర్ చేశారని, దిశను చంపి ఆ నలుగురు చేసిన తప్పునే పోలీసులు కూడా చేశారని విమర్శిస్తున్నారు. నిందితులను ఎన్‌కౌంటర్ చేయడంతో సమస్యకు పరిష్కారం లభించదని, సమస్య మూలాలను పరిష్కరించాల్సిన బాధ్యత తీసుకోకుండా తాత్కాలిక ఉపశమనం కోసం పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడం దారుణమని కొందరు సోషల్ మీడియాలో వ్యాఖ్యానాలు చేశారు. ట్రిగ్గర్ ట్రాక్ ఇన్‌జస్టిస్‌ను తిరస్కరించాలని, జీవించే హక్కు అందరికీ సమానంగా వర్తిస్తుందన్న విషయాన్ని అందరూ గ్రహించాల్సి ఉంటుందని ప్రముఖ న్యాయవాది బృందా గ్రోవర్ తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో పోస్టు చేశారు. ఆమెతో పాటు చాలా మంది నెటిజన్లు సోషల్ మీడియా ద్వారా ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా తమ వాదనలను వినిపించారు.

## సమన్యాయం దక్కాలి

**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ**



**బౌద్ధనగర్:** అత్యాచారం, హత్యకు గురైన ఘటనల్లో అణగారిన వర్గాల మహిళలకో న్యాయం, అగ్రవర్ణాలకో న్యాయం అమలు సరికాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. మహిళలపై అత్యాచారం, హత్యలు జరిగితే తాము కుల,మత, ప్రాంత వివక్ష లేకుండా బాధిత కుటుంబాల్ని పరామర్శించి నిందితులకు కఠిన శిక్షలు వేగంగా పడాలని డిమాండ్ చేస్తున్నామని.. కానీ న్యాయం అగ్రవర్ణాల వారికి మాత్రమే జరుగుతోందని ఆరోపించారు. సికింద్రాబాద్ పార్శీగుట్టలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. దిశ హత్య ఘటనపై పౌరసమాజం, మీడియా, ప్రభుత్వం, అన్ని పార్టీల నేతలు తీవ్రంగా స్పందించారన్నారు. దిశకేసులో మాట్లాడిన ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రేవంత్‌రెడ్డి ఆసిఫాబాద్ జిల్లాలో టేకు లక్ష్మి పై అత్యాచారం, హత్య జరిగితే ఒక్కరు కూడా నోరువిప్పలేదన్నారు. హాజీపూర్ ఘటనపై, మానస అత్యాచారం ఘటనపై ఎందుకు స్పందించలేదన్నారు. అగ్రవర్ణ కులానికి చెందిన నిర్భయ, దిశల సంఘటనలో ప్రభుత్వాలు కొత్త చట్టాలను తీసుకుని వచ్చాయని వారి పేర్లు మార్చారని కానీ అదే టేకు లక్ష్మి, మానస తదితర ఘటనల్లో ఎందుకు జరుగలేదని ప్రశ్నించారు.

# అన్యాయం చేశారు!

**ఎన్‌కౌంటర్‌పై మృతుల తల్లిదండ్రుల మండిపాటు**

**సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:** ‘దిశ’కేసు నిందితుల ఎన్‌కౌంటర్‌పై మృతుల తల్లిదండ్రుల ఆవేదన ఇది. తమ బిడ్డలు చేసిన పని తప్పేనని, వారికి శిక్ష వేయాల్సిందే అని పేర్కొంటున్న నిందితుల తల్లిదండ్రులు.. ఇంత తొందరగా ఇలాంటి శిక్ష పడుతుందని ఊహించలేదని చెబుతున్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న నారాయణపేట జిల్లా మక్తల్ మండలం జక్లేర్‌కు చెందిన మహమ్మద్ ఆరిఫ్, గుడిగండ్ల గ్రామానికి చెందిన జొల్లు శివ, జొల్లు నవీన్, చెన్నకేశవులును శుక్రవారం ఉదయం పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన విషయం తెలుసుకున్న ఆయా గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. వారంతా దిశకు న్యాయం జరిగిందని చెబుతూనే.. మృతులంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారని, తల్లిదండ్రులకు వారే దిక్కని, ఎన్‌కౌంటర్‌తో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ చేసిన తర్వాత ఒక్కసారి కూడా మాట్లాడనీయకుండా ఇలా ఎన్‌కౌంటర్ చేయడం దారుణమని మృతుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. మరోవైపు ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మృతుల తల్లిదండ్రులను వనపర్తి జిల్లా ఎస్పీ అపూర్వరావు ఓదార్చారు. వారికి ఎన్‌కౌంటర్ స్థలానికి పంపించారు.

“కోర్టు తీర్పు రాకముందే మా ఆయన్ను చంపడం పెద్ద తప్పు.. ఇది అన్యాయం.. నన్నూ తీసుకెళ్లి అక్కడే చంపండి”
*– చెన్నకేశవులు భార్య రేణుక*

“తప్పు చేసిన మా కొడుకుకు శిక్ష వేయడం కరెక్టే. ఇకపై తెలంగాణలో ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరిగినా ఇలాగే కాల్చి చంపుతారా? పోలీసులు సమాధానం చెప్పాలి. ఇప్పుడు నా కోడలు కడుపుతో ఉంది. ఒక్కసారి కూడా మాట్లడనివ్వకుండా చంపడం సరైంది కాదు”
*– చెన్నకేశవులు తల్లి జయమ్మ*

“కనీసం మాకు చెప్పకుండానే, కోర్టులో శిక్ష పడకుండానే పోలీసులు ఎలా ఎన్‌కౌంటర్ చేశారో సమాధానం చెప్పాలి”
*– మహమ్మద్ ఆరిఫ్ తల్లి మౌలానాబీ*

“మా కొడుకును ఒక్కసారి చూడకుండా మాట్లాడకుండా ఇలా చంపేయడం కరెక్ట్ కాదు. తప్పు చేస్తే శిక్షించమన్నాం. ఇంత తొందరగా ఇలా చంపుతారని అసలే అనుకోలేదు. మా కొడుకు శవం మాకొద్దు”
*– శివ తల్లిదండ్రులు మణెమ్మ, రాజప్ప*

“నా కొడుకును చూడకుండానే చంపేశారు.. కడ చూపుకైనా కనికరించ లేదు..”
*– నవీన్ తల్లి లక్ష్మి*

### మా పొలంలో పూడ్చొద్దు..

ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారిని ఖననం చేసేందుకు శుక్రవారం సాయంత్రమే ఏర్పాట్లు చేశారు. అయితే గుడిగండ్లకు చెందిన నిందితుడు చెన్నకేశవులును శ్మశానవాటికలో ఖననం చేసేందుకు సన్నద్ధమవుతుండగా.. తన పొలానికి దగ్గరగా పూడ్చొద్దంటూ మ్యాకల వెంకటమ్మ స్పష్టంచేశారు. ఆమె పొలానికి ఆనుకుని ఉన్న శ్మశానవాటికలోనే మృతులందరినీ పూడుస్తున్నామని చెప్పినా.. ఆమె అంగీకరించలేదు. దీంతో వెంకటమ్మ పొలానికి దూరంగా మృతదేహాలను ఖననం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు చెన్నకేశవులు మృతదేహాన్ని తమకే అప్పగించాలని తల్లి జయమ్మ, భార్య రేణుక, బంధువులు, కుటుంబ సభ్యులు ప్రధాన రహదారిపై ధర్నా చేశారు.

### మృతుల దేహాల్లో 11 బుల్లెట్లు!

ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మహమ్మద్ ఆరిఫ్ (ఏ–1) శరీరంలో నాలుగు బుల్లెట్లు, జొల్లు శివ (ఏ–2) శరీరంలో మూడు, జొల్లు నవీన్ (ఏ–3) శరీరంలో మూడు, చెన్నకేశవులు (ఏ–4) శరీరంలో ఒక బుల్లెట్‌ను వైద్యాధికారుల బృందం గుర్తించినట్లు సమాచారం. సంఘటనా స్థలంలో పోలీసులు 15 రౌండ్ల వరకు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఇందులో పలు బుల్లెట్లు మిస్ ఫైర్ కాగా.. 11 బుల్లెట్లు నిందితుల శరీరంలోకి చొచ్చుకుని పోయాయని తెలుస్తోంది.

## సజ్జనార్ అయితే మాకూ న్యాయం జరిగేది


శంషద్‌బేగం, ఆయేషా మీరా తల్లి

**తెనాలిరూరల్:** పదమూడేళ్లుగా మా పాప ఆయేషా మీరా కేసులో న్యాయం కోసం ఎదురు చూస్తున్నాం. సజ్జనార్ లాంటి అధికారి మా పాప కేసు దర్యాప్తు చేసి ఉంటే తప్పకుండా న్యాయం జరిగేది. వరంగల్ యాసిడ్ దాడి కేసు, ప్రస్తుతం దిశ కేసు నిందితుల విషయంలో సజ్జనార్ సార్ తీసుకున్న నిర్ణయాలకు ఆయనకు హ్యాట్సాఫ్.

# ఆత్మరక్షణ కోసమే కాల్పులు

**సాక్షి, హైదరాబాద్/రంగారెడ్డి జిల్లా:** ‘దిశ’కేసు నిందితులు చటాన్‌పల్లి వద్ద పోలీసులపై దాడి చేయడంతోపాటు కాల్పులు జరిపేందుకు ప్రయత్నించడంతో ఆత్మరక్షణ కోసం ఎన్‌కౌంటర్ చేశామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. దిశను దహనం చేసిన ప్రాంతంలో మరిన్ని ఆధారాల సేకరణ కోసం శుక్రవారం ఉదయం 5.45 గంటల సమయంలో నలుగురు నిందితులను తీసుకెళ్లినప్పుడు ఈ సంఘటన జరిగినట్టు చెప్పారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో శంషాబాద్ జోన్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డితో కలిసి కాల్పులు జరిగిన తీరు, అందుకు దారితీసిన కారణాలను సజ్జనార్ మీడియాకు వివరించారు. “ఈ ప్రాంతానికి సమీపంలో భూమిలో పాతిపెట్టిన దిశ సెల్‌ఫోన్, పవర్‌బ్యాంక్ తదితర వస్తువులను తీయించడానికి నిందితులను తీసుకొచ్చాం. ఈ క్రమంలో వారు పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఏ2 జొల్లు శివ, ఏ3 జొల్లు నవీన్ పోలీసులపై రాళ్లు రువ్వడంతోపాటు కర్రలతో దాడి చేశారు. ఏ1 మహమ్మద్ ఆరిఫ్, ఏ4 చింతకుంట చెన్నకేశవులు పోలీసుల వద్ద ఆయుధాలు లాక్కొని కాల్పులు మొదలుపెట్టారు. అప్పటికీ ఆయుధాలు, రాళ్లు కింద పడేసి లొంగిపోవాలని హెచ్చరించినా.. వినకపోగా పోలీసుల పైకి కాల్పులు కొనసాగించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురు కాల్పులు చేయాల్సి వచ్చింది. దీంతో నలుగురు నిందితులు బుల్లెట్ గాయాలతో మరణించారు. నిందితుల దాడిలో నందిగామ ఎస్ఐ వెంకటేశ్వర్లు తలకు, కానిస్టేబుల్ అరవింద్‌గౌడ్‌కు గాయాలయ్యాయి. వారికి స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించి హైదరాబాద్ కేర్ ఆస్పత్రికి తరలించాం”అని సీపీ తెలిపారు. వారికి రాళ్లు, కర్రల దెబ్బలు మాత్రమే తగిలాయని.. బుల్లెట్ గాయాలు కావని ఆయన స్పష్టం చేశారు. ఘటనా స్థలంలో రెండు పిస్టళ్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

**దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై సీపీ సజ్జనార్ వెల్లడి**
- పోలీసులపై నిందితులు రాళ్లు, కర్రలతో దాడి
- పిస్టళ్లు లాక్కుని పోలీసు పార్టీపై కాల్పులు
- హెచ్చరించినా వెనక్కి తగ్గలేదు
- ఎదురు కాల్పుల్లో నలుగురూ మృతి

### 30 నిమిషాల్లోనే..

“గతనెల 27న శంషాబాద్ సమీపంలోని తొండుపల్లి టోల్‌ప్లాజా వద్ద కిడ్నాప్‌నకు గురైన దిశపై లైంగికిదాడి, హత్య చేసి మరుసటి రోజు తెల్లవారుజామున షాద్‌నగర్ వద్ద చటాన్‌పల్లి అండర్‌పాస్ కింద ఆమెను దహనం చేశారు. ఈ కేసుని శంషాబాద్ డీసీపీ లోతైన దర్యాప్తు చేశారు. సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలతోపాటు రెండు చోట్ల భౌతిక ఆనవాళ్లు సేకరించాం. వీటి ఆధారంగా నిందితులను అరెస్ట్ చేసి 30న మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా.. వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈనెల 4న చర్లపల్లి జైలు నుంచి నిందితులను 10రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తీసుకున్నాం. ఆరోజు, మరుసటి రోజు విచారణ జరపగా చాలా విషయాలు చెప్పారు. దిశకు చెందిన సెల్‌ఫోన్, వాచీ తదితర వస్తువులు చటాన్‌పల్లి వద్ద దాచిపెట్టినట్లు వెల్లడించారు. వీటిని సేకరించడానికి నిందితులను అక్కడికి తీసుకెళ్లగా పోలీసుల పైకి కాల్పులు మొదలుపెట్టడంతో ఇంచుమించు 50 మీటర్ల దూరం నుంచి ఎదురుకాల్పులు చేశారు. మొత్తం 30 నిమిషాల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది”అని సజ్జనార్ వివరించారు.


ఎన్‌కౌంటర్‌పై శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ సజ్జనార్

### గత నేరాలపై ఆరా..

నలుగురు నిందితుల గత నేర చరిత్రపై ఆరా తీస్తున్నట్లు సీపీ వెల్లడించారు. వాళ్లు కరుడుగట్టిన నేరస్తులని, నిందితుల డీఎన్ఏ విశ్లేషణ చేసి, దాని ఆధారంగా.. రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో మహిళలు కిడ్నాప్‌నకు గురై దహనమైన కేసులను తేల్చుతామని వివరించారు. వదంతులను ప్రచారం చేయవద్దని మీడియాకు విజ్ఞప్తి చేశారు. ఒక మహిళ కుటుంబ పరువుకు సంబంధించిన కేసు అని, ఇది అత్యంత సున్నితమైందని చెప్పారు. దిశ కుటుంబ సభ్యుల ప్రైవసీ కాపాడాలని కోరారు. వారితో పదేపదే మాట్లాడి ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు అందాయా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. ఈ ఎన్‌కౌంటర్ అనుకోకుండా జరిగిన ఘటన అని సజ్జనార్ బదులిచ్చారు.


చటాన్‌పల్లిలో బ్రిడ్జి కింద దిశకు పూలతో నివాళి

## ఎల్లుండి వరకు మృతదేహాలను భద్రపరచండి

- దిశ కేసు నిందితుల ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు ఆదేశం



**సాక్షి, హైదరాబాద్:** ఎన్‌కౌంటర్‌లో మరణించి దిశ కేసు నిందితుల మృతదేహాలను ఈనెల 9వ తేదీ రాత్రి 8 గంటల వరకూ భద్రపర్చాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. చటాన్‌పల్లిలో జరిగిన దిశ కేసు నిందితుల ఎన్‌కౌంటర్ బూటకమని, ఇందుకు బాధ్యులైన పోలీసులపై హత్యా నేరం కింద కేసులు నమోదు చేయాలని, ఎన్‌కౌంటర్‌పై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని పేర్కొంటూ మహిళా హక్కులు, ప్రజా సంఘాల ప్రతినిధులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు ఫిర్యాదు చేశారు. అయితే, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్ సెలవులో ఉన్నందున ఆ ఫిర్యాదును సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్ర రావు పరిశీలించారు. వెంటనే దానిని సుమోటో ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి విచారణకు స్వీకరించారు. రాత్రి 8 గంటల సమయంలో ఆయన నివాసంలో ధర్మాసనం సమావేశమై ఈ వ్యాజ్యంపై విచారణ జరిపింది. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ హాజరయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో నలుగురి మృతదేహాలకు పోస్టుమార్టం జరుగుతోందని ఏజీ చెప్పారు. పోస్టుమార్టం నిర్వహిస్తున్నప్పుడు వీడియో చిత్రీకరణ చేస్తున్నారని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈనెల 9వ తేదీ సోమవారం రాత్రి 8 గంటల వరకూ నలుగురి మృతదేహాలను భద్రపర్చాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నలుగురి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించినప్పుడు తీసిన వీడియోను సీడీ లేదా పెన్‌డ్రైవ్‌లో భద్రపర్చి మహబూబ్‌నగర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జికి శుక్రవారమే అందజేయాలని, వాటిని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శనివారం సాయంత్రంలోగా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు అందజేయాలని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఈ వ్యాజ్యాన్ని 9వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనానికి నివేదించాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు, జస్టిస్ కె.లక్ష్మణ్‌లతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## ఉలిక్కిపడ్డ షాద్‌నగర్

**షాద్‌నగర్‌టౌన్:** షాద్‌నగర్ మరోసారి ఉలిక్కిపడింది. మూడేళ్ల క్రితం గ్యాంగ్‌స్టర్ నయీంను ఎన్‌కౌంటర్ చేసిన ప్రాంతానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోనే దిశ హత్యకేసులో నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. నయీంను షాద్‌నగర్‌లోని మిలీనియం టౌన్ షిప్ ఇళ్ళ మధ్య ఎన్‌కౌంటర్ చేయగా..దిశ హత్యకేసు నిందితుల్ని చటాన్‌పల్లి శివారులో జాతీయ రహదారి పక్కన కాల్చిపారేశారు. ఈ రెండు ఘటనలు పోలీసుల చెర నుంచి నిందితులు తప్పించుకుని వెళ్తున్నప్పుడు జరిగినవే. ఈ రెండు ఘటనలు కూడా షాద్‌నగర్ ప్రాంత వాసులకు ఉదయం 7గంటల ప్రాంతంలో తెలిశాయి. తాజాగా 'దిశ'నిందితుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో షాద్‌నగర్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోయింది.

# మృగాడైతే.. మరణ శిక్షే!

- నాడు స్వప్నిక, ప్రణీతల యాసిడ్ దాడి నిందితులు
- నేడు షాద్‌నగర్‌లో దిశపై అత్యాచారం, హత్య కేసు
- ఎన్‌కౌంటర్లతో ముగిసిన రెండు ఘటనల నిందితుల కథ
- వరంగల్ జిల్లాలో మూడు ఘటనలలో ఇదే తీర్పు

**సాక్షి ప్రతినిధి, వరంగల్:** మనిషి మృగాడిగా మారితే మరణ శిక్షే సరి.. కరడు గట్టిన నేరాలకు పాల్పడే మానవ మృగాల పట్ల పోలీసుల వైఖరిని సమాజం హర్షిస్తోంది. పదేళ్ల కిందట 2008 డిసెంబర్ 8న వరంగల్‌లో ప్రణీత, స్వప్నికపై యాసిడ్ దాడి.. నవంబర్ 27న షాద్‌నగర్ చటాన్‌పల్లి వద్ద దిశపై అత్యాచారం, హత్యలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయ్యాయి. ఈ రెండు కేసుల్లోనూ నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన పోలీసులు... తదుపరి విచారణ కోసం కస్టడీకి తీసుకున్నారు. 2008 డిసెంబర్ 13న 'సీన్ రీకన్‌స్ట్రక్షన్' కోసం మామూనూరు పోలీసు క్యాంపు సమీపంలో నిందితులను విచారిస్తుండగా పోలీసుల నుంచి ఆయుధాలు తీసుకుని దాడికి ప్రయత్నించడం.. పోలీసులు ఆత్మరక్షణ కోసం జరిపిన కాల్పుల్లో నిందితులు శాఖమూరి శ్రీనివాసరావు, బజ్జూరి సంజయ్, పోతరాజు హరికృష్ణ మృతి చెందారు. తాజాగా దిశ నిందితుల ఎన్‌కౌంటర్.. దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఈ రెండు ఘటనలకు బాధ్యులైన మానవ మృగాలకు మరణశిక్షే పడింది. మగాళ్లు మృగాళ్లుగా మారితే ఇక అంతేనన్న విషయాన్ని నేరగాళ్లకు నేరుగా చెప్పారు. కాగా 2008 డిసెంబర్ 13న వరంగల్‌లో జరిగిన ఘటన సమయంలో సజ్జనార్ ఎస్పీగా ఉండగా.. ప్రస్తుతం సైబరాబాద్ కమిషనర్‌గా ఉన్న ఆయన ఈ రెండు సంఘటనలలో కీలకంగా వ్యవహరించారు.

### వరంగల్‌లో మొత్తం మూడు ఘటనలు..

పదేళ్ల కాలంలో వరంగల్ జిల్లాలో మూడు దారుణ ఘటనలు జరగ్గా.. అందులో నిందితులకు చావే శరణ్యమైంది. రెండు సంఘటనలు సజ్జనార్ హయాంలో జరగ్గా.. మరో ఘటన సౌమ్యామిశ్రా ఎస్పీ గా ఉన్నప్పుడు జరిగింది. 2008 డిసెంబర్‌లో హసన్‌పర్తి మండలం భీమారం వద్ద యాసిడ్ దాడి జరిగింది. కిట్స్ కాలేజీకి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థినులు స్వప్నిక, ప్రణీతపై శాఖమూరి శ్రీనివాస్ మరో ఇద్దరితో కలసి దాడి చేశాడు. ఈ ఘటన జరిగినప్పుడు ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకోగా.. సాక్ష్యాల సేకరణ సమయంలో తప్పించుకునేందుకు ప్రయత్నించగా జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. ఎన్‌కౌంటర్ చేయడంతో ముగ్గురూ మృతి చెందారు. మహిళలపై వేధింపులకు పాల్పడటంతో కరడుగట్టిన రౌడీషీటర్లుగా మారిన గడ్డం జగన్ అలియాస్ జయరాజ్, ఏ.రత్నాకర్‌ను 2008 అక్టోబర్ 2008న 'సీన్ రీకన్‌స్ట్రక్షన్'కోసం ఉర్సుగుట్ట ప్రాంతంలో విచారిస్తున్న సమయంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరూ మరణించారు. వరంగల్‌కు చెందిన పత్తి వ్యాపారి కుమార్తె మనీషాను 2008లో కిడ్నాప్ చేసి హత్య చేశారు. అప్పట్లో ఈ సంఘటన తీవ్ర సంచలనం రేపింది. అప్పటి ఎస్పీ సౌమ్యామిశ్రా ప్రజల నుంచి వచ్చిన ఒత్తిళ్లను అర్థం చేసుకుని కేసులో ముందుకు సాగారు. వారిని కస్టడీలోకి తీసుకుని విచారణ జరుపుతుండగా.. నిందితులు టి.రాజు, ఎల్.అశోక్, బి.నరేశ్‌లు ఎన్‌కౌంటర్‌కు గురయ్యారు.






సజ్జనార్‌ను ఎత్తుకున్న స్థానికులు

### అదే డిసెంబర్... అదే సజ్జనార్

- 2008 డిసెంబర్ 13న ముగ్గురు యాసిడ్ దాడి నిందితుల ఎన్‌కౌంటర్
- అప్పుడు వరంగల్ పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్
- మళ్లీ 2019 డిసెంబర్ 6న దిశ నిందితుల ఎన్‌కౌంటర్
- ప్రస్తుతం సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్



ఎన్‌కౌంటర్ ప్రదేశంలో పోలీసులపై పూలవర్షం కురిపిస్తున్న ప్రజలు

# రాళ్లు వేసిన చోటే పూలవర్షం

**కొత్తూరు:** 'దిశ'కేసు నిందితుల ఎన్‌కౌంటర్ తర్వాత శుక్రవారం ప్రజలు చటాన్‌పల్లి వద్ద పోలీసులపై పూల వర్షం కురిపించారు. పోలీస్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. గత నెల 30న నిందితులను పోలీసులు షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా స్థానికులు వేలసంఖ్యలో స్టేషన్ వద్దకు చేరుకుని నిందితులకు బహిరంగంగా ఉరి తీయాలి..లేని పక్షంలో తమకు అప్పగించాలని కోరుతూ ఆందోళన చేశారు. ఈ క్రమంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ప్రయత్నించగా స్థానికులు వారిపై రాళ్లు విసిరారు. అందులో ఓ నిరసనకారుడు పోలీసులపై చెప్పు కూడా విసిరాడు. కాగా, శుక్రవారం నిందితులను పోలీసులు చటాన్‌పల్లి సమీపంలో ఎన్‌కౌంటర్ చేయడంతో అదే చేతులతో వారిపై స్థానికులు పూలు చల్లారు.

### నిందితులకు ఎన్‌కౌంటరే సరైన శిక్ష

'దిశ'ను హతమార్చిన నలుగురు నిందితులకు ఎన్‌కౌంటరే సరైన శిక్ష అని స్థానికులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'తెలంగాణ పోలీసులు హీరోలు..న్యాయం గెలిచింది..దిశ ఆత్మకు శాంతి చేకూరింది.. సీపీ సజ్జనార్ సార్ డూస్ గ్రేట్ జాబ్'అని నినాదాలు చేశారు. ఉదయం 8 గంటలకే ఎన్‌కౌంటర్ వార్త తెలుసుకున్న ప్రజలు, వివిధ సంఘాల వారు, విద్యార్థులు, యువకులు, రాజకీయ నాయకులు ఘటనా స్థలికి చేరుకుని టపాసులు కాల్చారు. పోలీసులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

# పోస్టుమార్టం పూర్తి

- మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో 'దిశ'నిందితులకు శవపరీక్ష
- గాంధీ ఆస్పత్రి వైద్యులు, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో ప్రక్రియ పూర్తి
- ఎన్‌కౌంటర్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆరా
- మృతదేహాలను వారి తల్లిదండ్రులకు అప్పగించొద్దని పోలీసులకు ఆదేశం
- నేడు మృతదేహాలను పరిశీలించనున్న కమిషన్ సభ్యులు

**సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:** రంగారెడ్డి జిల్లా చటాన్‌పల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన 'దిశ'కేసు నిందితుల మృతదేహాలకు మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిగింది. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి చెందిన ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌ఓడీ కృపాల్‌సింగ్, అసోసియేట్ ప్రొఫెసర్ లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేందర్, మరో ఇద్దరు పీజీ విద్యార్థులతో కూడిన ప్రత్యేక బృందం.. ఆరిఫ్, శివ, నవీన్, చెన్నకేశవులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించింది. శుక్రవారం సాయంత్రం 4.51 గంటలకు ప్రారంభమైన శవపరీక్ష ప్రక్రియ రాత్రి 9 గంటలకు పూర్తయింది. ఒక్కో మృతదేహాన్ని నిశితంగా పరిశీలించిన ఫోరెన్సిక్ నిపుణులు.. వారి బరువు, ఎత్తు కొలిచారు. ఏ భాగంలో బుల్లెట్ గాయమైంది? ఏ తుపాకీతో, ఎంత దూరం నుంచి కాల్చి చంపారు? అనే విషయాలను నిశితంగా పరిశీలించారు. ఒకరు ఫొటోలు, మరొకరు వీడియో ద్వారా ఈ ప్రక్రియను చిత్రీకరించారు. తొలుత ఆరిఫ్ మృతదేహానికి.. తర్వాత వరుసగా శివ, నవీన్, చెన్నకేశవుల మృతదేహాల పోస్టుమార్టం జరిగింది. అంతకు ముందు నిందితుల తల్లిదండ్రులకు వారి మృతదేహాలను చూపించారు.

### మృతదేహాల అప్పగింతకు ఎన్‌హెచ్చార్సీ బ్రేక్..

'దిశ'నిందితుల ఎన్‌కౌంటర్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్చార్సీ) స్పందించింది. ఎన్‌కౌంటర్‌పై తమకు సందేహాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేసుకునేంత వరకు మృతదేహాలను వారి తల్లిదండ్రులకు అప్పగించొద్దని శుక్రవారం రాత్రి జిల్లా పోలీసులను ఆదేశించింది. శనివారం ఉదయం కమిషన్ సభ్యులు మహబూబ్‌నగర్ వస్తున్నారని.. మృతుల తల్లిదండ్రులు, వారి తరఫున వైద్యుల సమక్షంలో మరోసారి మృతదేహాలను పరిశీలిస్తామని పేర్కొంది. కాల్పులు దగ్గరి నుంచి జరిపారా? ఏ రివాల్వర్ వాడారు తదితర అంశాలపై కమిషన్ ఆరా తీయనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్చార్సీ ఆదేశాల మేరకు నిందితుల మృతదేహాలను పోలీసులు స్థానిక జిల్లా ఆస్పత్రిలోని మార్చురీ రూమ్‌లో భద్రపరిచారు. అయితే, ఎన్‌కౌంటర్ తర్వాత మీడియాతో మాట్లాడిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్.. మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత అక్కడే నిందితుల తల్లిదండ్రులకు మృతదేహాలు అప్పగిస్తామని వెల్లడించారు. దీంతో పోలీసులు నిందితుల తల్లిదండ్రులు తమ కుమారుల మృతదేహాల కోసం అర్ధరాత్రి వరకు ఆస్పత్రిలోనే ఉండిపోయారు.

### అధికారులపై న్యాయమూర్తి ఆగ్రహం?

'దిశ'నిందితులకు పోస్టుమార్టం నిర్వహించేందుకు వచ్చిన వైద్యబృందం, స్థానిక అధికారులపై షాద్‌నగర్ జడ్జి ఆశ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. నిబంధనల ప్రకారం పోస్టుమార్టానికి న్యాయమూర్తి అవసరం లేదు. కానీ 'దిశ'ఉదంతం దేశవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలకు కారణం కావడంతో జడ్జి సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించాలని హైకోర్టు సూచించింది. అయితే, ఈ విషయం తెలియని అధికారులు.. పోస్టుమార్టం ప్రారంభించారు. ఆరిఫ్ మృతదేహానికి శవపరీక్ష పూర్తయిన తర్వాత జిల్లా ఆస్పత్రికి వచ్చిన న్యాయమూర్తి.. అధికారులపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రీజనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో కేకేఆర్స్ గౌతమ్ ఉత్తమ ప్రతిభ

**సాక్షి, హైదరాబాద్:** హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ అక్టోబర్ 20న నిర్వహించిన రీజనల్ మేథమెటికల్ ఒలింపియాడ్ పోటీ పరీక్షలో స్టేట్ లెవల్ సెలక్షన్‌లో డా.కేకేఆర్స్ గౌతమ్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు అర్హత సాధించారు. 10వ తరగతి విద్యార్థులు పి.కార్తికేయ, జె.యశ్వంత్, వి.వి.ఎస్‌తోపాటు ఈ పాఠశాల పూర్వ విద్యార్థులు ఎం.హృషికేష్‌రెడ్డి, టి.శ్రీలక్ష్మీతేజ్ జనవరి 19న నిర్వహించనున్న ఐఎన్ఎమ్ఓ పరీక్షకు హాజరవుతారని ప్రిన్సిపల్ ఎమ్.సత్యరామ్ తెలిపారు.

### స్పోర్ట్స్ డ్రిల్స్, యోగాలో శ్రీచైతన్య కొత్త రికార్డులు

**సాక్షి, హైదరాబాద్:** శ్రీ చైతన్య విద్యార్థులు స్పోర్ట్స్ డ్రిల్స్, యోగాలో నూతన ప్రపంచ రికార్డును నెలకొల్పారు. దేశంలోని 7 రాష్ట్రాలకు చెందిన 1 నుంచి 5వ తరగతులు చదివే 1,42,000 మంది శ్రీచైతన్య విద్యా సంస్థల ప్రాథమిక విద్యార్థులు 214 కేంద్రాల్లో ఒకే సమయంలో 7 నిమిషాలు స్పోర్ట్స్ డ్రిల్స్ ప్రదర్శించారు. అలాగే 3 నుంచి 5వ తరగతి ఈ చదివే 76 వేల మంది శ్రీచైతన్య విద్యార్థులు 214 కేంద్రాల్లో ఒకే సమయంలో 15 నిమిషాలు 45 రకాల యోగాసనాలు ప్రదర్శించి రికార్డును నెలకొల్పారు.

### మ్యాథ్స్ఒలింపియాడ్‌లో నారాయణ గెలుపుబావుటా

**సాక్షి, హైదరాబాద్:** రీజనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో తమ రికార్డులను తామే అధిగమించినట్లు నారాయణ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డా.పి.సింధూర నారాయణ తెలిపారు. హంగేరీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్‌లో వెండి, కాంస్య పతకాలు సాధించిన ఎమ్.ఆదర్శ్‌రెడ్డి, వీ సాయితేజను సింధూర ప్రశంసించారు. రుమేనియాలో జరిగిన జూనియర్ ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌లో వెండి పతకం గెలిచిన జేవీ ఆదిత్యను, ఉక్రెయిన్‌లో నిర్వహించిన యూరోపియన్ గర్ల్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో కాంస్యం సాధించిన వీవీ సాయికీర్తనను అభినందించారు.



సాక్షి
శనివారం, డిసెంబర్, 7

# 'తక్షణ' న్యాయం

'దిశ'పై గత నెల 27 రాత్రి సామూహిక అత్యాచారం చేసి, సజీవదహనం చేసిన నరరూప రాక్షసులు నలుగురూ శుక్రవారం వేకువజామున పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. సహజంగానే జాతీయ మానవహక్కుల సంఘం వెనువెంటనే స్పందించి దీనిపై విచారణకు తమ సభ్యుల్ని పంపుతోంది. తెలంగాణ హైకోర్టు కూడా ఈ నెల 9న విచారిస్తామంటోంది. ఎన్‌కౌంటర్ గురించి తెలిశాక తెలంగాణలో, ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో మాత్రమే కాదు...దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీసులకు ప్రశంసలు లభిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వివిధ నగరాల్లో వారిని అభినందిస్తూ ర్యాలీలు జరిపారు. 'దిశ' ఉదంతం సమాజం మొత్తాన్ని కదిలించింది. ఆమెకు సరైన న్యాయం దక్కాలంటే ఆ నలుగురినీ వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలని తొమ్మిదిరోజులుగా జనం డిమాండ్ చేస్తున్నారు. నిందితుల్ని షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో బంధించినప్పుడు వందలాదిమంది చుట్టుముట్టి వారిని తక్షణం తమకప్పగించాలని డిమాండ్ చేశారు. రిమాండ్ కోసం వారిని తరలించడం సాధ్యం కాక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ను పోలీస్ స్టేషన్‌కే రప్పించవలసివచ్చింది. చివరకు లాఠీచార్జి చేసి చెదరగొడితే తప్ప నేరగాళ్లను జైలుకు పంపడం సాధ్యపడలేదు. అత్యాచారమైనా, మరే ఇతర నేరమైనా జరిగినప్పుడు అందరిలో ఆందోళన కలుగుతుంది. ఆగ్రహం కట్టలు తెంచుకుంటుంది.ఎన్నాళ్లిలా అనే ప్రశ్న మొలకెత్తుతుంది. 'దిశ' ఉదంతం అంతకుమించిన స్పందన తీసుకొచ్చింది. స్థానికంగానే కాదు... దేశవ్యాప్తంగా కూడా అందరినీ కదిలించింది. ఎందుకంటే ఈ నేరగాళ్లు ప్రదర్శించిన క్రౌర్యం తీవ్రత ఆ స్థాయిలో ఉంది. ఆమెను నమ్మించి, ఒక పథకం ప్రకారం నిర్మానుష్య ప్రాంతానికి వచ్చేలా చేసి అదును చూసి కాటేశారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండగా ఆమెపై మృగాల్లా ఒకరి తర్వాత ఒకరు దాడి చేశారు. తమ రాక్షసత్వం కప్పిపుచ్చుకోవడానికి కొన ఊపిరితో ఉన్న ఆమెను సజీవ దహనం చేశారు.

ఈ కేసులో పోలీసులపై తీవ్ర ఒత్తిడి వచ్చింది. చానెళ్లలో సామాన్య మహిళలు, బాలికలు సైతం వారి పనితీరును ప్రశ్నించారు. ఆ నేరగాళ్లలో లారీ నడుపుతున్న వ్యక్తికి కనీసం డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా భారీ వాహనాన్ని నడిపాడు. టోల్‌గేటు దగ్గరలో వాహనం నిలిపి ఉంచినప్పుడు అక్కడికొచ్చిన పోలీసులు దాన్ని వేరేచోట పెట్టుకోవాలని చెప్పారు తప్ప అందులో తరలిస్తున్నదేమిటో, వారి వివరాలేమిటో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. సర్వీస్ రోడ్డులో ఓ పక్కకు వాహనం నిలిపివుంచినా అటుగా పోయిన గస్తీ పోలీసులు పట్టించుకోలేదు. కనీసం 'దిశ' ఉదంతం తర్వాతైనా వారిలో అప్రమత్తత ఏర్పడ్డ సూచనలు కనబడలేదని ఒకటి రెండు చానెళ్లు ప్రసారం చేసిన కథనాలు వెల్లడించాయి. ఘటన గురించి తెలిశాక బాధితురాలి కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారిని సరిగా పట్టించుకోలేదు. పైగా బాధితురాలి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడారు. మూడు పోలీస్‌స్టేషన్లు తిరిగాకగానీ వారి ఫిర్యాదు స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. అది జరిగాక కూడా సీసీ టీవీ ఫుటేజ్‌లు చూడటానికే బోలెడు సమయం పట్టింది. ఇప్పుడు జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతూ ఉండొచ్చు. కానీ వ్యవస్థను పట్టిపీడిస్తున్న మౌలిక సమస్యను ఇవి మరుగుపరచకూడదు. ఒక కుటుంబం 'దిశ'ను కోల్పోవడానికి కారణమైన ఈ వైఫల్యాలన్నిటినీ సమూలంగా పెకిలించాలి. లేనట్టయితే ఇవే పరిస్థితులు పునరావృతం అవుతాయి. ఇక్కడ మాత్రమే కాదు... దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి ఉదాసీనతే రాజ్యమేలుతోంది. కనుక అన్ని రాష్ట్రాలకూ ఇది గుణపాఠం కావాలి. ఈ విషయంలో ఇప్పటికే చాలా మార్పొచ్చింది. తెలంగాణతోపాటు అనేకచోట్ల పోలీసు విభాగాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. మహిళల రక్షణపై దృష్టి పెట్టాయి. తెలంగాణ పోలీసు విభాగం ఇంటర్నెట్ లేని సందర్భాల్లో సైతం తమ హాక్-ఐ యాప్ పనిచేసేలా మార్పులు చేసింది. ఆపత్సమయాల్లో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే నేరుగా 100కు ఫోన్ వెళ్లేలా సవరించారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు కూడా నేరం ఎక్కడ జరిగినా బాధితులొచ్చినప్పుడు కేసు నమోదు చేసుకుని పని ప్రారంభించడం మొదలుపెట్టారు. వెనువెంటనే దాని ఫలితాలు కూడా కనబడటం ప్రారంభించాయి.

అయితే న్యాయవ్యవస్థలో అంతూ దరీ లేకుండా ఏళ్ల తరబడి సాగుతున్న విచారణలు కూడా నేరగాళ్లలో ఒక రకమైన భరోసా కలిగిస్తున్నాయి. తమకేమీ కాదన్న ధైర్యాన్నిస్తున్నాయి. నిరుడు మార్చి నాటికి దేశవ్యాప్తంగా అత్యాచారాలు, ఇతర లైంగిక నేరాలకు సంబంధించి 1,66,882 కేసులు వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. దర్యాప్తులో జాప్యం, సాక్ష్యాధారాల సేకరణలో లోటుపాట్లు ఇందుకు కారణమవుతున్నాయి. ఆఖరికి డీఎన్ఏ సాక్ష్యాలు కూడా న్యాయస్థానాల్లో నిలబడని దుస్థితి ఉంది. కనుకనే స్వల్ప కేసుల్లో మాత్రమే నిందితులకు శిక్షలు పడుతున్నాయి. దేశంలో కఠిన శిక్షలు లేకపోవడం వల్లే నేరాలు జరుగుతున్నాయని భావించి నిర్భయ వంటి చట్టం తీసుకొచ్చారు. పోక్సో చట్టాన్ని కూడా కఠినం చేశారు. కానీ నేరం జరిగిందని సమాచారం వచ్చిన దగ్గర్నుంచి న్యాయస్థానాల్లో నిందితులపై చార్జిషీట్లు నమోదు చేసి విచారణ పూర్తయ్యే వరకూ జరిగే క్రమమంతా ఎంతో లోపభూయిష్టంగా ఉంటోంది. దీన్నంతటినీ పట్టించుకుని సరిచేసేందుకు ఎవరూ చిత్తశుద్ధితో పూనుకోవడం లేదు. నిందితులు నిర్దోషులుగా విడుదలైనప్పుడు దర్యాప్తు చేసిన అధికారులను అందుకు బాధ్యుల్ని చేసి చర్య తీసుకోవాలని నాలుగేళ్లక్రితం సుప్రీంకోర్టు సూచించింది. అది ఆచరణలో పెడితే ఎంతోకొంత ఫలితం ఉండొచ్చు. బాధితురాలి తండ్రి ఎన్‌కౌంటర్‌పై స్పందిస్తూ ఇది ఉపశమనం మాత్రమేనని చెప్పిన మాట విలువైనది. ఇలాంటి నేరాలను శాశ్వతంగా రూపుమాపడానికి శాయశక్తులా కృషి చేయడమే 'దిశ'కు మనం అర్పించే నిజమైన నివాళి అవుతుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, తిథి శు.ఏకాదశి పూర్తి (24 గంటలు) నక్షత్రం రేవతి రా.12.55 వరకు, తదుపరి అశ్వని వర్జ్యం ఉ.11.40 నుంచి 1.24 వరకు, దుర్ముహూర్తం ఉ.6.20 నుంచి 7.48 వరకు, అమృతఘడియలు... రా.10.50 నుంచి 12.02 వరకు, గీతా జయంతి.

సూర్యోదయం : 6.21
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

# స్వల్ప ఆదాయాలతో రైతుకు చేటు

విశ్లేషణ



దేవీందర్ శర్మ

**భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాల్లో తక్కువ ధరతో దొరికే వ్యవసాయ ఉత్పత్తులను రూపొందించాలనేది ప్రపంచ మార్కెట్ డిజైన్‌గా అమలవుతోంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ అవసరాల కోసం కాకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం హైటెక్ టెక్నాలజీని వాడుతున్న విధానాలపై ప్రపంచ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా ఆగ్రహిస్తున్నారు. రైతుకు సబ్సిడీలు కాదు.. తమ ఉత్పత్తులను తక్కువ ధరలకు అందించడం ద్వారా రైతులే దేశానికి సబ్సిడీలు అందిస్తున్నారు. వ్యవసాయంలోకి కార్పొరేషన్లు ప్రవేశించే కొద్ది చిన్న కమతాలు తప్పుకుంటున్నాయి. వాటిలో వచ్చే స్వల్ప ఆదాయాలు రైతుకు ప్రాణాంతకంగా మారుతున్నాయి.**

న్యాయవాదిగా కూడా పనిచేస్తున్న ఒక న్యూయార్క్ రైతు కొన్ని రోజుల క్రితం ట్వీట్ చేశారు: నేను ఈరోజు న్యాయవాద కార్యాలయంలో పనిచేయడానికి ప్రయత్నించాను. కానీ నా మనసు మాత్రం గ్రామీణ ప్రాంతాల్లో నేను చూస్తున్న పాడిపరిశ్రమ రైతుల జీవితాల్లో విధ్వంసం చుట్టూ తిరిగింది. చాలా కాలం నుండి మా ప్రాంతంలో రైతులు తమ వద్ద ఉన్న కొన్ని భూములను అమ్మివేసి మిగిలిన భూములను కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇది ఎక్కడికి దారితీస్తుంది? నాకు తెలీదు. ప్రపంచంలోనే అత్యంత సమర్థవంతమైన వ్యవసాయ ఉత్పాదక వ్యవస్థ ఉన్న అమెరికాలోనే వ్యవసాయ సంక్షోభం ఈ స్థితిలో అలుముకుంటున్నప్పుడు మనం కూడా ఒకసారి ఆగి మళ్లీ ఆలోచించాల్సి ఉంది.

ఇప్పుడు మనం వేయవలసిన ప్రశ్న ఒక్కటే. అమెరికా వ్యవసాయ విధానం ఉద్దేశపూర్వకంగా వ్యవసాయరంగాన్ని క్షీణింపచేయాలనే ఉద్దేశాన్ని కలిగి ఉందా? ఈ అర్థంలో భారతీయ వ్యవసాయం కూడా ఆ దశలోనే ప్రయాణిస్తోందా? భారతదేశంలో భూకమతాలు చిన్నవి కాబట్టి ఆర్థికంగా లాభసాటి కావు అంటే అర్థం చేసుకోవచ్చు కానీ సగటు వ్యవసాయ పొలం పరిమాణం 444 ఎకరాలుగా ఉంటున్న అమెరికాలో కూడా చిన్న కుటుంబ పొలాలు వైదొలగాల్సిందేనా? సగటు వ్యవసాయ భూమి పరిమాణం కనీసం 4,331 హెక్టార్లుగా ఉంటున్న ఆస్ట్రేలియాలోనూ వ్యవసాయం నష్టదాయకంగానే ఉండాల్సిందేనా? ఈ దేశాల్లో సాగుతున్న వ్యవసాయ పరిమాణాన్ని చూస్తే అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు వ్యవసాయం నుంచి వైదొలగడానికి సమర్థమైన కారణం లేదు. చిన్న కమతాలు లాభదాయకం కాదు అనుకున్నట్లయితే, భారీ కమతాలు కూడా ఆర్థికంగా లాభదాయకం ఎలా కాకుండా పోతాయి? భారతదేశంలోనే కాదు ప్రపంచంలో అన్ని ప్రాంతాల్లోనూ రైతులకు నిజ ఆదాయాలను తోసిపుచ్చి వ్యవసాయ ఆదాయానికి వారిని దూరం చేస్తున్నారన్న వాస్తవాన్ని అంగీకరించడానికి మన విధాన నిర్ణేతలు తిరస్కరించకపోతే పరిస్థితులు ఇలా ఉండేవి కావు.

మొట్టమొదటగా, మనం ఒక విషయం పట్ల స్పష్టంగా ఉందాం. అమెరికాలో ఎప్పట్నుంచో సన్నకారు రైతులను వ్యవసాయం నుంచి దూరం చేస్తూ వస్తోంది. ముఖ్యంగా అమెరికా వ్యవసాయం సంక్షోభ పరిస్థితుల్లో ఉన్నప్పుడు కూడా అమెరికన్ వ్యవసాయ మంత్రి సోన్నీ పెరుడ్యు ఏమాత్రం జంకూ గొంకూ లేకుండా ఒక ప్రకటన చేశారు. 'అమెరికాలో, పెద్దది మరింత పెద్దది అవుతుంది అలాగే చిన్నది అడ్రస్ లేకుండా పోతుంది'. అమెరికాలో నాటి అధ్యక్షులు రిచర్డ్ నిక్సన్, గెరాల్డ్ ఫోర్డ్ హయాంలో పనిచేసిన మాజీ అమెరికా వ్యవసాయ మంత్రి ఎర్ల్ బట్జ్ సుప్రసిద్ధ వ్యాఖ్య చేశారు. 'మరింత ఎదగండి లేదా వెళ్లిపోండి.' దీనితర్వాత అత్యంత జాగ్రత్తతో 'ప్రపంచానికి తిండి పెట్టడం' అనే పేరిట సిద్ధం చేసిన ముసాయిదాలో 'భారీ స్థాయిలో మిగులు ఉత్పత్తి చేయండి' అని రైతులకు పిలుపునిచ్చారు. అదనపు ఉత్పత్తి అంటే వాస్తవానికి ధరలు పడిపోవడమనే అర్థం. ఇలాంటి దూకుడు చర్య అమెరికా సన్నకారు రైతులను ఇక్కట్లలోకి నెట్టింది. ప్రభుత్వ విధానాల కారణంగానే చాలామంది వ్యవసాయ



వాణిజ్యం నుంచి పక్కకు తప్పుకోవడమే కాకుండా వ్యవసాయ రంగం నుంచి తీవ్ర నిరాశతో వైదొలిగారు.

మరింత భారీగా పెరగండి అనే విధానం వ్యవసాయంపై కార్పొరేట్ నియంత్రణ పెరిగేందుకు ఆహ్వానం మాత్రమే. ఇది అభివృద్ధి చెందుతున్న ప్రపంచాన్ని కూడా అనుసరించాలంటూ రాసిన అలిఖిత విధానంగా కూడా మారింది. అది ప్రపంచ వాణిజ్య వ్యవస్థ కావచ్చు లేక ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సీఈపీ) కావచ్చు ప్రపంచ వాణిజ్య విధానాలన్నీ బడా వ్యవసాయ దిగ్గజ సంస్థలు వ్యవసాయరంగంలోకి ప్రవేశించే వాతావరణాన్ని కలిగిస్తున్నాయి. పోటీ అనేది మార్కెట్ మంత్రంగా మారినందున, అభివృద్ధి చెందుతున్న, వెనుకబడి ఉన్న దేశాల్లో తక్కువ ధరతో దొరికే వ్యవసాయ ఉత్పత్తులను రూపొందించాలని నిర్బంధిస్తున్నారు. దీనివల్ల లక్షలాది సన్నకారు రైతులు వ్యవసాయం నుంచి నిష్క్రమిస్తున్నారు.

దీన్ని ఇంకాస్త విపులంగా చూద్దాం. చైనాలో అతి పెద్ద పాడిపరిశ్రమ విస్తీర్ణం 2 కోట్ల 25 లక్షల ఎకరాలు. ఇది పోర్చుగల్ విస్తీర్ణంతో సమానం. వరల్డ్‌అట్లాస్.కామ్ ప్రకారం ఈ వ్యవసాయ క్షేత్రంలో లక్ష ఆవులు ఉన్నాయి. ఇక రెండో అతిపెద్ద పాడి పరిశ్రమ కోటీ 10 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇది కూడా చైనాలోనే ఉంది. ప్రపంచంలోని పది అతిపెద్ద పాడి పరిశ్రమ సంస్థల్లో ఎనిమిది సంస్థలు ఆస్ట్రేలియాలో ఉంటున్నాయి. రీజనల్ దిగ్గజ సంస్థ అయిన ఆర్‌సీఈపీ ద్వారా చైనా తదితర దేశాలు భారత్‌లోకి దూరాలని తీవ్రంగా ప్రయత్నించాయంటే ఆశ్చర్యపడాల్సింది ఏదీ లేదు. సరైన సమయంలో భారతదేశం ఆర్‌సీఈపీలో చేరకూడదని నిర్ణయించుకోవడం ముదావహం. మన దేశంలో పాడిపరిశ్రమలో కోటి మంది ప్రజలు భాగం పంచుకుంటున్నారన్నది తెలిస్తే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, చైనాల నుంచి తక్కువ ధరకు లభించే పాల ఉత్పత్తులు భారత్‌లోని కోటి మంది జీవితాలను ధ్వంసం చేసిపడేసేదని అర్థమవుతుంది.

వ్యవసాయం కేసి చూస్తే గ్రామీణ భారత్‌లాగే గ్రామీణ అమెరికా కూడా తీవ్రమైన వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. భారత్‌కు లాగే అమెరికాలోని 17 రాష్ట్రాల్లో అంటే దాదాపు సగం దేశంలోని రైతు కుటుంబాల సగటు ఆదాయం సంవత్సరానికి 20 వేల రూపాయంగా మాత్రమే ఉంటోంది. అంటే అమెరికా వ్యవసాయం కూడా ఏమంత మంచిగా సాగటం లేదు. అమెరికాలో సగం పైగా రాష్ట్రాల రైతుల ఆదాయం ప్రతికూల గమనంతో ఉంది. అమెరికన్ ఫామ్ బ్యూరో ఫెడరేషన్ ప్రకారం 91 శాతం రైతులు, వ్యవసాయ కూలీలు సంక్షోభంలో ఉన్నారు. ఇది వారి మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడంతోపాటు అక్కడి వ్యవసాయ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉందంటే అమెరికా రైతులు వ్యవసాయాన్నే వదిలేయాల్సి వస్తుందని భయపడుతున్నారు. 2019లో అమెరికా వ్యవసాయ రుణం 416 బిలియన్ డాలర్లకు పెరగనుందని అంచనా. ఇది 1980ల నుంచి చూస్తే అత్యధిక మొత్తంగా చెప్పాలి. అనేక దశాబ్దాలుగా మన దేశంలోనూ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు స్తంభించిపోయి ఉన్నాయి. ఇప్పుడు ఉల్లిపాయ ధరలు కిలో వంద రూపాయలకు పెరిగితేనే అల్లాడిపోతున్నాం. కానీ గత 30 సంవత్సరాలుగా అమెరికాలో రైతులు పండించిన పంటల ధరలు ఏమాత్రం పెరగలేదు. ఇక 5 దశాబ్దాలుగా మొక్క జొన్న ధరలు అలాగే ఉంటున్నాయి.

వ్యవసాయరంగంలో అత్యున్నత సాంకేతిక జ్ఞానాన్ని వినియోగిస్తూ, తక్కిన ప్రపంచానికి ఒక ఉదాహరణగా నిలబడుతున్న దేశంలోనే వ్యవసాయ సంక్షోభం ఇంత తీవ్రస్థాయిలో ఉందంటే, భారతీయ వ్యవసాయరంగంలో అత్యధునాతన (తరచుగా అవాంఛిత) టెక్నాలజీని మరింతగా వాడాలని చేస్తున్న సూచనలు, సలహాలు అసందర్భపూరితమనే చెప్పాలి. టెక్నాలజీకి ఎవరూ వ్యతిరేకం కాదు. కానీ దాన్ని మరొకరి వాణిజ్య ప్రయోజనాల కోసం కాకుండా అవసరాలపై ఆధారపడి టెక్నాలజీని వినియోగించాలి. వ్యవసాయంలో పూర్తిగా హైటెక్ పద్ధతులను అవలంబిస్తున్న దేశంలోనే గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలు పట్టణ ప్రాంతాల్లో ఆత్మహత్యల కంటే 45 శాతం ఎక్కువగా ఉంటున్నాయంటే, భారతీయ వ్యవసాయాన్ని మనం పూర్తిగా పునర్నిర్మించాల్సిన సమయం ఆసన్నమైంది. చిన్న కమతాలను వృద్ధి చేయడం ద్వారానే గ్రామీణులు పట్టణాలకు వలస వెళ్లడాన్ని తగ్గించగలమా? దేశీయ అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తూ సరికొత్త వ్యూహాన్ని వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ అవలంబించడం ద్వారానే మన వ్యవసాయాన్ని పర్యావరణ స్వావలంబన, ఆర్థిక లాభదాయకత వైపు తీసుకుపోవచ్చు.

భారతీయ రైతులు గత రెండు దశాబ్దాలుగా అంటే 2000–01 నుంచి 2016–17 మధ్య కాలంలో ప్రతి సంవత్సరం 14 శాతం నష్టాలను చవిచూస్తున్నారు. ఇది వినియోగదారులకు తాము చెల్లించాల్సిన దానికంటే 25 శాతం తక్కువ ధరలతో మేలు కలిగిస్తోంది. మరోమాటలో చెప్పాలంటే ఇన్నేళ్లుగా వ్యవసాయదారులు దేశానికే సబ్సిడీని అందిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తున్న ప్రపంచ ఆర్థిక డిజైన్ ప్రపంచ వ్యాప్తంగా రైతుల్లో ఆగ్రహావేశాలను పెంచుతోంది. జర్మనీ, హాలండ్, కెనడా, అమెరికా, భారతదేశంలోని వీధుల్లో రైతుల నిరసనలకు దిగుతున్నారు. ఆస్ట్రేలియా జాతీయ రైతుల సమాఖ్య అధ్యక్షుడు మెక్‌లాక్లాన్ కొన్నాళ్ల క్రితం ఒక రైతుల ర్యాలీలో చెప్పిన మాట ప్రపంచ వ్యాప్తంగా రైతు ఆగ్రహానికి కారణాన్ని స్పష్టం చేస్తోంది. అదేమిటంటే..'' తక్కిన ఆస్ట్రేలియా మొత్తానికి సబ్సిడీని అందించే పనిలో మేం అలసిపోయాం, రోగగ్రస్తులమైపోయాం''.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్ : hunger55@gmail.com

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**




## సోషల్ మీడియా

### మొక్కుతున్నా



"తెలంగాణ పోలీసులకు చేతులెత్తి మొక్కుతున్నాను. రియల్ హీరోలు మీరే. మనకి కష్టమొచ్చినా కన్నీళ్లొచ్చినా పోలీసోడే వస్తాడు. నువ్వే దిక్కు రక్షించాలని దేవుడికి మొక్కినా ఆ దేవుడు కూడా పంపించేది పోలీసోడినే..."

– పూరీ జగన్నాథ్, దర్శకుడు

### ఒక రోజు



"ఇప్పుడు మీరు ఎవరినైతే అభినందిస్తున్నారో వాళ్లు ఏదో ఒక రోజు మీ కోసం కూడా వస్తారు. చట్ట ప్రకారం మాత్రమే నిందితులను శిక్షించాలి. న్యాయం వేగంగా అందేలా చూడాలి. అంతేకానీ, ఎన్‌కౌంటర్ చేసి చంపడాన్ని సమర్థించడమంటే సమాజంలోని అటవిక మనస్తత్వాన్ని బయటపెట్టుకోవడమే"

– రాహుల్ కన్వల్, జర్నలిస్ట్

### మరణ శిక్ష



"బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడే పోలీసులకు మరణశిక్ష విధించాలని ప్రకాష్ కదమ్ వర్సెస్ రామ్ ప్రసాద్ విశ్వనాథ్ గుప్తా కేసులో నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్ పేర్కొంది. హైదరాబాద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకం అని చాలా స్పష్టంగా తెలుస్తోంది"

– మార్కండేయ కట్జూ, మాజీ న్యాయమూర్తి

### కన్నీళ్లు



"పోలీసుల కాల్పుల్లో మరణించిన రేపిస్ట్‌ల కోసం నేను ఎలాంటి ఉద్వేగ స్థితిలోనూ కన్నీళ్లు కార్చను. కానీ, పోలీసులు చెబుతున్నారు కాబట్టి నమ్మడం తప్ప.. ఎన్‌కౌంటర్‌లో చనిపోయినది నిజంగా రేపిస్టులేనని నూరు శాతం నమ్మలేం. ఇలా చంపేయడాన్ని అభినందిస్తే, పోలీసులకు ఎవరినైనా చంపే అధికారం ఇచ్చినట్టే. అది ప్రమాదకరం"

– వీర్ సంఘ్వి, యాంకర్

### బహిష్కరణ



"దేశం మొత్తం ఏకమై రేపిస్ట్‌లకు బలమైన సందేశం పంపుతున్న సందర్భంలో మంత్రి స్మృతి ఇరానీపై కాంగ్రెస్ ఎంపీలు భౌతిక దాడికి పాల్పడ్డారు. వారిని సభ నుంచి బహిష్కరించాలి"

– అఖిలేష్ మిశ్రా, సీఈవో

### దేశం



"ఈ దేశంలో రేపిస్ట్ తక్కువ కులం వాడైతే తప్పకుండా జైలులో తోస్తారు. రేపిస్ట్ ధనవంతుడు, ఉన్నత కులంవాడు, రాజకీయ నేత కుమారుడైతే సులువుగా బయటపడిపోతాడు. ప్రస్తుతం మనకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేతల్లో కొందరిపై అత్యాచార ఆరోపణలున్నాయి. కొందరిపై హత్యారోపణలు కూడా ఉన్నాయి. నిజానిజాలు దేవుడికే తెలియాలి. అత్యాచారం, లైంగిక వేధింపుల బాధితులు ఈ దేశంలోని చట్టాలతో అలిసిపోతున్నారు. దశాబ్దాల తరబడి కేసులు సాగుతున్నాయి. అత్యాచార బాధితురాలు మైనర్ అయితే, ఆమెకు న్యాయం అందేసరికి 45 ఏళ్ల వయసు వస్తోంది. ఈ దేశంలో ధనవంతులు, ఉన్నత కులాలవారు సులువుగా తప్పించుకుంటున్నారు. కొందరికి రాజకీయ పార్టీలు టికెట్లు కూడా ఇస్తున్నాయి. అత్యాచారాలు నిరోధించడానికి మనందరం నిరంతరం, ఒక పద్ధతిలో పట్టుదలతో సుదీర్ఘంగా పని చేయాల్సి ఉంది"– చిన్మయి శ్రీపాద, గాయని

# కాకికీ ఓరోజు వస్తుంది



శ్రీరమణ

ఒకవైపు మాతృభాషని పక్కన పెడుతున్నారని, మరోవైపు అమరావతి విశ్వవిఖ్యాత క్యాపిటల్‌ని కూల్చేస్తున్నారనీ తెలుగు దేశం పార్టీ యాగీ చేస్తోంది. బంగారు గుడ్లు పెట్టే బాతుని చంపేస్తున్నారని వాపోతున్నారు. అవసరాల్ని బట్టి భాషలు, పనులు అలవడతాయ్. ఒకప్పుడు బతుకుతెరువు కోసం రంగూన్ వలస వెళ్లేవారు. అక్కడ హార్బర్‌లో కొయ్యదుంగలు మోస్తూ, ఇంకా అనేక చిన్న చిన్న పనులు చేస్తూ తెలుగు ప్రాంతం నుంచి వెళ్లిన నిరక్షరాస్యులుండేవారు. చాలా శ్రమించేవారు. ఆదాయం తక్కువే ఉండేది. అయినా జాగ్రత్తగా బతికి, మిగిలిచ్చి ఇంటికి డబ్బు పంపేవారు. కొన్ని సంవత్సరాలకిగానీ సొంత గూటికి వచ్చేవారు కాదు. వాళ్లంతా అక్కడి స్థానిక భాషలు నేర్చారు. బర్మీస్ స్థానిక యాసలతో సహా పొందిగ్గా మాట్లాడేవారు. 'నేర్చుకోవాలి.. చచ్చినట్టు. లేకుంటే వ్యాపారులు దళారులు మా నెత్తురు తాగేస్తారు' అని వివరం చెప్పారు. భాష తెలియకపోతే ఇంకా మోసపోతామని చెప్పేవారు. మావూళ్లో బర్మీస్ అనర్గళంగా మాట్లాడగలిగినవాళ్లు పాతికమంది పైగా ఉండేవారు. ఇక్కడికి వచ్చాక వాళ్లకా భాషతో అస్సలు పని లేకుండా పోయింది. దాని గురించి దిగులు పడాల్సిన పనేముంది? కాలమాన పరిస్థితుల్ని బట్టి ఆధిక్యతలు మారిపోతూ ఉంటాయి. కరెంటు వచ్చాక కిరసనాయిల్ అవసరం తీరింది.

అక్షర తూణీరం



ఒకనాటి నిత్యావసరం అది. అలాగే అనేకం. 'మేం చిన్నప్పుడంతా గబ్బునూనె బుడ్డికిందే చదువుకున్నాం. ఇంతవాళ్లం అయ్యాం. దాన్ని మర్చిపోకూడదు. వెలిగించండి లాంతర్లు' అంటూ ఉద్యమించాల్సిన అవసరం లేదేమో?! ఇవన్నీ మన సంస్కృతిలో భాగం అనుకోకూడదు. దీపం బుడ్డి అనాగరికం మాత్రమే.

కుక్కకి కూడా ఒకరోజు వస్తుందని సామెత. అలాగే కాకికి కూడా ఒక గౌరవం వస్తుందన్నది నిజం. మొన్న మొన్నటిదాకా ప్రకృతిలో చాలా నీచమైన, హేయమైన ప్రాణి కాకి. దాని రంగు బాగుండదు. దాని అరుపు, పిలుపు బాగుండవు. ఇనుపముక్కుతో వికారం నిలువెల్లా. శనేశ్వరుడి వాహనంగా అదొక అపఖ్యాతి. రకరకాల కారణాల వల్ల కాకి జాతి బాగా క్షీణించింది. నగరాల్లో వాటి ఉనికి అస్సలు లేదు. గ్రామాల్లో ఎక్కడైనా, ఎప్పుడైనా కాకి అరుపు వినిపిస్తోంది. మనదసలే నమ్మకాల నేల. పితృ కార్యాలప్పుడు పెద్దల్ని స్మరించి వికర పిండాలని కాకులకి అర్పించి కార్యకర్తలు తృప్తి పడతారు. 'పియ్య తినెడి కాకి పితరుడెట్లాయెరా' అని ప్రజాకవి వేమన సూటిగా మన చాదస్తాన్ని ప్రశ్నించాడు. అయినా ఈ ఆచారం ఆగలేదు. అన్నంలో ఘుమఘుమలాడే నెయ్యి పోసి చేతినిండా తీసుకుని ముద్ద చేసి వికర పిండాన్ని సిద్ధం చేస్తారు. కాకులకు కన్పించే రీతిలో దాన్ని ఎత్తుమీద పెట్టి వాటి రాక కోసం ఆశగా చూస్తుండేవారు. ఎందుకో ఒక్కోసారి వచ్చేవి కావు. అమ్మో! పెద్దలు అలిగారని భావించి, బోలెడు వాగ్దానాలు చేస్తూ దణ్ణాలు పెట్టేవారు. ఫలానా పెళ్లి జరిపిస్తాం, ఆ పని చేయిస్తాం ఇలా బోలెడు అనుకున్న మాటల్ని పైకి చూస్తూ చెబుతారు. ఎప్పటికో ఒక కాకి వస్తుంది. దాని పిలుపుతో కాకిమూక దిగుతుంది. మెతుకు లేకుండా తినేసి వెళ్తాయి. 'అదీ ఆవిడకి లేదా ఆయనకి లోపల అనుమానం ఉంది. ఇప్పుడు తీరింది' అనుకుంటూ లోపలికి వెళ్లేవారు.

ఇప్పుడు కాకులకి మహర్దశ పట్టింది. మన నగరాల్లో పెంపుడు చిలకల్లా హాయిగా గారాబంగా పంజరాల్లో పూర్తి వెజిటేరియన్‌గా బతికేస్తున్నాయ్. ఒక అవసరంలోంచి ఆలోచనలు పుడతాయ్. అంత్యేష్టికి ఆబ్దికానికి కాకుల కొరత తీవ్రంగా ఉందని గ్రహించిన ఓ మేధావి కాకుల్ని చేరదీశాడు. ఫోన్ చేసినా, కబురు పెట్టినా కాకి పంజరంతో సహా స్పాట్‌కి వస్తాడు. పితరుడి హోదాలో పిండం తినగానే దక్షిణ తీసుకుని యజమాని తన బండిమీద వెళ్లిపోతాడు. చేతిలో పది కాకులుంటే పదిమంది కాకి మనుషుల్ని బతికిస్తాడు. రేటెంత అంటే గిరాకీ, ఒత్తిడిని బట్టి అంటున్నారు. మునుపు నటించే కుక్క, కోతి, జింక, చిలక, పాము, ఉడుత లాంటి వాటికి భలే డిమాండ్ ఉండేది. ఇప్పుడీ విధంగా కాకికి ఒక రోజు వచ్చింది. అవసరాన్ని బట్టి అన్నీ వస్తాయ్. కనుక చంద్రబాబు దేని గురించీ అతిగా అలజడి పడాల్సిన పన్లేదు. (వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

# 'దిశ' తిరిగిన న్యాయం

న్యాయం అనేది ఎప్పుడూ వివాదాస్పదమే. ఎందుకంటే, అది కొందరికి మాత్రమే తీపి, వేరెందరికో చేదు. అందుకే అంతిమ న్యాయం ఎలా ఉన్నా, కనీసం అది అమలు జరిగిన తీరైనా 'న్యాయం'గా ఉండాలని చాలామంది భావిస్తారు. అమలు జరిగే తీరులోని న్యాయాన్యాయాలు కూడా సాపేక్షమే. ఎందుకంటే, అమలు తీరుపైనే అంతిమ న్యాయం ఆధారపడి ఉంటుంది కాబట్టి. షాద్‌నగర్ ఎన్‌కౌంటర్‌తో న్యాయం–నడిరోడ్డుకు కాకపోయినా–నాలుగు రోడ్ల కూడలిలోకి మరోసారి వచ్చింది. పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. దీంతో ఇక అత్యాచారాలన్నీ ఆగిపోతాయా అని ప్రశ్నిస్తున్నారు. దిశ అత్యాచార ఘటన ఎంతగా కలిచివేసిందో, ఈ ఎన్‌కౌంటర్ కూడా అంతే కలవరపరిచిందని వాపోతున్నారు. ఇలా అయితే, దేశంలో చట్టానికి, న్యాయానికీ, రాజ్యాంగానికి ఇక విలువేముంటుందని వారు నిలదీస్తున్నారు.

షాద్‌నగర్ ఘటనపట్ల హర్షం వ్యక్తం చేసేవారి వాదన మరోలా ఉంది. నిందితులను గుర్తించి, పట్టుకుని, సాక్ష్యాలు సేకరించి, వాటిని కోర్టు ముందు ప్రవేశపెట్టి, నిరూపించి.. చివరాఖరికి ఎప్పుడో శిక్ష పడేలా చేయడమనేది సుదీర్ఘ ప్రక్రియ. ఒక రకంగా చెప్పాలంటే సుదీర్ఘమనే మాట కూడా చాలా చిన్నది. దశాబ్దాల తరబడి సాగుతున్న కేసులు ఎన్నో. దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించి, చట్టాల్లో మార్పులకు సైతం దారి తీసిన నిర్భయ అత్యాచార ఘటనలో నిందితులకు శిక్ష ఖరారు కావడానికి పట్టిన సమయం, అమలు జరగడంలో జరుగుతున్న జాప్యం అందరికీ తెలిసిందే. అలాగే, ఉన్నావ్ అత్యాచార ఘటనలో ఏం జరిగిందో తెలుసు. చట్టం కల్పించిన వెసులుబాటుల్లోంచి నిందితులు ఎన్నెన్ని దారుణాలకు తెగించారో, ఎంతమంది మరణాలకు కారణమయ్యారో.. చివరకు బాధితురాలిని కూడా అత్యంత దారుణంగా నడిరోడ్డుపైనే తగులబెట్టేసిన విషయం ఎందరినో కలిచి వేసింది. అందుకే ఇప్పుడు సత్వరం న్యాయం కావాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.

కాలంతోపాటు మన చట్టాలు, విచారణా పద్ధతులు, న్యాయం అందించే తీరు మారలేదు. కానీ, హింసా రూపాలు తీవ్రాతి తీవ్రంగా మారిపోయాయి. తలుచుకుంటేనే వెన్నులో వణుకుపుట్టే స్థాయిలో హింస చెలరేగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో చట్టం, న్యాయం అంటూ మీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటే చేతకానితనమవుతుందని వీరి అభిప్రాయం. కులం, ధనం, రాజకీయ అండదండలు ఉన్నవారికి కూడా ఇలాంటి న్యాయాన్ని అమలు చేయగలరా అని ప్రశ్నిస్తున్నవారికి– మీరు మాత్రం అత్యాచారానికి గురైన అందరిపట్లా ఒకేలా స్పందిస్తున్నారా; టేకు లక్ష్మిలాంటి వెనుకబడిన వర్గాలకు చెందిన బాధితుల గురించి ఎప్పుడైనా మాట్లాడారా అని నిలదీస్తున్నారు. ఎన్‌కౌంటర్ చేసేస్తే ఇక అత్యాచారాలు ఆగిపోతాయా అంటున్నవారితో.. చట్టప్రకారం విచారించి, శిక్షిస్తే మాత్రం ఆగిపోతాయా అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. పిల్లల పెంపకం, వ్యవస్థలో రావాల్సిన మార్పులను కాదనటంలేదనీ.. అయితే, అంత వరకూ నేరాలకు అడ్డుకట్ట వేయడం ఎలాగో సెలవీయమంటున్నారు. అధికార బలం, ధన బలం ఉన్నవారికి కొమ్ముకాస్తూ పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం దేశంలో కొత్తేమీ కాదనీ, అది ఇప్పుడు ప్రజలపక్షం అయినందుకు సంతోషించడంలో తప్పేముందని ప్రశ్నిస్తున్నారు.

ఏ కారణాల వల్లనో సమాజంలో కొన్ని సంఘటనలు అందరినీ కదిలిస్తాయి, కలచివేస్తాయి. అటువంటి సంఘటనల విషయంలో సత్వరం న్యాయం జరగాలని చాలామంది కోరుకుంటారు. అప్పుడు వారికి కావాల్సింది అంతిమ పరిష్కారమేగానీ.. న్యాయాన్ని ఎలా అమలు చేస్తున్నారనేది ముఖ్యం కాదు. ప్రజల్లో పెల్లుబికే ఆ ఉద్వేగాన్ని అందిపుచ్చుకుని వారు కోరుకున్న దాన్ని– తమకు ఎటువంటి నష్టం లేదు కాబట్టి– అందివ్వడం పాలకులకు పెద్ద కష్టమేమీ కాదు. అంతేకాదు, తీవ్ర భయోద్విగ్నతతో వాడిపోయిన సమాజం మోమును కాస్తంతైనా వికసింపజేయాల్సిన బాధ్యత పాలకులదే. అందుకే షాద్‌నగర్ ఎన్‌కౌంటర్ అందరిలో విశేష ఆనందానికి హేతువయ్యింది. అందరూ బాణాసంచా కాల్చుకుని, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ముఖ్యంగా అమ్మాయిల ముఖాల్లో పట్టలేనంత ఆనందం తొణికిసలాడింది. తమను ఏ సందు చివరో కామెంట్ చేసినవాడిని వేలు చూపి బెదిరించినట్టు, ఎడంకాలి చెప్పుతో చెంపలు వాయించినట్టు.. తమంతట తామే ఏదో సాధించినట్టు చేసినట్టు వాళ్ల కళ్లు ధైర్యంతో వెలిగిపోయాయి. దిశ అత్యాచార ఘటన అనంతరం కారుమబ్బుల్లా కమ్ముకున్న భయాన్ని ఇవాళ్టి సంఘటన మెరుపులా చీల్చి వారి ముఖాలపై చిరునవ్వులు పెల్లుబికేలా చేసింది. పోలీస్ న్యాయం.. న్యాయం కాకపోవచ్చు. కానీ, కొంత ఉపశమనాన్ని ఇచ్చిందనేది కాదనలేని వాస్తవం.

– దేశరాజు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899


జయసుధ

# నేటికీ న్యాయం కోసం

వారం క్రితం దేశం నిర్ఘాంతపోయింది.
కారణం.. 'దిశ'పై జరిగిన
దారుణకృత్యం.
సరిగ్గా వారం తర్వాత దేశం
సంభ్రమాశ్చర్యాలలో మునిగి తేలింది.
కారణం..
'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్!
దిశకు 'న్యాయం' ఇంత త్వరగానా!
ఎవరూ ఊహించలేదు.
దోషులకు 'శిక్ష' ఇంత వెంటనేనా!
ఎవరూ అనుకోనేలేదు.
'దేశం' అంటే ఇక్కడ
సామాన్య పౌరులు.
'న్యాయం', 'శిక్ష' అంటే ఇక్కడ
జన సామాన్య భావనలు.
నేరము-చట్టము- తీర్పు..
వీటిని పక్కనపెడితే..
తప్పు చేసినవారికి తగిన శాస్తి
జరిగింది.
తప్పు చేయాలనుకునేవారికి
తగిన హెచ్చరికే వెళ్లింది.
'దిశ' తల్లి కడుపుకోత
ఈ జన్మకు తీరేది కాదు.
తీర్పులు, ఎన్‌కౌంటర్‌లూ
ఆమెను సేదతీర్చేవీ కావు.
పోయిన కూతురు తిరిగొస్తే..
అప్పుడు ఆమెకు న్యాయం జరిగినట్లు!
మరొకరి కూతురికి ఎప్పటికీ
అలా జరగపోతే
అప్పుడూ ఆమెకు న్యాయం జరిగినట్లు!
దిశను, నిర్భయను, ప్రత్యూషను
ఎలాగూ తీసుకురాలేం.
మరొకరికి ఇలా జరక్కుండానైనా
చూడగలమా?
దిశ తల్లి మాట్లాడే స్థితిలో లేరు.
నిర్భయ తల్లి, ప్రత్యూష తల్లి..
నేటికీ ఒకే మాట మాట్లాడుతున్నారు.
మా కూతురికి న్యాయం చేయండి
మా కూతురికి న్యాయం చేయండి
ఏడేళ్లుగా నిర్భయ తల్లి,
పదిహేడేళ్లుగా ప్రత్యూష తల్లి
న్యాయం కోసం పోరాడుతున్నారు.
'దిశ' ఘటన అనంతరం..
ఈ ఇద్దరు తల్లుల మనోగతాలివి.


'నిర్భయ' తల్లి ఆశాదేవి

## ఏడేళ్లుగా 'నిర్భయ' తల్లి

## నా కూతుర్ని చంపిన వాళ్లింకా బతికే ఉన్నారు

**ఏడు సంవత్సరాల క్రితం ఢిల్లీలో 'నిర్భయ' ఘటన జరిగింది. ఆ కేసులో నిందితులకు విధించిన శిక్ష ఇప్పటి వరకు అమలు జరగలేదు. ఈ క్రమంలో శుక్రవారం తెలంగాణలో 'దిశ' నిందితులు నలుగురూ సరిగ్గా వారు 'హత్యాచారానికి' పాల్పడిన వారానికి ఎన్‌కౌంటర్ కావడం పట్ల 'నిర్భయ' తల్లి ఆశాదేవి సంతోషం వెలిబుచ్చారు.**

''ఆ నలుగురు నిందితులను ఎన్‌కౌంటర్ చేశారన్న విషయం విన్నాను. అసలు ఎలా జరిగిందా అనుకున్నాను. నా చెవులను నేనే నమ్మలేకపోయాను. పరుగెత్తుకుంటూ వచ్చి టీవీ పెట్టాను. నిజమే!! హైదరాబాద్ పోలీసులకు నమస్కరిస్తున్నాను. వారి చర్యను స్వాగతిస్తున్నాను, దిశపై అత్యాచారం చేసిన నిందితులకు సరైన శిక్ష పడిందని భావిస్తున్నాను. ఈ ఎన్‌కౌంటర్‌తో 'దిశ' ఆత్మ శాంతించే ఉంటుంది. అయితే నా కుమార్తె విషయంలో కూడా నేరస్థులకు తక్షణం శిక్ష అమలు కావాలని నేను ఏడేళ్లుగా కోరుకుంటున్నా నాకు న్యాయం దక్కలేదని ఆవేదనగా ఉంది.

నిర్భయ కేసులో దోషులుగా తేలినవారు ఇంకా బతికే ఉన్నారనే విషయాన్ని నేను పదేపదే గుర్తు చేయవలసి వస్తోంది. నా కుమార్తెపై అత్యాచారానికి పాల్పడిన వారికి శిక్ష అమలు చేసినప్పుడే ఆమె ఆత్మకు శాంతి చేకూరుతుంది. ఈ ఏడేళ్లూ నేను నిర్భయకు న్యాయం చేయాలని కోరుతూ చాలామందినే కలిశాను. అందరూ హామీ ఇచ్చారే కాని, ఆచరణ మాత్రం శూన్యమే. ఇప్పుడు దిశ కేసులో జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాతైనా నిర్భయ నిందితులకు వెంటనే ఉరిశిక్షను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని న్యాయ వ్యవస్థను మరోసారి అభ్యర్థిస్తున్నాను. అత్యాచారం తర్వాత నా కూతురు పదిరోజులు బతికే ఉంది. ప్రతిరోజూ కొద్ది కొద్దిగా మరణించడం నా కళ్లతో చూస్తూ ఉండిపోయాను. పది రోజుల పాటు, ఆమెకు కనీసం చెంచాడు నీళ్లు కూడా ఇవ్వలేకపోయాను'' అంటూ బరువైన హృదయంతో మీడియాతో అన్నారు ఆశాదేవి.

2012 డిసెంబర్ 16న జరిగిన సంచలనాత్మక 'నిర్భయ' ఘటనలో అత్యాచారం, హత్య, కిడ్నాప్, దోపిడీ, దాడి వంటి పలు కేసుల కింద అరెస్ట్ అయిన ఆరుగురు నిందితులలో ఒకరు బాలనేరస్థుడు. జైల్లోనే అతడి శిక్షాకాలం పూర్తవడంతో విడుదల చేశారు. మిగిలిన ఐదుగురిలో రామ్‌సింగ్ అనే నిందితుడు విచారణ జరుగుతున్న కాలంలోనే చనిపోయాడు. మిగతా నలుగురికి కోర్టు మరణ శిక్ష విధించింది. అయితే ఇంతవరకు ఆ శిక్ష అమలు అవలేదు. దీనిపై ఈ నెల 13న ఆశాదేవి మళ్లీ కోర్టును ఆశ్రయించబోతున్నారు. ''వారికి క్షమాభిక్ష ప్రసాదించే అవకాశం ఉందని వస్తున్న వార్తలు నా మనసును కలచివేస్తున్నాయి. అదే నిజమైతే నా కూతురి ఆత్మకు శాంతి చేకూరదు'' అని ఆశాదేవి అన్నారు.


ప్రత్యూష తల్లి సరోజినీదేవి

## పదిహేడేళ్లుగా ప్రత్యూష తల్లి

## నా కూతురి కేసులో అసలు తీర్పే రాలేదు

**ప్రత్యూష ఉదంతం 2002, ఫిబ్రవరిలో జరిగింది. పదిహేడేళ్లు పూర్తయ్యాయి. న్యాయం కోసం పోరాటం సాగుతూనే ఉంది. న్యాయం ఎప్పటికి వస్తుందో తెలియదు. కేసు సుప్రీం కోర్టులో డబుల్ బెంచ్‌లో ఉంది. ఈ ఏడాది మేలో ఒకసారి బెంచ్ మీదకు వచ్చింది. నిందితుడు సిద్ధార్థ రెడ్డి తరఫు న్యాయవాది మరణించడంతో మరికొంత జాప్యం చోటు చేసుకుంది. మళ్లీ టేబుల్ మీదకు ఎప్పుడు వస్తుందోనని ప్రత్యూష తల్లి సరోజినీ దేవి ఎదురు చూస్తున్నారు. 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో 'సాక్షి' ఆమెను పలకరించింది.**

''దిశ సంఘటనలో చోటు చేసుకున్న పరిణామాలు చూసినప్పుడు కడుపుకోతకు గురైన మాలాంటి తల్లులకు మాత్రం ఇదే సరైంది... అనిపిస్తుంది. 'దుష్ట శిక్షణ జరిగింది' అనే భావన మహిళలకు మనోనిబ్బరాన్నిచ్చింది కూడా. కానీ శిక్ష ఎప్పుడూ న్యాయపరిధిలోనే ఉండాలి. ఇలాంటి కేసుల్లో శిక్ష ఎప్పుడూ కఠినంగానే ఉండాలి. మరొకరు నేరానికి పాల్పడేటప్పుడు శిక్ష గుర్తుకు వచ్చి భయపడేలా ఉండాలి. దిశ సంఘటన జరిగిన ఈ కొద్ది రోజుల్లోనే నిందితులు సమాధి అవుతున్నారు. ఆమె ఆత్మ శాంతించి ఉంటుంది. అలాంటి శాంతి ప్రత్యూష ఆత్మకు ఎప్పుడు కలుగుతుందో ఏమో? నిర్భయ కేసులో న్యాయస్థానం సత్వరం స్పందించి తీర్పునిచ్చింది. కానీ ఆ తీర్పును అమలు చేయడంలో జాప్యం చేస్తోంది. ప్రత్యూష కేసులో ఇంకా తుది తీర్పు వెలువడనే లేదు. ఎప్పుడైనా సరే... ఒక ఆడపిల్ల విషయంలో... అది కూడా అత్యాచారం హత్య జరిగినప్పుడు న్యాయస్థానాలు వీలయినంత త్వరగా విచారణ పూర్తి చేసి తీర్పునివ్వాలి. ఆలస్యం జరిగే కొద్దీ కేసు తీవ్రత తగ్గిపోతుంటుంది. కేసు పలుచబడిపోతుంటుంది. అవకాశవాదుల చేతుల్లో సాక్ష్యాలు తారుమారయిపోతుంటాయి. దాంతో శిక్షలు నామమాత్రంగా మారిపోతుంటాయి. సిద్ధార్థ కేసులో కూడా ఒక కోర్టు విధించిన శిక్షను మరొక కోర్టు తగ్గించింది. విచారణ ఆలస్యం జరగడం కూడా ఇందుకు ఒక కారణమే. తొమ్మిది నెలల పాపాయి మీద అత్యాచారం చేసిన నిందితుడికి ఒక కోర్టు మరణ శిక్ష విధిస్తే, పై కోర్టు ఆ శిక్షను సవరించి జీవితఖైదుగా మార్చింది. ఈ సందర్భంగా నాది మరొక విన్నపం. ఆడపిల్లలకు అన్యాయం జరిగిన కేసుల విషయంలో న్యాయవాదులు స్వీయ నియంత్రణ పాటించాలి. అమ్మాయి మీద అత్యాచారం జరిగిందనేది వాస్తవం, హత్య జరిగిందనేది వాస్తవం.

నిందితుల తరపున వాదిస్తూ రెండు వాస్తవాలను అవాస్తవాలుగా నమ్మించే ప్రయత్నం చేసే ముందు దయచేసి ఒక్కసారి ఆలోచించండి. న్యాయవాదులందరూ కలిసి మన చట్టాలను పటిష్టం చేయడానికి ప్రయత్నం చేయండి. అలాగే మాలాంటి బాధిత కుటుంబాలకు న్యాయపోరాటంలో ప్రభుత్వం కూడా అండగా ఉండాలి. బలవంతులతో న్యాయపోరాటం చేయాల్సి వచ్చినప్పుడు బలహీనులు అడుగడుగునా ఎదురీదాల్సి వస్తోంది. అందుకు నేనే ఉదాహరణ''.

## ఈ రోజుకు హ్యాపీ.. రేపు ఏంటీ?

– జయసుధ

దిశ ఘటనలో సత్వర న్యాయం జరిగినందుకు ఈ రోజుకు హ్యాపీగా ఉన్నాం. కానీ రేపు ఏంటనే భయం అందరిలో ఉంది. నిర్భయ ఘటనలో ఏడేళ్లయినా శిక్ష పడలేదు. 'ఉన్నావ్'లో ఏకంగా బాధితురాలిని నడిరోడ్డుపైనే కాల్చేశారు. అసలు మహిళలపై హింసకు కారణమవుతున్న అంశాలపై లోతైన చర్చ, ఆ దిశగా నివారణ చర్యలు తక్షణం చేపట్టాలి. ముఖ్యంగా దేశంలో సగభాగం ఉన్న మహిళలకు ప్రధాని మోదీ ఈ విషయంలో ఏ రకమైన భరోసానిస్తారో స్పష్టం చేయాలి. మహిళలపై హింస నివారణకు కుటుంబం, పాఠశాలల నుండే మొదలు కావాలి. మహిళల ఇబ్బందుల విషయంలో పోలీసుల తీరులో సమూల మార్పు, కోర్టులు సత్వర తీర్పులు వెలువరించే దిశగా అన్ని వ్యవస్థలు పనిచేయాలి. అప్పుడే మహిళలు, కుటుంబాలు రోజూ హ్యాపీగా ఉండే పరిస్థితి ఉంటుంది.

మంచు లక్ష్మి


## ఒక మహిళగా.. తల్లిగా సంతోషించాను

– మంచు లక్ష్మి

దిశ ఘటనపై స్పందించడానికి నటి, నిర్మాత మంచు లక్ష్మి ప్రత్యేకంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ – ''దిశ ఘటన తెలిసినప్పటి నుంచి నేను చాలా డిస్టర్బ్ అయ్యాను. నిందితుల ఎన్‌కౌంటర్ వార్త వినగానే ఒక మహిళగా, తల్లిగా సంతోషించాను. కానీ, ఈ ఎన్‌కౌంటర్ నిజమైన పరిష్కారమా? ఈ ఘటనలాగా అన్ని సంఘటనలు చూడలేం. ఎందుకంటే.. ఇలాంటిది ఒక చట్టంగా రావాలి. నిర్భయ కేసు నిందితులను ఏడేళ్లుగా మేపుతున్నారు. ప్రధాన నిందితుడు బయట హాయిగా తిరుగుతున్నాడు? దాన్ని ప్రశ్నించాలి? దిశనే కాదు.. నెలల పాపలు, ముసలివాళ్లు ఏం తప్పు చేశారు? ఎన్‌కౌంటర్ అన్నిటికీ సమాధానం కాదు.

ఆడవాళ్ల స్వేచ్ఛను అడ్డుకోవడానికి, వారికి గీతలు గీయడానికి ఎవరికీ హక్కు లేదు. 80 శాతం లైంగిక దాడులు బయటకు రావడం లేదు. ఫ్రెండ్లీ పోలీసింగ్ పెరగాలి.. చట్టాలు మారాలి. ఆ మార్పులు వస్తాయంటే ఇండస్ట్రీ మొత్తాన్ని బయటకు తెస్తాను. కానీ, చట్టాలను గౌరవించాలి. తల్లిదండ్రులు ఆడపిల్లలను పెంచే తీరులో, విద్యా వ్యవస్థలో సమానత్వం రావాలి'' అన్నారు.



రేపిస్టులందర్నీ కాల్చి చంపాలి. అదే మనకు కావాల్సింది. పోలీసులకు హ్యాట్సాఫ్. ఇవాళ నిజంగా సెలబ్రేట్ చేసుకోవాల్సిన రోజు.

– నటి చార్మి

## తారోద్వేగం

**కొన్ని రోజుల క్రితం దిశకు జరిగిన అన్యాయం చూసి మన తారలు ఆగ్రహానికి గురయ్యారు. తమ భావావేశాన్ని ట్వీటర్‌లో ట్వీట్స్ ద్వారా తెలిపారు. నిందితులపై శుక్రవారం జరిగిన 'ఎన్‌కౌంటర్' చూసి న్యాయం జరిగినట్టు హర్షించారు. వారి స్పందన ఇలా ఉంది.**



దిశ సంఘటనలో నిందితులు పోలీసుల కాల్పుల్లో మతి చెందారన్న వార్తను ఉదయం చూడగానే నిజంగా ఇది సత్వర న్యాయం, సహజ న్యాయం అని నేను భావించాను. కామంతో కళ్లు మూసుకుపోయి ఇలాంటి నేరాలు, ఘోరాలు చేసే ఎవరికైనా ఇది కనువిప్పు కలిగించాల్సిందే.

– చిరంజీవి



ఈ వార్తతోనే నిద్రలేచాను. న్యాయం జరిగింది.

– నాగార్జున



ఆ భగవంతుడే పోలీసుల రూపంలో ఈ రోజు నిందితులకు సరైన శిక్ష విధించడం జరిగింది. మరోసారి ఎవ్వరూ కూడా ఇలాంటి దారుణాలకు పాల్పడకుండా, ఇలాంటి ఆలోచన మొలకెత్తనీయకుండా వారిని ఎన్‌కౌంటర్ చేయడం జరిగింది. అందరికీ కూడా ఇదొక గుణపాఠం కావాలి.

– బాలకృష్ణ



దిశకు న్యాయం చేయడం ఇక్కడితో పూర్తి కాలేదు. ఇక్కడితో మొదలవ్వాలి. చిన్నప్పటినుంచే విద్య, సాధికారత, జ్ఞానం అందించడం వల్లే ఇది సాధ్యం అవుతుంది. జైహింద్.

– రవితేజ



న్యాయం చేకూరింది. దిశ ఆత్మకు శాంతి లభిస్తుంది.

– ఎన్టీఆర్



మేం ఏం చేసినా నిన్ను తిరిగి తీసుకురాలేం. కానీ ఇవాళ జరిగింది నీకు, నీ కుటుంబానికి శాంతిని తీసుకొస్తుందని భావిస్తున్నాం.

– రామ్‌చరణ్



న్యాయం చేకూరింది.

– అల్లు అర్జున్



'ఊరికి ఒక్కడే రౌడీ ఉండాలి. వాడు పోలీసోడు అయ్యుండాలి'

– నాని



ఆ బుల్లెట్ దాచుకోవాలనుంది. ఆ తుపాకులకు దండం పెట్టాలని ఉంది. ఆ పోలీసుల కాళ్లు మొక్కాలనుంది. నలుగురు చచ్చారు అనే వార్తలో ఇంత కిక్కు ఉందా? ఈ రోజునే నీ ఆత్మ దేవుడిని చేరింది చెల్లెమ్మా.

– మంచు మనోజ్



న్యాయం చేకూరింది. హైదరాబాద్ పోలీసులకు హ్యాట్సాఫ్.

– గోపీచంద్



నువ్వు బ్యాడ్ అయితే.. సిచ్యుయేషన్స్ కూడా వెరీ బ్యాడ్. హైదరాబాద్ పోలీసులు నిజమైన హీరోలు.

– రామ్



ఇలాంటి దారుణాలకు పాల్పడాలన్న ఆలోచన వచ్చిన వారికి ఇదో హెచ్చరికలా ఉంటుంది అనుకుంటున్నాను. దిశ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను.

– నితిన్



చెల్లెమ్మా, నిన్ను కాపాడుకోలేకపోయాం. కానీ న్యాయం జరిగేలా చూశాం.

– సాయిధరమ్ తేజ్



మన పని అప్పుడే పూర్తవ్వలేదు. మన చెల్లెళ్లందరికీ సురక్షితమైన సమాజాన్ని అందించడం మనందరి బాధ్యత.

– కార్తికేయ



తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి చేతులెత్తి మొక్కుతున్నాను. యూ ఆర్ ది రియల్ హీరోస్. నేను ఒక్క విషయం నమ్ముతాను.. మనకు కష్టం వచ్చినా, కన్నీళ్లు వచ్చినా పోలీసోడే వస్తాడు. నువ్వే దిక్కు రక్షించాలని దేవుడికి మొక్కినా ఆ దేవుడు కూడా పంపించేది పోలీసోడినే.

– పూరి జగన్నాథ్



పొల్యూషన్ నుంచి తప్పించుకోవచ్చు కానీ పోలీస్ నుంచి తప్పించుకోలేరు

– బోయపాటి శ్రీను



ఐ లవ్ తెలంగాణ. భయమే నిజమైన పరిష్కారం. కొన్నిసార్లు అదొక్కటే పరిష్కారం.

– సమంత



హైదరాబాద్ పోలీసులకు పెద్ద సెల్యూట్.

– రాశీ ఖన్నా



ఇలాంటి పాపం చేసి ఎంత దూరం పరిగెడదాం అనుకున్నారు? థ్యాంక్యూ తెలంగాణ పోలీస్.

– రకుల్‌ప్రీత్ సింగ్



నీ ఆత్మ శాంతించి ఉంటుందని అనుకుంటున్నాను.

– రష్మికా మందన్నా



తెలంగాణ పోలీసులు శభాష్.. వారికి శుభాకాంక్షలు

– రిషికపూర్



తెలంగాణ సీఎమ్‌ఓ, సైబరాబాద్ పోలీస్, వీసీ సజ్జనార్ స్వీట్ అండ్ స్ట్రాంగ్‌గా నిజమైన న్యాయం చేశారు. వ్యవస్థ వెనకాల దాక్కొని ఉన్న ఇలాంటి రాక్షసులకు ఇది ఓ సందేశం. ఇలాంటి రాక్షసులు అందరూ ఇప్పుడు భయంతో వణికిపోతుంటారు

– వివేక్ ఒబెరాయ్



తెలంగాణ పోలీసులకు జయహో

– అనుపమ్ ఖేర్

## చివరి కోరిక

అతడు తన చిన్నప్పటి పాఠశాల టీచర్ ఇంటిని వెదుక్కుంటూ వెళ్లాడు. ఒకప్పుడు అతను గోపీనాథ్‌గారి ప్రియాతి ప్రియమైన శిష్యుడు. ఇప్పుడు నగరంలో పేరున్న డాక్టర్లలో ఒకరు. దారి పొడుగునా గురువుగారి గుణగణాలను, తెల్లని తలపాగా చుడీదార్ ధరించే వేషధారణను గుర్తు చేసుకున్నాడు.



మాస్టారు అతడిని సాదరంగా స్వాగతించారు. తక్కువ ఎత్తు గల ఆ ఇంట్లోకి ప్రవేశించగానే గురువుగారి కళ్లు మెరిశాయి. గది చాలా చిన్నది. ఉక్కిరి బిక్కిరిగా ఉంది. మాస్టారు ఆ గదిలో ఒక మూల కిటికీ దగ్గర తివాచీ మీద పడుకుని ఉన్నారు. లేచి నిల్చోవడానికి ఆయనకు శక్తి చాలదు.

చిక్కిశల్యమైన గోపీనాథ్ తన ప్రియ శిష్యుడిని అడిగిన కోరిక ఏమిటి?

కశ్మీరీ కథ '**చివరి కోరిక**'లో చదవండి.




## ఆ ప్రకృతి ఎవరు?

''పుత్రుడు సర్వజ్ఞుడు కావాలని, అమాయకుడై మోసపోకూడదని తల్లి ఆరాట పడుతుంది. మీగత స్తోత్రాలకు భిన్నంగా ఇప్పుడు చేసిన ప్రకృతి స్తోత్రం విన్నాను. జ్ఞానప్రధానమైన వేదాంతమార్గంలో నిగ్గు తేలిన మీరు క్రియాప్రధానమైన తంత్రశాస్త్రంలోనూ ప్రతిభ చాటుకున్నారు. ఇది చెప్పండి మరి...కాలస్వరూపుడైన నారాయణునికి సైతం తెలియని ఆ ప్రకృతి ఎవరు? ఆమెకు తగిన పురుషుడెవరు?'' అని ప్రశ్నించింది ఉభయ భారతి.

అప్పుడు శంకరుడు ఏమని చెప్పాడు?

*'**ఉభయ భారతి**' (శంకరవిజయం: ఆదిశంకరాచార్యుల జీవితచరిత్ర)లో చదవండి.*



*ఇంకా... లేజీటీన్స్ (ముఖచిత్ర కథనం), అడవి పిలిచింది (ట్రావెలాగ్), కిడ్నాప్ (గల్ఫ్ కథలు), ఎట్టాగయ్యా శివ శివా! (పాటతత్వం), కాలకూట విషం– కణికనీతి తంత్రం (పురానీతి), రజతోత్సవ సన్మానం (ప్రముఖ సినీ రచయిత డి.వి.నరసరాజు కథ), ఒప్పంద పత్రం (క్రైంస్టోరీ)... ఇంకా మిమ్మల్ని ఆకట్టుకునే మరెన్నో శీర్షికలు రేపటి ఫన్‌డేలో చదవండి.*




సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
7-12-2019

# రుచిని చాట్‌కుందాం!

టిఫిన్ అంటే ఎప్పుడూ తినే ఇడ్లీ, ఉప్మా, దోసె, పూరీలేనా? స్నాక్స్ అంటే ట్రెడిషనల్ కారప్పూస, బూందీ, పకోడీ, మిర్చి బజ్జీలేనా? వాటినే కొంచెం డిఫరెంట్‌గా ట్రై చేద్దామా.... భేల్‌పూరీ దహీపూరీ బఠాణీ చాట్ బఠాణీ చాట్‌లా చేసి వాటి రుచిని చాట్‌కుందామా...



## బఠాణీ చాట్

**కావలసినవి**

**తెల్ల బఠాణీ** – ఒక కప్పు; **పసుపు** – పావు టీ స్పూను + పావు టీ స్పూను; **ఉప్పు** – తగినంత; **నూనె** – ఒక టీ స్పూను + 2 టేబుల్ స్పూన్లు; **ఉల్లి పేస్ట్** – రెండు టేబుల్ స్పూన్లు; **అల్లం వెల్లుల్లి ముద్ద** – ఒక టీ స్పూను; **టొమాటో పేస్ట్** – పావు కప్పు; **మిరప కారం** – ఒక టీ స్పూను; **ధనియాల పొడి** – ఒక టీ స్పూను; **జీలకర్ర పొడి** – ఒక టీ స్పూను; **కొత్తిమీర తరుగు** – ఒక టీ స్పూను; **చాట్ మసాలా** – ఒక టీ స్పూను; **నిమ్మ రసం**– ఒక టీ స్పూను; **కార్న్ ఫ్లేక్స్** – తగినన్ని

**తయారీ**

బఠాణీలను ముందు రోజు రాత్రి నానబెట్టాలి ● మరుసటి రోజు ఉదయం, కుకర్‌లో బఠాణీలు, పసుపు, ఉప్పు, తగినన్ని నీళ్లు, ఒక టీ స్పూను నూనె జత చేసి స్టౌ మీద ఉంచి సన్న మంట మీద ఉంచి మూడు విజిల్స్ వచ్చాక దింపేయాలి ● చల్లారాక సగం బఠాణీలను మిక్సీలో వేసి మెత్తగా పేస్ట్ చేయాలి ● స్టౌ మీద బాణలిలో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి కాగాక, ఉల్లి ముద్ద వేసి బంగారు రంగులోకి వచ్చే వరకు వేయించాలి ● అల్లం వెల్లుల్లి పేస్ట్ జత చేసి వేయించాలి ● టొమాటో ముద్ద జత చేసి కొద్దిసేపు వేయించాక, బఠాణీ పేస్ట్, ఉడికించిన బఠాణీలు జత చేయాలి ● కొద్దిగా ఉప్పు జత చేయాలి ● మిరప కారం, పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, చాట్ మసాలా జత చేసి కలపాలి ● తగినన్ని నీళ్లు జత చేసి కొద్దిసేపు ఉడికించి దింపి, ఒక పాత్రలోకి తీసుకోవాలి ● ఉల్లి తరుగు, కొత్తిమీర తరుగు, టొమాటో తరుగులతో అలంకరించి, కొద్దిగా నిమ్మ రసం, కార్న్‌ఫ్లేక్స్‌తో అలంకరించి, అందించాలి.



## భేల్ పూరీ

**కావలసినవి**

**స్వీట్ చట్నీ** – రుచికి తగినంత; **గ్రీన్ చట్నీ** – రుచికి తగినంత; **క్యారట్ తురుము** – ఒక టేబుల్ స్పూను; **కీర తురుము** – ఒక టేబుల్ స్పూను; **కొత్తిమీర** – ఒక టేబుల్ స్పూను; **టొమాటో తరుగు** – పావు కప్పు; **ఉల్లి తరుగు** – పావు కప్పు; **ఉడికించిన బంగాళ దుంప తురుము** – ఒక టేబుల్ స్పూను; **బూందీ** – 2 టేబుల్ స్పూన్లు; **సేవ్** – 2 టేబుల్ స్పూన్లు; **అటుకులు** – తగినన్ని **చాట్ మసాలా** – చిటికెడు; **మిరప కారం** – కొద్దిగా; **మరమరాలు** – పావు కేజీ

**తయారీ**

ఒక పాత్రలో మరమరాలు వేసి, వాటికి మిగిలిన పదార్థాలన్నీ (స్వీట్ టామరిండ్ చట్నీ, గ్రీన్ చట్నీ కాకుండా) జత చేసి బాగా కలపాలి ● స్వీట్ టామరిండ్ చట్నీ, గ్రీన్ చట్నీ జత చేయాలి ● ప్లేటులోకి తీసుకుని, పైన స్వీట్ చట్నీ, గ్రీన్ చట్నీలను కొద్దికొద్దిగా వేసి, ఆ పైన కొత్తిమీర తరుగు, ఉల్లి తరుగు జత చేసి అందించాలి.



## దహీ పూరీ

**కావలసినవి**

**ఉడికించిన బంగాళ దుంపలు** – 3 (మీడియం సైజువి); **ఉల్లి తరుగు** – పావు కప్పు; **టొమాటో తరుగు** – పావు కప్పు; **కొత్తిమీర తరుగు** – కొద్దిగా; **పెరుగు** – ఒక కప్పు; **గ్రీన్ చట్నీ** – అర కప్పు; **స్వీట్ చట్నీ** – అర కప్పు; **ఎండు మిర్చి + వెల్లుల్లి చట్నీ** – అర కప్పు; **పూరీలు (గోల్‌గప్పాలు)** – 30; **సన్న సేవ్ (నైలాన్ సేవ్)** – తగినంత; **మిరప కారం** – తగినంత; **చాట్ మసాలా** – తగినంత; **వేయించిన జీలకర్ర పొడి** – తగినంత; **నల్ల ఉప్పు లేదా రాళ్ల ఉప్పు** – తగినంత

**తయారీ**

ముందుగా చట్నీలు తయారు చేసి పక్కన ఉంచాలి ● బంగాళ దుంపలను ఉడికించి, చల్లారబెట్టి, మెత్తగా చిదమాలి ● ఒక ప్లేట్‌లో గోల్‌గప్పాలను ఉంచి, మధ్య భాగంలో చిన్నగా చిదమాలి ● బంగాళ దుంప ముద్దను స్టఫ్ చేయాలి ● ఉల్లి తరుగు, టొమాటో తరుగును పైన ఉంచాలి ● కొద్దిగా చాట్ మసాలా, జీలకర్ర పొడి, మిరప కారం, ఉప్పు... ఒకదాని తరవాత ఒకటి కొద్ది కొద్దిగా చల్లాలి ● గ్రీన్ చట్నీ, స్వీట్ చట్నీలు కొద్దికొద్దిగా వేయాలి ● పైన పెరుగు వేయాలి ● ఆ పైన మళ్లీ చాట్ మసాలా, జీలకర్ర పొడి, మిరపకారం, ఉప్పు చల్లాలి ● తగినంత సేవ్ వేసి, చివరగా కొత్తిమీరతో అలంకరించి అందించాలి.



## సమోసా చాట్

**కావలసినవి**

**చెన్నా మసాలా** – ఒక టీ స్పూను; **ధనియాల పొడి** – ఒక టీ స్పూను; **జీలకర్ర పొడి** – ఒక టీ స్పూను; **ఉప్పు** – తగినంత; **టొమాటో తరుగు** – పావు కప్పు; **బటర్** – ఒక టేబుల్ స్పూను; **ఉల్లి తరుగు** – పావు కప్పు; **చాట్‌మసాలా** – ఒక టీ స్పూను; **మిరప కారం** – ఒక టీ స్పూను; **సమోసాలు** – 2; **పెద్ద సెనగలు (కాబూలీ చెన్నా)** – ఒక కప్పు; **నీళ్లు** – తగినన్ని; **పెరుగు** – ఒక కప్పు; **గ్రీన్ చట్నీ** – కొద్దిగా; **స్వీట్ చట్నీ** – కొద్దిగా; **కొత్తిమీర** – ఒక కట్ట

**తయారీ**

పెద్ద సెనగలను ముందు రోజు రాత్రి నానబెట్టాలి ● మరుసటి రోజు నీళ్లు ఒంపేసి, శుభ్రంగా కడిగి, కుకర్‌లో సెనగలకు తగినన్ని నీళ్లు జత చేసి, స్టౌ మీద ఉంచి నాలుగు విజిల్స్ వచ్చాక దింపేయాలి ● బాణలిలో బటర్ వేసి వేడి చేయాలి ● ఉడికించిన పెద్ద సెనగలు, టొమాటో తరుగు, ఉల్లి తరుగు, ఉప్పు, మిరప కారం, జీలకర్ర పొడి, ధనియాల పొడి, చాట్ మసాలా వేసి కొద్దిసేపు వేయించాలి ● తగినన్ని నీళ్లు పోసి ఉడికించాలి ● సమోసాలను ముక్కలుగా చేసి, ఉడికించిన చాట్‌లో వేసి కలపాలి ● పెరుగు, స్వీట్ చట్నీ, గ్రీన్ చట్నీ వేసి, ఒకసారి కలిపి దింపేసి, కొద్దిగా కొత్తిమీరతో అలంకరించి, వేడి వేడి సమోసా చాట్ అందించాలి.



## గ్రీన్ చట్నీ

**కావలసినవి**

**కొత్తిమీర ఆకులు** – 2 కప్పులు; **పుదీనా ఆకులు** – ఒక కప్పు; **జీలకర్ర** – ఒక టీ స్పూను; **పచ్చి మిర్చి** – 4; **వెల్లుల్లి రెబ్బలు** – 2; **అల్లం** – చిన్న ముక్క; **నిమ్మ రసం** – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; **ఉప్పు** – తగినంత

**తయారీ**

కొత్తిమీర, పుదీనా ఆకులను శుభ్రంగా కడగాలి ● మిక్సీలో అన్ని పదార్థాలను వేసి మెత్తగా ముద్దలా చేయాలి ● గాలిచొరని జాడీలో నిల్వ ఉంచుకోవాలి ● ఫ్రిజ్‌లో ఉంచి, కావలసినప్పుడు ఉపయోగించుకోవచ్చు.



## స్వీట్ చట్నీ

**కావలసినవి**

**ఖర్జూరాలు** – 10 (గింజలు లేనివి); **బెల్లం తురుము** – అర కప్పు; **చింతపండు గుజ్జు** – 2 టేబుల్ స్పూన్లు **మిరప కారం** – అర టీ స్పూను; **జీలకర్ర పొడి** – అర టీ స్పూను; **ఉప్పు** – తగినంత; **నీళ్లు** – తగినన్ని

**తయారీ**

ఒకపాత్రలో బెల్లం పొడి, పావు కప్పు వేడి నీళ్లు పోసి కలియబెట్టాలి ● చింతపండు గుజ్జు, ఖర్జూరాల గుజ్జు జత చేసి, స్టౌ మీద ఉంచి ఉడికించాలి ● ఉప్పు, జీలకర్ర పొడి, మిరపకారం జత చేసి కలియబెట్టి కొద్దిసేపు ఉడికించి దింపేయాలి ● గాలి చొరని సీసాలోకి తీసుకుని, నిల్వ చేసుకోవాలి.

ఫుడ్ ప్రింట్స్

# లొట్టలేయించే రొట్టెలు!

భోజన ప్రియులను విభిన్న రుచులతో నోరూరిస్తుంది తూర్పు గోదావరి జిల్లా. కాకినాడ కోటయ్య కాజా, తాపేశ్వరం మడత కాజా, ఆత్రేయపురం పూత రేకులు, పెరుమాళ్లపురం పాకం గారెలు... అటువంటిదే ముక్కామల మినపరొట్టె. ఈ రొట్టెను ఏభైఏళ్లుగా లొట్టలేసుకుని తింటున్నారు. అమలాపురానికి 15 కిలోమీటర్ల దూరంలో చిన్న పల్లెటూరు ముక్కామల. తయారీ, రుచి, అన్నింటిలో అక్కడ వండే మినపరొట్టె అద్భుతంగా ఉంటుంది.

ముక్కామల పంట కాల్వ గట్టుపై ఓ పూరి పాక... అందులో ఓ చెక్క పెట్టె... కూర్చునేందుకు ఇటుకలపై అమర్చిన రెండు నాపరాతి బల్లలు... పట్టుమని పది మంది కూడా కూర్చునేందుకు జాగా లేని ఆ పూరి పాకలో ఏడు పదుల నిండిన వృద్ధుడు ఇటుకల పొయ్యిపై మినప రొట్టెలు కాల్చుతూ ఉంటాడు. రోజూ సాయంత్రం మూడు గంటలైతే చాలు ఎక్కడికెక్కడి నుంచో ఈ కాకా హోటల్‌కు వచ్చేస్తారు. ఇక్కడి రొట్లెను అరిటాకులోనే అందిస్తారు. తూర్పు గోదావరి జిల్లా అంబాజీపేట మండలం ముక్కామల గ్రామంలో అబ్బిరెడ్డి సత్యనారాయణ (తాత) కాకా హోటల్ అంటే కోనసీమ వ్యాప్తంగానే కాదు జిల్లాలోని పలు నగరాలు, పట్టణాలకు చెందిన వారికి కూడా సుపరిచితమే.

### తిన్న ప్రతి ఒక్కరూ బాగుందంటారు...

నా హోటల్‌కు వచ్చి మినపరొట్టె తిని వెళ్లే వారంతా ‘రొట్టె చాలా బాగుంది, చట్నీల కాంబినేషన్ బాగుంది’ అని చెబుతుంటే ఆనందంగా ఉంటుంది. 50 ఏళ్లుగా రుచి అలాగే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాను. పిండి, ఉప్పు సమపాళ్లలో కలపడం, రొట్టెను కాల్చేటప్పుడు దోరగా ఉండేలా చూసుకోవటం వంటి కొన్ని కిటుకులు పాటించడం కారణంగానే ఇంత పేరు వచ్చిందనుకుంటాను.

– అబ్బిరెడ్డి తాత



### అన్నీ ప్రత్యేకతలే

తాత వేసే మినపరొట్టె చూసేందుకు సాదాసీదాగా ఉంటుంది. అయితే ఆ రొట్టెకు అన్నీ ప్రత్యేకతలే. దాని రుచి అమోఘం. కమ్మని వాసనతో ఆవిర్లు కక్కుతుంది. కొబ్బరి చట్నీ, సెనగ చట్నీలను నంజుకుంటూ రొట్టెను తింటుంటే మెత్తని కేక్ ముక్క నోట్లోకి జారుతున్నట్లే ఉంటుంది. మన కళ్ల ముందే సంప్రదాయ కట్టెల పొయ్యి మీద బాణలిలో కాల్చి వేడివేడి పొగలు కక్కుతున్న రొట్టెను అరటి ఆకులో ఇస్తారు. ఆరోగ్యం, అతిథి మర్యాదలకు వేదికగా ఉంటుంది ఈ కాకా హోటల్. తాత వేసే రొట్టె తినేందుకు అంతస్తు, హోదా చూసుకోరు.

### రొట్టెలను కాల్చేందుకు...

నేలపై కొన్ని ఇటుకలు పేర్చి దాని మీద ఓ రేకు, దాని మీద ఇటుకలతో రెండు పొయ్యిలు ఉంటాయి. ఆ రెండింటి మీద రెండు బాణలులు ఉంటాయి. వాటిలో రొట్టె పిండి వేస్తారు. పొయ్యిని కొబ్బరి డొక్కలతో మండిస్తారు. మొదటి పొయ్యి మీద ఉన్న బాణలిలో ఓ రొట్టె కాస్త దోరగా కాలిన తర్వాత, అదే రొట్టెను పక్కనున్న మరో పొయ్యిపై ఉన్న మూకుడులో వేసి, దాని మీద ఇనుప రేకు ఉంచి దాని మీద నిప్పుల సెగ ఉంచుతారు. కింద, పైన నిప్పులతో రొట్టె సమాంతరంగా కాలి కమ్మగా తయారవుతుంది. తాత వేసే రొట్టె రుచి వెనుక రహస్యం ఇదే. ఈ కాకా హోటల్ రోజూ మధ్యాన్నం మూడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకూ ఉంటుంది. ప్రతిరోజూ



దాదాపు 150 నుంచి 200 మంది ఈ కమ్మటి రొట్టె రుచి చూస్తారు. ఒకసారి ఈ రుచి చూసినవారు మళ్లీ ఇటుగా వచ్చినప్పుడు రొట్టె తినకుండా వెళ్లరు.

### పావలాతో మొదలైన ప్రస్థానం

అబ్బిరెడ్డి తాత సొంతూరు ముక్కామల పక్కనే ఉన్న ఇరుసుమండ. రోజూ అక్కడ నుంచి ముక్కామల కాల్వ గట్టుకు వచ్చి, ఈ పాకలో కాకా హోటల్ నిర్వహిస్తున్నారు. 1969లో జీవనాధారం కోసం మినప రొట్టెలు వేయడం ప్రారంభించారు. పావలాతో ప్రారంభమైన రొట్టె ధర ఇప్పుడు ఇరవై రూపాయలు మాత్రమే. కస్టమర్‌ను తాత చిరునవ్వుతో ఆహ్వానించడంలో మర్యాద కనిపిస్తుంది.

– లక్కింశెట్టి శ్రీనివాసరావు, సాక్షి, రాజమహేంద్రవరం
ఫొటోలు: సుబ్బారావు పరసా

నిర్వహణ: డా. వైజయంతి పురాణపండ

ఆయుర్వేదం

# అంగట్లో వంటనూనెలు

వాసన గ్రహించే ముక్కుకి, రుచిని గ్రహించే నాలుకకి అవినాభావ సంబంధం ఉంది. చక్కగా మరిగిన వంటనూనెలలో రుచిని పెంచే గుణం దాగి ఉంది. అతిగా వాడితే అనారోగ్యం పొంచి ఉంది.

ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుంటే వంటనూనెలను మరిగించడం కంటే పచ్చిగా వాడటమే మంచిది. ప్రస్తుతం బజారులో లభించే సాధారణ వంటనూనెలు... నువ్వుల పప్పు నూనె (తిల తైలం), వేరుసెనగ (పల్లీ) నూనె, సన్‌ఫ్లవర్ ఆయిల్, రైస్ బ్రాన్ ఆయిల్, పామాయిల్, మొదలైనవి. కొన్ని ప్రాంతాలలో కొబ్బరి నూనె, ఆవనూనె వాడుకునే అలవాటు ఉంది. ఇటీవలి కాలంలో కుసుమ నూనె, సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను కూడా ఉపయోగిస్తున్నారు. సామాన్యులు ఈ నూనెల ధరలను బట్టి చవకగా లభించే వాటికే ప్రాధాన్యతనిస్తున్నారు. కారణాలేవైతేనేం! ప్రస్తుతం మినహాయింపు లేకుండా వంటనూనెలన్నీ కల్తీమయమనే విషయం జగమెరిగిన సత్యం. రిఫైన్డ్ ఆయిల్సులో ఉన్న రసాయనిక ద్రవ్యాలు, జంతు కళేబరాల కొవ్వులతో కల్తీ చేయబడ్డ బ్రాండెడ్ ప్యాకెట్లు, ప్రత్తి విత్తనాల నూనెల్ని కలిపి కల్తీ చేయడం వంటి అనేక ప్రక్రియల వల్ల జీర్ణకోశ సమస్యలే కాక, పక్షవాతం, క్యాన్సరు వంటి దారుణ వ్యాధులు కలుగుతున్నాయని వైద్యవిజ్ఞానం ఘోషిస్తోంది. ఈ మధ్యనే కొంచెం అవగాహన పెరిగి, గానుగలను ఆశ్రయించి, మన కళ్ల ముందు ఆడిస్తున్న నువ్వుల పప్పు నూనె, పల్లీల నూనెలపై మొగ్గు చూపుతున్నారు. ఇళ్లల్లో తయారుచేసుకునే పదార్థాలను సేవిస్తున్నారు.

**ఆయుర్వేద గ్రంథాలలోని ప్రస్తావన...**

**నువ్వుల నూనె:** తిలలు అంటే నువ్వులు. పొట్టును తొలగిస్తే ‘నువ్వు పప్పు’ అంటాం. పొట్టుతోబాటు తీసిన నూనెను ఆయుర్వేద ఔషధాలలో వాడతారు. పప్పు నూనె మరింత రుచికరంగా ఉంటుంది.

**గుణధర్మాలు:** దీనిని శరీరానికి మర్దన చేసికొని అభ్యంగ స్నానానికి వాడతారు. వంటనూనెగా కూడా సేవిస్తారు. చర్మానికి మృదుత్వాన్ని, కాంతిని ఇస్తుంది. ఆకలిని పెంచుతుంది. బలాన్ని, తెలివితేటల్ని పెంచుతుంది. స్థూలకాయులకు బరువు తగ్గటానికి, కృశించినవారికి బరువు పెరగటానికి దోహదపడుతుంది. కేశాలకు, నేత్రాలకు మంచిది. గర్భాశయశోధకం. కొంచెం వేడి చేస్తుంది. మలమూత్రాలను అధికంగా కాకుండా కాపాడుతుంది. సాధారణ విరేచనాన్ని సానుకూలం చేస్తుంది. బాహ్యంగానూ, అభ్యంతరంగానూ క్రిమిహరం. శుక్రకరం.



### వాడకపోయినా పరవాలేదు...

ఒకసారి మరిగించిన నూనెలను మళ్లీమళ్లీ మరిగించి వాడితే క్యాన్సరు వంటి ఆరోగ్యసమస్యలు తలెత్తుతాయి ● నూనెలను పచ్చివిగా వాడుకుంటే మంచిది ● కల్తీలను దృష్టిలో ఉంచుకుని అంగట్లో తయారు చేసి అమ్మే సమోసాలు, పకోడీలు, చిప్స్ వంటివి తినకపోవటం మంచిది ● గానుగలో స్వంతంగా ఆడించుకున్న నూనెలను వాడుకుంటూ, ఇంట్లోనే వండిన వాటిని తినడం వల్ల వ్యాధులు సోకవు ● అసలు ఈ నూనెలు వాడకపోయినా, శరీరానికి కావలసిన కొవ్వులు ఆకుకూరల వంటి ఇతర ఆహార శాకాలలో లభిస్తాయి (ఇవి మనకు కంటికి కనపడవు)

నువ్వులలో కాల్షియం, ఐరన్ సమృద్ధిగా ఉంటాయి. మెగ్నీషియం, జింక్, కాపర్, ఫాస్పరస్, మాంగనీస్, సెలీనియం, విటమిన్ బి 1, ఆహారపు పీచు కూడా ఉంటాయి. ప్రొటీన్లు తగినంత ఉంటాయి.

**వేరుసెనగ నూనె:** ఆయుర్వేద కాలంలో దీని ప్రస్తావన లేదు.

**పోషక విలువలు:** ప్రొటీన్లు, కొవ్వులు తగు రీతిలో లభిస్తాయి. పిండి పదార్థాలు తక్కువగా ఉంటాయి. బయోటిన్, కాపర్, నియాసిన్, ఫోలేట్సు, మాంగనీసు, విటమిన్ ఇ , థయామిన్, ఫాస్పరస్, మెగ్నీషియం మొదలైనవి ఉండటం వలన ఆరోగ్యకరం. శరీరబరువు తగ్గటానికి, పిత్తాశయంలో (గాల్‌బ్లాడర్) రాళ్లు ఏర్పడకుండా నిరోధించడానికి దోహదం చేస్తుంది. వేరు సెనగ పలుకుల్ని బాగా ఎండబెట్టి వాడుకుంటే దాని అనర్థాల ప్రభావం ఉండదు.

ఆయుర్వేద గ్రంథాలలో ఆవ నూనె (సర్షప), అవిసె (అతసీ), కుసుమ (కుసుంబ) గసగసాలు (ఖసబీజ), ఏరండ (ఆముదం) నూనెల వివరాలు కూడా ఉన్నాయి.



– డా. వృద్ధుల లక్ష్మీనరసింహశాస్త్రి
ఆయుర్వేద వైద్య నిపుణులు, హైదరాబాద్

శ్రీ ముఖపుస్తకం గారి వంటలు రుచి చూద్దామా!



## పిజ్జా కప్స్

**కావలసినవి**

**స్టఫింగ్ కోసం...**

**నూనె** – ఒక టీ స్పూను; **ఉల్లి తరుగు** – ఒక టీ స్పూను; **స్వీట్ కార్న్** – పావు కప్పు (ఫ్రోజెన్); **క్యాప్సికమ్ తరుగు** – ఒక టేబుల్ స్పూను; **క్యారట్ తరుగు** – ఒక టేబుల్ స్పూను; **ఉప్పు** – తగినంత; **అల్లం వెల్లుల్లి ముద్ద** – ఒక టీ స్పూను; **ఎండు మిర్చి** – 3 (చిన్నచిన్న ముక్కలు చేయాలి)
**ధనియాల పొడి** – ఒక టీ స్పూను; **పిజ్జా చీజ్ తురుము** – తగినంత; **టొమాటో కెచప్** – ఒక టేబుల్ స్పూను

**కప్స్ తయారీ కోసం...**

**బ్రెడ్ స్లయిసులు** – 10 (అంచులు తీసేయాలి); **ఆలివ్ ఆయిల్/బటర్/నెయ్యి** – తగినంత; **చీజ్** – తగినంత; **ఎండు మిర్చి** – 4 (చిన్న చిన్న ముక్కలుగా చేయాలి)

**తయారీ**

స్టౌ మీద బాణలిలో ఒక టీ స్పూను నూనె వేసి కాగాక ఉల్లి తరుగు వేసి బంగారురంగులోకి వచ్చేవరకు వేయించాలి ● స్వీట్ కార్న్ గింజలు, క్యాప్సికమ్ తరుగు, క్యారట్ తరుగు, తగినంత ఉప్పు వేసి బాగా కలిపి, మూత ఉంచి కొద్దిసేపు ఉడికించాలి ● అల్లం వెల్లుల్లి ముద్ద, ఎండు మిర్చి ముక్కలు, ధనియాల పొడి వేసి బాగా కలపాలి ● పిజ్జా చీజ్ తురుము వేసి మరోమారు కలిపాక, టొమాటో కెచప్ వేసి కలిపి, కొద్దిగా ఉడికించి దింపి, పక్కన ఉంచాలి ● అంచులు తీసిన బ్రెడ్ స్లైసులను అప్పడాలకర్ర సహాయంతో సమానంగా కొద్దిగా పల్చగా వచ్చేలా జాగ్రత్తగా ఒత్తాలి ● గుండ్రంగా ఉండే మూతను ఉంచి, బ్రెడ్‌ను రౌండ్‌గా కట్ చేయాలి ● ఒక వైపుగా చిన్నగా గాటు పెట్టాలి ● గుంట పొంగడాల స్టాండులో బ్రెడ్‌ను గుండ్రంగా చుట్టి ఉంచాలి ● తయారుచేసి ఉంచుకున్న స్టఫింగ్ మిశ్రమాన్ని కప్పుల్లో కొద్దికొద్దిగా ఉంచాలి ● ఆలివ్ ఆయిల్/బటర్/నెయ్యి కొద్దికొద్దిగా వేయాలి ● చీజ్ తురుము, ఎండు మిర్చి ముక్కలు వేసి మూత ఉంచాలి ● ఉడికిన తరవాత పిజ్జా కప్పులను ప్లేట్‌లోకి తీసుకుని వేడి వేడిగా తినాలి.

కర్టెసీ: శిల్పి, ఫుడ్స్ అండ్ ఫ్లేవర్స్

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ
శనివారం ॥ 7-12-2019

# నువ్వంటే శబ్దం.. నేనంటే శాసనం

'నువ్వొక మాటంటే అది శబ్దం.. అదే మాట నేనంటే అది శాసనం' అంటూ తన తాజా చిత్రం కోసం పవర్‌ఫుల్ డైలాగ్‌ను చెప్పారు బాలకృష్ణ. 'సింహా, లెజెండ్' లాంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల తర్వాత బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తోన్న మూడో చిత్రానికి శుక్రవారం కొబ్బరికాయ కొట్టారు. ద్వారక క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అంబికా కృష్ణ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు బి. గోపాల్ క్లాప్ ఇచ్చారు. బాలకృష్ణ మాట్లాడుతూ– ''బోయపాటి, నా కాంబినేషన్‌లో సినిమా అనగానే ప్రేక్షకుల్లో, అభిమానుల్లో ఎక్కువ అంచనాలుంటాయి. గతం గతః అన్నది మా సిద్ధాంతం. మా గత సినిమాల గురించి మాట్లాడుకోకుండా పూర్తిగా ఈ సినిమా పైనే మా దృష్టి ఉంచుతాం. ఈ చిత్రంలో ఆధ్యాత్మికం కూడా ఉంటుంది'' అన్నారు. బోయపాటి శ్రీను మాట్లాడుతూ– ''భద్ర' వంటి మంచి సినిమాతో ఇండస్ట్రీలో నా లైఫ్ స్టార్ట్ అయింది. 'సింహా' వంటి భారీ విజయంతో నా జీవితానికి మంచి మలుపు వచ్చింది. 'సింహా, లెజెండ్' చిత్రాలను మించిన మంచి సినిమాను మీ ముందుకు తీసుకొచ్చి నా బాధ్యతను నెరవేర్చుకుంటాను'' అన్నారు. మిర్యాల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ– ''భవిష్యత్తులో నేను చాలా సినిమాలు తీయొచ్చు. కానీ, బాలకృష్ణగారితో సినిమా అంటే గౌరవంగా భావిస్తా. ఆయన అభిమానులు, సినిమా ఇష్టపడే ప్రతి ఒక్కరి నుంచి అటువంటి గౌరవాన్ని పొందే విధంగా ఈ సినిమా నిర్మిస్తానని మాట ఇస్తున్నా'' అన్నారు. ప్రారంభోత్సవ వేడుకలో నిర్మాతలు శివలెంక కృష్ణప్రసాద్, సి.కల్యాణ్, కెమెరామేన్ రాంప్రసాద్, రచయిత ఎం.రత్నం పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్ ఎస్.ఎస్.


బోయపాటి శ్రీను, బాలకృష్ణ, మిర్యాల రవీందర్‌రెడ్డి

# ఖైదీ యాక్షన్


కార్తీ

'ఖైదీ' వంటి సూపర్‌హిట్ తర్వాత కార్తీ నటించిన తమిళ చిత్రం 'తంబి'. 'దృశ్యం' ఫేమ్ జీతు జోసెఫ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో జ్యోతిక, నికిలా విమల్, సత్యరాజ్ కీలక పాత్రధారులు. ఈ సినిమా తెలుగులో 'దొంగ' అనే టైటిల్‌తో ఈ నెల 20న రిలీజ్ కానుంది. తెలుగు థియేట్రికల్ రైట్స్‌ను హర్షిత మూవీస్ అధినేత రావూరి వి. శ్రీనివాస్ సొంతం చేసుకున్నారు. ''యాక్షన్‌తో కూడిన ఎమోషనల్ చిత్రం ఇది. ఆల్రెడీ విడుదల చేసిన టీజర్, సాంగ్స్‌కు మంచి స్పందన లభిస్తోంది. గోవింద్ వసంత మ్యూజిక్, ఆర్. డి రాజశేఖర్ విజువల్స్ ఈ సినిమాకు అదనపు ఆకర్షణ. ఈ చిత్రం తెలుగు హక్కులను మాకు అందించడానికి సంపూర్ణ సహకారం అందించిన కె.ఎఫ్.సి ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు'' అన్నారు రావూరి వి. శ్రీనివాస్.

# క్లాస్ రాజా


రవితేజ

రవితేజ మాస్‌రాజా. వీఐ ఆనంద్ సైన్స్ ఫిక్షన్ డ్రామా సినిమా కోసం 'డిస్కో రాజా'గా మారారు. తాజాగా 'డిస్కో రాజా' టీజర్ రిలీజ్ చేశారు. టీజర్‌లో చాలా క్లాస్‌గా కనిపిస్తూ క్లాస్ రాజాలా ఉన్నారు రవితేజ. ఈ సినిమాలో పాయల్ రాజ్‌పుత్, నభా నటేశ్, తాన్యా హోప్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రామ్ తాళ్లూరి నిర్మాత. 1980–2019 ఇలా రెండు టైమ్‌లైన్స్‌లో కథ నడుస్తుందని సమాచారం. టీజర్‌ని చూస్తే రవితేజ మీద ఏదో ప్రయోగం జరిగినట్టు అర్థం అవుతోంది. మరి ఆ ప్రయోగం వల్ల రవితేజకు ఏం జరిగింది? దాని వల్ల విలన్స్‌కి ఏం జరిగిందో తెలియాలి. ''రవితేజ ఫ్యాన్స్ కోరుకునే విధంగా ఆయన రెట్రో గెటప్ ఉంటుంది. అందరికీ నచ్చే విధంగా సినిమాను సిద్ధం చేస్తున్నాం'' అని చిత్రబృందం తెలిపింది. 2020 జనవరి 24న 'డిస్కో రాజా' విడుదల కానుంది.

# వినోదం.. వినూత్నం

వైవిధ్యంతో కూడిన కథలను ఎంచుకుంటూ హీరోగా సినిమాలు చేస్తుంటారు శ్రీవిష్ణు. తాజాగా మరో విభిన్న కథలో హీరోగా నటించబోతున్నారు. శ్రీవిష్ణు హీరోగా నటించిన 'మెంటల్ మదిలో, బ్రోచేవారెవరురా' చిత్రాలకు దర్శకత్వ శాఖలో పని చేసిన హసిత్ గోలి ఈ సినిమాతో దర్శకునిగా పరిచయం కానున్నారు. టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాను నిర్మించనున్నారు. వివేక్ కూచిభొట్ల, కీర్తీ చౌదరి సహ–నిర్మాతలు. ''వినూత్నమైన కథతో వినోదభరితంగా ఈ చిత్రం తెరకెక్కనుంది. జనవరిలో చిత్రీకరణ మొదలుపెడతాం. ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తారు. వేదరామన్ కెమెరామేన్‌గా పని చేస్తారు''అని చిత్రబృందం పేర్కొంది.


వివేక్ కూచిభొట్ల, టీజీ విశ్వప్రసాద్, శ్రీవిష్ణు, కీర్తి, హసిత్ గోలి

# సెట్లో ఆయన హెడ్ మాస్టర్

''మేనమామ, మేనల్లుడి కథతో తెరకెక్కిన చిత్రం 'వెంకీ మామ'. ఈ సినిమాలో వినోదం, యాక్షన్, మాస్ అంశాలతో పాటు భావోద్వేగాలు ఉంటాయి. సినిమా చూసిన ప్రేక్షకులకు వారి మేనమామ, మేనల్లుళ్లు, మేనకోడళ్లు గుర్తుకు వస్తారు'' అన్నారు కేఎస్ రవీంద్ర (బాబీ). వెంకటేశ్, నాగచైతన్య హీరోలుగా బాబీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెంకీ మామ'. సురేష్‌బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాత. ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా బాబీ చెప్పిన విశేషాలు.


కేఎస్ రవీంద్ర

- సురేష్‌బాబుగారు హెడ్మాస్టర్‌లాంటి వారు.. చాలా సందేహాలు వస్తుంటాయి.. ఇది కరెక్టా? కాదా? అని ఆలోచిస్తారు. బహుశా ఆ లక్షణం ఆయన చదువు, అనుభవం వల్లే ఉండొచ్చు. ఆయన టార్చర్ స్మూత్‌గా ఉంటుంది. కానీ ఒత్తిడి చేయరు.
- వెంకటేశ్‌గారి సినిమాల్లో 'లక్ష్మీ' సినిమా చాలా ఇష్టం. అందులో ఆయన పాత్ర మాస్ ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది. మిలటరీలో ఉండే నాగచైతన్య గ్రామంలో ఉన్న మావయ్య వద్దకు వస్తాడు. వారి మధ్య వచ్చే భావోద్వేగాల సన్నివేశాలు ప్రేక్షకులకు కన్నీళ్లు తెప్పిస్తాయి. వెంకటేష్, నాగచైతన్య కాంబినేషన్‌లో సినిమా చెయ్యాలన్నది రామానాయుడుగారి కల అని సురేష్‌బాబుగారు చెప్పడంతో మరింత బాధ్యతతో ఈ సినిమా చేశా.
- 'వెంకీ మామ' ప్రివ్యూ చూసిన తమన్ ఏడ్చేశాడు. ఇది వీర లెవల్ సినిమా అని సురేష్‌బాబుగారికి చెప్పాడు. తనొక్కడే కాదు.. డిస్ట్రిబ్యూటర్లతో పాటు మరి కొందరు ఈ టైమ్‌కి 'వెంకీ మామ' కరెక్ట్ సినిమా అన్నారు. వ్యక్తిగతంగా నాకు కమర్షియల్ సినిమాలంటేనే ఇష్టం. 'బాబీ భావోద్వేగాలను కూడా బాగా చూపించగలడు' అని ప్రేక్షకులు నమ్మాలి. అది 'వెంకీ మామ'తో కుదిరింది.

# నంబర్ వన్


ప్రియాంకా చోప్రా

ఇండియన్ సినిమా అండ్ టెలివిజన్ సిరీస్‌కు సంబంధించి ఇంటర్‌నెట్ మూవీ డేటాబేస్ (ఐఎమ్‌డీబీ) వెబ్‌సైట్ ఈ ఏడాదికి సంబంధించిన ఇండియన్ సెలబ్రిటీస్ జాబితాను విడుదల చేసింది. ఇందులో తొలి స్థానంలో నిలిచారు హీరోయిన్ ప్రియాంకా చోప్రా. రెండో స్థానంలో దిశా పటానీ, మూడో స్థానాన్ని హృతిక్ రోషన్ కైవసం చేసుకున్నారు. కియారా అద్వానీ, అక్షయ్ కుమార్, సల్మాన్‌ఖాన్, ఆలియా భట్, కత్రినా కైఫ్, రకుల్‌ప్రీత్ సింగ్, కత్రినా కైఫ్ వరుస క్రమంలో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. దక్షిణాది నుంచి కథానాయిక రకుల్‌ప్రీత్ సింగ్ ఒక్కరే ఈ జాబితాలో చోటు సంపాదించుకోవడం విశేషం. ఐఎమ్‌డీబీ ప్రోస్టార్ మీటర్ ర్యాంకింగ్స్, ఐఎమ్‌డీబీ పేజ్ వ్యూయర్స్ వంటి అంశాలను ఆధారంగా తీసుకుని ఈ జాబితాను విడుదల చేయడం జరిగిందని ఐఎమ్‌డీబీ ప్రతినిధి పేర్కొన్నారు.

# ప్లే బ్యాక్ డిఫరెంట్‌గా ఉంటుంది

- సుకుమార్


సుకుమార్, హరిప్రసాద్

దినేష్ తేజ్, అనన్య జంటగా హరి ప్రసాద్ జక్కా దర్శకత్వంలో పెద్దినేని కవిత సమర్పణలో పెద్దినేని ప్రసాద్‌రావు నిర్మిస్తున్న చిత్రం 'ప్లేబ్యాక్'. ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేసిన దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ– ''నేను చేయాలనుకున్న కథ ఈ 'ప్లేబ్యాక్'. విభిన్నమైన కథ. హరిప్రసాద్‌కు ఈ సినిమా మంచి పేరు తెస్తుంది. చిన్న సినిమాలు ఆడుతున్న రోజులు ఇవి. ఈ సినిమా కూడా విజయం సాధిస్తుంది'' అన్నారు. ''నేను, సుకుమార్ పాతికేళ్లుగా స్నేహితులం. పెద్ద కథను కేవలం 35 రోజుల్లో పూర్తి చేశాం. కెమెరామేన్ బుజ్జి ఇందుకు కారణం. హీరో దినేష్ చాలా కష్టపడి చేశాడు'' అన్నారు హరిప్రసాద్. ''నా కెరీర్‌లో ఈ సినిమా మైల్‌స్టోన్‌గా నిలిచిపోతుందనే నమ్మకం ఉంది'' అన్నారు దినేష్. ''డైరెక్టర్ రాసుకున్న థ్రిల్లింగ్ పాయింట్‌ను కెమెరామేన్ బుజ్జి అందంగా చూపించారు. అర్జున్ కల్యాణ్, స్పందన, ఐశ్వర్య బాగా నటించారు'' అన్నారు నిర్మాత డీజే రాజు. ''కొత్త కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ సినిమా విజయం సాధిస్తుంది'' అన్నారు అర్జున్ కల్యాణ్.















'దిశ' ఘటన నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్‌లో హతమార్చడాన్ని అభినందిస్తూ ప్రముఖ కళాకారుడు సుదర్శన్ పట్నాయక్ పూరీ బీచ్‌లో రూపొందించిన సైకత శిల్పం

# వారికి క్షమాభిక్ష కోరే అర్హత లేదు

**రాష్ట్రపతి కోవింద్ కీలక వ్యాఖ్యలు**



**మౌంట్ అబూ:** మహిళలపై జరుగుతున్న వరుస పైశాచిక దాడులు దేశాన్ని వణికిస్తున్నాయని, నైతికంగా దెబ్బ తీస్తున్నాయని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. రాజస్తాన్‌లోని అబూరోడ్‌లో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై శుక్రవారం జరిగిన జాతీయ సదస్సులో రాష్ట్రపతి ప్రసంగించారు. లైంగిక వేధింపులు, దాడుల నుంచి చిన్నారుల్ని రక్షించడానికి తీసుకువచ్చిన ది ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) చట్టం కింద ఉరిశిక్ష పడిన వారికి క్షమాభిక్ష కోరే హక్కు లేకుండా పార్లమెంటు రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం ఉందని అన్నారు. హైదరాబాద్‌లో దిశ హత్యాచారం, ఉన్నావ్‌లో అత్యాచార బాధితురాలిని తగులబెట్టడం వంటి ఘటనల నేపథ్యంలో రాష్ట్రపతి మహిళల భద్రత గురించి మాట్లాడడం ప్రాధాన్యం సంతరించుకుంది. 'అత్యాచార నేరాల్లో ఉరి శిక్ష పడిన వారందరూ క్షమాభిక్ష కోరుతూ పిటిషన్లు దాఖలు చేస్తారు. వారికి రాజ్యాంగం ఆ హక్కుని కల్పించింది. అయితే పోక్సో చట్టం కింద శిక్ష పడిన వారికి ఆ హక్కు ఉండకూడదు. ఆ దిశగా కేంద్రం అడుగులు వెయ్యాలి. చట్టాలను పునఃసమీక్షించాలి'అని సూచించారు. నిర్భయ గ్యాంగ్ రేప్ దోషి క్షమాభిక్ష పెట్టుకున్న సమయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## 'నిందితులను చంపాలనే ఆలోచన రాలేదు'

**న్యూఢిల్లీ:** యావత్తు దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన నిర్భయ కేసును పర్యవేక్షించిన ఢిల్లీ మాజీ పోలీస్ కమిషనర్ నీరజ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిందితులను చంపేయాలన్న ఆలోచన తమకు ఎప్పుడూ రాలేదని చెప్పారు. దిశపై గ్యాంగ్‌రేప్ చేసిన నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. నిర్భయ ఘటన జరిగినప్పటి పరిస్థితులు చాలా క్లిష్టంగా ఉండేవని గుర్తు చేసుకున్నారు. డిసెంబర్ 16, 2012న నిర్భయపై గ్యాంగ్‌రేప్ జరిపి తీవ్రంగా గాయపరచడంతో ఆమె మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో దేశంలో పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. 'నిందితులను బాగా ఆకలిగా ఉన్న సింహాలకు వదిలేయండి. ప్రజలకు అప్పగించండి. అంటూ మాకు చాలా మెసేజ్‌లు వచ్చాయి. కానీ మేం చట్టాన్ని అనుసరించాం' అని అన్నారు. ప్రతి ఎన్‌కౌంటర్ తర్వాత ఎన్నో ప్రశ్నలు ఎదురవుతాయని, ఇది ఒక ఉగ్రవాదిపైనో లేదా గ్యాంగ్‌స్టర్‌పైనో జరిగింది కాదని చెప్పారు. ఈ కేసుపై ప్రజల దృష్టి ఎక్కువగా ఉందన్నారు.

## దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై విచారణ

**సాక్షి, న్యూఢిల్లీ:** 'దిశ'ఘటనలో నిందితుల ఎన్‌కౌంటర్ విషయంలో విచారణ చేపట్టాలని జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్సీ) తెలంగాణ పోలీసులను ఆదేశించింది. ఎన్‌కౌంటర్ ఆందోళన కలిగించే అంశమని, దీనిపై చాలా జాగ్రత్తగా విచారణ జరగాలని పేర్కొంది. నిజనిర్ధారణ చేసేందుకు సంఘటనా స్థలానికి వెళ్లాల్సిందిగా ఎన్‌హెచ్‌ఆర్సీ డైరెక్టర్ జనరల్ (ఇన్వెస్టిగేషన్)ను ఆదేశించినట్లు తెలిపింది. సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నేతృత్వంలోని దర్యాప్తు బృందం త్వరలోనే హైదరాబాద్ వెళ్లి నిజనిర్ధారణ చేసి నివేదిక అందజేస్తుందని వివరించింది. ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పోలీసులు అప్రమత్తంగా లేరని కమిషన్ భావించింది. నిందితుల నుంచి అవాంఛనీయ ఘటన జరుగుతుందని అప్రమత్తంగా ఉండాల్సినా అలా లేకపోవడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారని భావించింది. 'పోలీసు కస్టడీలో ఉన్నప్పుడు ఈ ఘటన జరగడం.. సమాజానికి తప్పుడు సందేశాన్ని పంపుతుంది'అని ఎన్‌హెచ్‌ఆర్సీ వ్యాఖ్యానించింది.

# లోక్‌సభలో 'ఉన్నావ్' రభస

- అత్యాచార బాధితురాలిపై హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించిన సభ్యులు
- స్మృతి ఇరానీపై కాంగ్రెస్ సభ్యుల అనుచిత ప్రవర్తన



పార్లమెంటులో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి స్మృతి ఇరానీ

**సాక్షి, న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో అత్యాచార బాధితురాలిని సజీవంగా తగలపెట్టేందుకు ప్రయత్నించిన ఘటనపై శుక్రవారం లోక్‌సభ అట్టుడికింది. చర్చ సందర్భంగా పలువురు సభ్యులు హైదరాబాద్‌లో దిశ హత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్‌ను కూడా ప్రస్తావించారు. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ప్రసంగిస్తున్న సమయంలో ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు.. ఆమెను బెదిరిస్తున్న తీరులో వ్యవహరించడంపై బీజేపీ సభ్యులు మండిపడ్డారు. జీరో అవర్‌లో ఉన్నావ్ ఘటనను లేవనెత్తిన కాంగ్రెస్ సభ్యుడు ఆధిర్ రంజన్ చౌధురి చేసిన ఒక వ్యాఖ్య బీజేపీ సభ్యులకు ఆగ్రహం తెప్పించింది. 'ఒకవైపు రామ మందిర నిర్మాణ ఏర్పాట్లు జరుగుతుంటే.. మరోవైపు సీతమ్మలను తగలబెడ్తున్నారు' అని చౌధురి వ్యాఖ్యానించారు. ఉత్తర పదేశ్ చట్టాలు అమలుకాని అధర్మ ప్రదేశ్‌గా మారిందన్నారు. దీనిపై హోం మంత్రి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్, ఉన్నావ్ ఘటనలను పోలుస్తూ.. 'నిందితులను హైదరాబాద్ పోలీసులు కాల్చిపారేశారు.. ఉత్తరప్రదేశ్ పోలీసులు వదిలేశారు' అని వ్యాఖ్యానించారు. అనంతరం కేంద్రమంత్రి స్మృతి ఇరానీ మాట్లాడుతూ ఉన్నావ్ ఘటనకు మతం రంగు పులముతున్నారని, రాజకీయం చేస్తున్నారని విపక్షాలపై విమర్శలు గుప్పించారు.

**కాంగ్రెస్ సభ్యుల అనుచిత ప్రవర్తన**

ఇరానీ ఆవేశంగా మాట్లాడుతుండగా.. కాంగ్రెస్ సభ్యులు టీఎన్ ప్రతాపన్, దీన్ కురియకొసె గట్టిగా అరుస్తూ, ఆగ్రహంగా ఇరానీ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. ప్రతాపన్ బెదిరింపు ధోరణిలో షర్ట్ చేతులను పైకి లాక్కోవడం కనిపించింది. దీనిపై ఇరానీ, బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. లంచ్ బ్రేక్ తరువాత ఆ ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు సభలోకి రాలేదు.

## వెంటిలేటర్‌పై ఉన్నావ్ బాధితురాలు

ఉన్నావ్ అత్యాచార బాధితురాలు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలి పరిస్థితి చాలా విషమంగా ఉందని, వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రత్యేక వైద్యుల బృందం ఎప్పటికప్పుడు ఆమె పరిస్థితిని పరిశీలిస్తోందని వెల్లడించారు. కాగా, నిందితుల బంధువులు బెదిరిస్తున్నారంటూ బాధితురాలి కుటుంబ సభ్యుడొకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనకు రక్షణ కల్పిస్తామని ఎస్పీ చెప్పారు.

## క్లుప్తంగా...

### 'దిశ' ఎన్‌కౌంటర్.. ఆ పోలీసులకు రివార్డు!

**హిసార్(హరియాణా):** 'దిశ' ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులకు రివార్డు అందించనున్నట్లు హరియాణాకు చెందిన రాహ్ గ్రూప్ ఫౌండేషన్ చైర్మన్ నరేశ్ సెల్వార్ తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులకు రూ. లక్ష చొప్పున ఇవ్వనున్నట్లు చెప్పారు. రాహ్ గ్రూప్ ప్రకటనపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

### నృత్యం ఆపిందని ముఖంపై కాల్చాడు..!

**చిత్రకూట్:** వివాహ వేడుకలో నృత్యం ఆపిందనే కోపంతో ఓ వ్యక్తి జరిపిన కాల్పుల్లో మహిళా డ్యాన్సర్ తీవ్రంగా గాయపడింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని టిక్రా గ్రామంలో జరిగింది. నవంబర్ 30న టిక్రా గ్రామపెద్ద సుహిర్ సింగ్ పటేల్ కుమార్తె వివాహం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బరాత్‌లో నృత్యం ఆపేశారని కోపం తెచ్చుకున్న సుహిర్ సింగ్ బంధువు ఒకరు నాటు తుపాకీతో డ్యాన్సర్లపైకి కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఒక డ్యాన్సర్ తీవ్రంగా, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనలో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు.

### పోర్న్ సైట్ల వల్లే రేప్‌లు: నితీశ్



**గోపాల్‌గంజ్:** పోర్న్ సైట్ల కారణంగానే మహిళలపై లైంగిక నేరాలు పెరుగుతున్నాయని బిహార్ సీఎం నితీశ్ కుమార్ వ్యాఖ్యానించారు. పోర్న్‌సైట్లను నిషేధించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. 'దిశ' ఘటనపై ఆయన మాట్లాడుతూ.. 'సోషల్ మీడియా, సాంకేతికత పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయడం వల్లే మహిళలు, చిన్నారులపై దేశమంతటా ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయి. నేరగాళ్లు వీటిని చిత్రీకరించి, ఇంటర్నెట్‌లో పెడుతున్నారు. వీటిని చూసి ఇతరులు దారుణాలకు పాల్పడుతున్నారు. అందుకే ఈ పోర్న్ సైట్లపై దేశంలో పూర్తి నిషేధం విధించాలని కేంద్రానికి లేఖ రాస్తా' అని వెల్లడించారు.



చిత్రంలో కనిపిస్తున్న 'గోడకు అంటించిన నిజమైన అరటిపండు' ఇటలీలోని మియామి బీచ్ ఆర్ట్ గ్యాలరీలో ఏకంగా రూ. 80 లక్షలకు అమ్ముడైంది. 'కమెడియన్'గా పేరొందిన మౌరిజియో కాటెలాన్ అనే కళాకారుడు ఈ ఆర్ట్‌ను రూపొందించారు.



కెన్యా రాజధాని నైరోబిలో కుప్పకూలిన ఆరు అంతస్తుల భవంతి. శిథిలాల నుంచి నాలుగు మృతదేహాలను బయటకు తీశామని, చాలా మంది శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని అధికారులు చెప్పారు.

## నిత్యానంద పాస్‌పోర్టు రద్దు

**న్యూఢిల్లీ:** అత్యాచారం కేసులో ఆరోపణలెదుర్కొంటున్న స్వామి నిత్యానంద పాస్‌పోర్టును భారత ప్రభుత్వం రద్దు చేసింది. అదేవిధంగా ఆయనకు ఈక్వెడార్ దేశం ఆశ్రయం కల్పించిందన్న వార్తల్ని ఆ దేశ ప్రభుత్వం ఖండించింది. నిత్యానందను పట్టుకోవాలని విదేశాల్లో ఉన్న భారతీయ రాయబార కార్యాలయాలు, అధికారులను స్థానిక ప్రభుత్వాన్ని భారత్ అప్రమత్తం చేసింది. అత్యాచార కేసులో ఆరోపణలతోపాటుగా అపహరణ వంటి అనేక కేసులు నిత్యానందపై ఉన్నాయని వెల్లడించింది.

## మహిళల రక్షణకు చర్యలు తీసుకోండి

**రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర హోంశాఖ లేఖ**

**న్యూఢిల్లీ:** మహిళల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర హోంశాఖ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖలు రాసింది. గత కొద్ది రోజులుగా వెలుగు చూస్తున్న అత్యాచార ఘటనలు, దాడుల నేపథ్యంలో లేఖ రాస్తున్నట్లు కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్‌భల్లా తెలిపారు. మహిళల రక్షణ ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఆయన చెప్పారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు చట్టాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, అయినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో పోలీసులు విఫలమైతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహిళలు, బాలికలకు సంబంధించిన ఫిర్యాదుల విషయంలో పోలీసులు వేగంగా స్పందించాలని కోరారు. ఇన్వెస్టిగేషన్ ట్రాకింగ్ సిస్టం ఫర్ సెక్సువల్ అఫెన్సెస్ (ఐటీఎస్ఎస్ఓ) పోర్టల్ ద్వారా ఆయా రాష్ట్రాలలోని అత్యాచార కేసుల విచారణను రెండు నెలల్లోగా పూర్తయ్యేలా పర్యవేక్షణ చేసుకోవచ్చని అందులో సూచించారు.

## నల్సా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా జస్టిస్ రమణ

**నామినేట్ చేసిన రాష్ట్రపతి**



**సాక్షి, న్యూఢిల్లీ:** దేశ సర్వోన్నత న్యాయస్థానంలో సీనియారిటీలో రెండో స్థానంలో ఉన్న జస్టిస్ నూతలపాటి వెంకట రమణ జాతీయ న్యాయ సేవల సంస్థ (నల్సా) ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈమేరకు భారత రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నియమించినట్టు కేంద్ర న్యాయ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నవంబర్ 27 నుంచే ఈ నియామకం వర్తిస్తుందని ఉత్తర్వులో పేర్కొంది. ఇప్పటి వరకు జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఉన్నారు. అట్టడుగు వర్గాలు, వెనకబడిన వర్గాలకు నిష్పాక్షికమైన, అర్థవంతమైన న్యాయం అందించే లక్ష్యంగా సమీకృత న్యాయ వ్యవస్థను ప్రోత్సహించేందుకు 1987లో నల్సాను స్థాపించారు. జస్టిస్ ఎన్.వి.రమణ సుప్రీం కోర్టు లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా(ఎస్సీఎల్ఎస్సీ) కూడా ఉన్నారు. ఆయన పదవీ కాలంలో ఎస్సీఎల్ఎస్సీలో పెండింగ్ కేసులు తగ్గాయి. జనవరి 2018 లో 3,800 కేసులు ఉండగా.. ఆగస్టు 2019 నాటికి 1811కు తగ్గాయి. నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జస్టిస్ ఎన్.వి.రమణ శుక్రవారం జామ్ నగర్ హౌజ్‌లోని నల్సా కార్యాలయం సందర్శించారు. నల్సా డైరెక్టర్ సునీల్ చౌహాన్, ఇతర అధికారులతో చర్చించారు. న్యాయ సేవలు అందించడంలో సమర్థతను, న్యాయ సేవలు పొందగలిగే అవకాశాలను పెంపొందించడంపై చర్చించారు. నల్సా భవిష్యత్తు కార్యక్రమాలకు మార్గదర్శకంగా జస్టిస్ ఎన్.వి.రమణ ఒక విజన్ స్టేట్‌మెంట్‌ను ఆవిష్కరించారు. లీగల్ సర్వీసెస్ క్లినిక్స్ సమర్థవంతంగా పనిచేసేలా చూడడం, డిజిటైజేషన్ చేయడం, న్యాయ సేవలు పొందడంలో ప్రొటోకాల్ రూపొందించడం వంటి కార్యక్రమాలపై నల్సా దృష్టిపెట్టనుంది.

## రైల్వే అధికారులకు బలవంతపు ఉద్యోగ విరమణ

**న్యూఢిల్లీ:** భారత రైల్వే చెందిన 32 మంది అధికారులతో రైల్వేశాఖ బలవంతపు పదవీ విరమణ చేయించింది. ఈ అధికారులు అంతా 50 ఏళ్ల వయసు వారే. అసమర్థత, సందేహాస్పద తీరు వంటి కారణాలతో వీరితో విరమణ చేయించినట్లుగా రైల్వేశాఖ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉద్యోగుల పనితీరును, సామర్థ్యాన్ని సమీక్షించేందుకు గాను వేసిన కమిటీ ఇటీవల రైల్వే శాఖకు ఓ నివేదికను అందజేసింది. అందులో 1,780 మంది ఉద్యోగుల పనితీరును సమీక్షించిన కమిటీ ఈ 32 మంది ఉద్యోగులను ముందస్తు ఉద్యోగ విరమణకు ప్రతిపాదించిందని తెలిపింది.

## నిర్భయ దోషికి క్షమాభిక్ష వద్దు!

**న్యూఢిల్లీ:** నిర్భయ హత్యాచార దోషుల్లో ఒకరైన వినయ్ శర్మ పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు శుక్రవారం కేంద్ర హోంశాఖ సిఫారసు చేసింది. ఈ మేరకు ఢిల్లీ ప్రభుత్వ సిఫారసును రాష్ట్రపతికి పంపించింది. దిశ హత్యాచార నిందితులను హైదరాబాద్ పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన రోజే ఈ సిఫారసు చోటు చేసుకుంది. మరోవైపు, క్షమాభిక్ష వినతిని తోసిపుచ్చాలని నిర్భయ తల్లి కూడా రాష్ట్రపతిని కోరింది. 2012 డిసెంబర్‌లో నిర్భయను ముకేశ్, పవన్, వినయ్, అక్షయ్‌లు పాశవికంగా అత్యాచారం చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. అనంతరం ఆ నలుగురికి కోర్టు మరణశిక్ష విధించింది. వారిలో వినయ్ శర్మ క్షమాభిక్ష పిటిషన్ రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉంది. ఏడేళ్లు గడచిపోయినా, తమకు న్యాయం జరగలేదని, అదే అవేదనను ఇంకా అనుభవిస్తూనే ఉన్నామని రాష్ట్రపతికి రాసిన లేఖలో నిర్భయ తల్లి వివరించారు. తమలా కాకుండా, దిశ తల్లిదండ్రులకు సత్వరమే న్యాయం లభించిందని ఆ లేఖలో ప్రస్తావించారు.

# మెరుగైన భవిష్యత్తుకే!

**ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం కల్పించడంపై ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ:** మెరుగైన భవిష్యత్తును కల్పించే ఉద్దేశంతోనే విదేశాల్లో వేధింపులు ఎదుర్కొన్న వారికి భారత పౌరసత్వం కల్పిస్తున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌ల్లో మతపరమైన వేధింపులు, హింస ఎదుర్కొన్న ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించే బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపిన తరువాత తొలిసారి ప్రధాని ఈ విధంగా స్పందించారు. భరతమాతపై విశ్వాసమున్న, విదేశాల్లో వేధింపులు ఎదుర్కొన్న వారికి మెరుగైన భవిష్యత్తును హామీ ఇస్తూ భారత్‌కు స్వాగతం పలుకుతున్నాం' అని హిందూస్తాన్ టైమ్స్ నాయకత్వ సదస్సులో శుక్రవారం మోదీ వ్యాఖ్యానించారు. అయోధ్య తీర్పుపై స్పందిస్తూ.. 'తీర్పు వల్ల సమాజంలో అశాంతి నెలకొనే అవకాశముందని తీర్పునకు ముందు చాలామంది అనుమానించారు. కానీ వారి అనుమానాలు తప్పని ప్రజలు నిరూపించారు' అన్నారు. జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయడంపై.. 'అది రాజకీయంగా కష్టమైన చర్యగా కనిపించవచ్చు, కానీ ఆ నిర్ణయం జమ్మూ, కశ్మీర్, లద్దాఖ్ ప్రజల అభివృద్ధికి ఒక ఆశాకిరణంగా మారింది' అని స్పందించారు.

**మారిషస్ ప్రధానితో భేటీ**

భద్రమైన, స్థిరమైన, ప్రగతిశీల మారిషస్ నిర్మాణానికి తమ సహకారం ఎల్ల వేళలా ఉంటుందని భారత్ హామీ ఇచ్చింది. ప్రధాని మోదీ శుక్రవారం మారిషస్ ప్రధాని ప్రవింద్ జగనాథ్‌తో భేటీ అయ్యారు. మారిషస్ పార్లమెంట్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రవింద్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. భారత్, మారిషస్ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని వారు నిర్ణయించారు. తమ దేశంలోని అనేక అభివృద్ధి ప్రాజెక్టుల్లో భారత్ భాగస్వామ్యం ఉందని మారిషస్ ప్రధాని గుర్తు చేశారు.



పుణె విమానాశ్రయంలో ప్రధానికి స్వాగతం పలుకుతున్న సీఎం ఉద్ధవ్

**మోదీకి ఉద్ధవ్ స్వాగతం**

**పుణె:** ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే తొలిసారి ప్రధాని మోదీని కలిశారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ), ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజీపీ)ల జాతీయ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన మోదీకి ఉద్ధవ్ ఠాక్రే పుణె విమానాశ్రయంలో స్వాగతం పలికారు. గవర్నర్ కోశ్యారీ, మాజీ సీఎం ఫడ్నవీస్ కూడా ఉన్నారు.

## అయోధ్య తీర్పుపై 6 రివ్యూ పిటిషన్లు

**న్యూఢిల్లీ/అయోధ్య:** అయోధ్య వివాదంపై సుప్రీంకోర్టు వెలువరించిన చారిత్రక తీర్పుపై సమీక్ష కోరుతూ శుక్రవారం 6 పిటిషన్లు దాఖలయ్యాయి. సుప్రీం తీర్పును సమీక్షించాలంటూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు(ఏఐఎంపీఎల్‌బీ) తరపున ఆరుగురు వేర్వేరుగా తమ లాయర్ ఎంఆర్ శంషాద్ ద్వారా శుక్రవారం ఈ ఆరు పిటిషన్లు వేశారు. కాగా, అయోధ్యలో శుక్రవారం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు యథావిధిగా పనిచేశాయి. మసీదుల్లో ప్రార్థనలు, ఆలయాల్లో పూజలు ప్రశాంతంగా జరిగాయి. బాబ్రీ మసీదు విధ్వంసాన్ని పురస్కరించుకుని ముస్లిం సంస్థలు ఏటా డిసెంబర్ 6వ తేదీని బ్లాక్ డేగా వ్యవహరిస్తూండగా, హిందువులు శౌర్యదినంగా పాటిస్తున్న విషయం తెలిసిందే.



దిశ హత్యకేసు నిందితుల ఎన్‌కౌంటర్ వార్త తెలిసి శుక్రవారం పట్నాలో ఆనందంతో రంగులు పూసుకుంటున్న ప్రజలు

# సాహో తెలంగాణ పోలీస్!

దిశ అత్యాచారం, హత్య కేసులో నలుగురు నిందితుల్ని తెలంగాణ పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడంపై దేశవ్యాప్తంగా సామాన్యుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తం అవుతున్నాయి. సాహో తెలంగాణ పోలీస్ అంటూ జేజేలు పలుకుతున్నారు.. కానీ, రాజకీయ నాయకుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్‌కౌంటర్‌పై ఎవరి స్పందన ఎలా ఉందంటే..



హైదరాబాద్ పోలీసుల్ని చూసి ఢిల్లీ పోలీసులు, ప్రభుత్వం, కోర్టులు ఎంతైనా నేర్చుకోవాలి. నిర్భయ దోషుల్ని వెంటనే ఉరి తీయాలి. క్రూరాతి క్రూరమైన నేరానికి పాల్పడిన వారికి అలాంటి శిక్షలే పడాలి. తెలంగాణ పోలీసులు సరైన పనే చేశారు. మేము ఏడేళ్లుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్నాం. దిశ తల్లిదండ్రులకు ఆ ఎదురుచూపులు తప్పాయి. వారి కడుపుకోత మాకు అర్థమవుతుంది. కనీసం వారికైనా సత్వర న్యాయం జరిగింది.

**- నిర్భయ తల్లిదండ్రులు**



ఒక సాధారణ పౌరురాలిగా ఈ ఎన్‌కౌంటర్‌పై ఆనందం వ్యక్తం చేస్తున్నా. ప్రజలంతా ఏ తీర్పు కోరుకున్నారో అదే జరిగింది. అయితే అది చట్టపరంగా న్యాయస్థానంలో జరిగి ఉండాల్సింది.

**- రేఖా శర్మ, జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు**



హైదరాబాద్ ఎన్‌కౌంటర్ రేపిస్టులకు గట్టి సందేశాన్ని పంపింది. ప్రజలు న్యాయం జరిగిందనే అంటున్నారు. కానీ దేశవ్యాప్తంగా న్యాయం కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది నిర్భయల సంగతేంటి ? నేనైతే ఈ దేశం ఒక పద్ధతి ప్రకారం ముందుకు వెళ్లాలని అనుకుంటున్నాను.

**- స్వాతి మాలివాల్, ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్**



హైదరాబాద్ ఎన్‌కౌంటర్‌ను ప్రజలందరూ హర్షిస్తున్నారు. మన దేశంలో క్రిమినల్ న్యాయవ్యవస్థపై ప్రజలకి నమ్మకం పోయింది. అది అత్యంత ప్రమాదకరమైన విషయం.

**- కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి**



పోలీసులు ఆత్మరక్షణ కోసమే నిందితుల్ని ఎన్‌కౌంటర్ చేశారు. నిందితులు పోలీసులపై దాడికి ప్రయత్నించడం వల్లే పోలీసులకు వారిని చంపక తప్పలేదు.

**- యడియూరప్ప, కర్ణాటక ముఖ్యమంత్రి**



చట్టం తన పని తాను చేసుకుపోవాలి. కానీ ఎవరూ దానిని చేతుల్లోకి తీసుకోకూడదు. హైదరాబాద్, ఉన్నావ్ అత్యాచార ఘటనలు దేశానికే సిగ్గుచేటు. బాధితుల గురించి ఆలోచిస్తే నా గుండె రగిలిపోతుంది. రేపిస్టులను శిక్షించడానికి చట్టాలను మరింత పకడ్బందీగా నిర్మించాలి.

**-మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి**



అత్యాచార బాధితురాలికి సత్వర న్యాయం జరిగింది. ఏమీ చేయకుండా చేతులు ముడుచుకొని కూర్చోవడం కంటే ఆలస్యంగానైనా ఏదో ఒకటి చేయడం మంచిది.

**- జయా బచ్చన్, రాజ్యసభ ఎంపీ**



హైదరాబాద్ ఎన్‌కౌంటర్ దేశానికి ఎంతో ప్రమాదకరమైనది. చట్టాన్ని పోలీసులు తమ చేతుల్లోకి తీసుకోకూడదు. విచారణ పూర్తవకుండా పోలీసులే నిందితుల్ని కాల్చి పారేస్తే ఇంక ఈ చట్టాలు, న్యాయవ్యవస్థ ఎందుకు ? కోర్టులే వారికి ఉరిశిక్ష వేసి ఉండవలసింది.

**-మేనకా గాంధీ, బీజేపీ నేత**



హైదరాబాద్ పోలీసులు తీసుకున్న చర్యలు అభినందనీయం. వారిని చూసి యూపీలో పోలీసు యంత్రాంగం స్ఫూర్తి పొందాలి. ఉత్తరప్రదేశ్‌లో ప్రతీరోజూ ప్రతీ జిల్లాలో ఏదో ఒక అత్యాచారం కేసు వెలుగులోకి వస్తోంది. యుక్తవయసులో ఉన్న వారిని, వయసు మీద పడిన వారిని ఏ మహిళనీ వదలడం లేదు. ఈ రాష్ట్రంలో గూండారాజ్యం నడుస్తోంది.

**- మాయావతి, బీఎస్పీ అధినేత్రి**



మహిళల భద్రతపై ఆందోళనలకు పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సమాధానం కాకూడదు. నిర్భయ చట్టాన్ని సరిగ్గా ఎందుకు అమలు చేయలేకపోతున్నారు?.

**- సీతారాం ఏచూరి, సీపీఎం నేత**



పోలీసుల చేతికి తుపాకులు ఇచ్చింది ఏదో ప్రదర్శన కోసం కాదు. నిందితులు పారిపోతుంటే వాడుకోవడానికి మాత్రమే.

**-మీనాక్షి లేఖి, బీజేపీ ఎంపీ**



పురుషుల నుంచి మహిళలు అధికారాన్ని లాక్కొని, తమకు ఎదురయ్యే ఘటనల నుంచి రక్షణ పొందాలి. మహిళలు పంచాయతీ, విధాన సభ ఎన్నికల్లో పోటీ చేయాలి. రాజకీయాల్లోకి వచ్చి అధికారాన్ని పొందడం ద్వారా ఇలాంటి పరిస్థితుల నుంచి రక్షించుకోవచ్చు. 'ఉన్నావ్' లాంటి ఘటనలు జరుగుతుంటే ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం ఎలా ఉంటుంది?

**- ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి**

సాక్షి స్పోర్ట్స్
శనివారం
7-12-2019

## వీవీఎస్ చేతులతో అజ్జూ స్టాండ్....




సాక్షి, హైదరాబాద్: భారత దిగ్గజ బ్యాట్స్‌మన్ వీవీఎస్ లక్ష్మణ్ చేతుల మీదుగా అజహరుద్దీన్ స్టాండ్ ప్రారంభమైంది. ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కు భారత మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్ పేరు పెట్టారు. అజ్జూ ఇప్పుడు హైదరాబాద్ క్రికెట్ సంఘానికి (హెచ్‌సీఏ) అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు. శుక్రవారం తొలి టి20 సందర్భంగా స్టాండ్‌ను లక్ష్మణ్ లాంఛనంగా ప్రారంభించాడు. దీనిపై అజహర్ స్పందిస్తూ 'నాకు చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి గౌరవం దక్కడం ఆనందంగా ఉంది. నేను క్రికెట్‌ను స్ఫూర్తిగా ఆడాను. హైదరాబాద్‌లో క్రికెట్ అభివృద్ధికి నా వంతు సహకారం అందించాను' అని అన్నాడు. తన పేరిట స్టాండ్ ఆవిష్కరణ తర్వాత భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ ఆటగాళ్లను హెచ్‌సీఏ అధ్యక్షుడు అజహరుద్దీన్ సన్మానించాడు.



**5** అంతర్జాతీయ టి20ల్లో ఐదుసార్లు ఛేజింగ్‌లో 200 అంతకంటే ఎక్కువ పరుగులు చేసి విజయం సాధించిన తొలి జట్టుగా భారత్ గుర్తింపు పొందింది.

**కోహ్లి గేర్ మారిందిలా...**
1-10 బంతులు: 7 పరుగులు
11-20 బంతులు: 13 పరుగులు
21-30 బంతులు: 19 పరుగులు
31-40 బంతులు: 28 పరుగులు
41-50 బంతులు: 27 పరుగులు

**1** అంతర్జాతీయ టి20ల్లో భారత్‌కిదే అత్యధిక ఛేదన. గతంలో శ్రీలంకపై (207-మొహాలీలో, 2009); ఆస్ట్రేలియాపై (202-రాజ్‌కోట్‌లో, 2013) చేసిన ఛేజింగ్స్ వెనక్కి వెళ్లాయి.

# కిర్రాక్ పుట్టించాడే!

**కోహ్లి కళ్లు చెదిరే ఇన్నింగ్స్ ● 50 బంతుల్లో 94 నాటౌట్**
**6 ఫోర్లు, 6 సిక్స్‌లు ● 208 పరుగుల లక్ష్యం అవలీలగా ఛేదన**
**తొలి టి20లో భారత్ జయభేరి ● రాణించిన రాహుల్**
**హెట్‌మైర్ మెరుపులు వృథా ● రేపే రెండో టి20**

విరాట్ కోహ్లి తన అద్వితీయ బ్యాటింగ్‌తో హైదరాబాద్ ప్రేక్షకుల మనసుల్లో కిర్రాక్ పుట్టించాడు. ఛేదనలో మళ్లీ మొనగాడిగా నిలిచాడు. బౌలర్లను కనిపెట్టుకునే ఉప్పల్ పిచ్ తొలి అంతర్జాతీయ టి20లో మాత్రం పరుగుల ఉప్పెనలా మారింది. ముందు రాహుల్ మెరుపులకు తోడుగా నిలిచిన కోహ్లి ఆ తర్వాత అన్నీ తానై గెలిపించాడు.

సాక్షి, హైదరాబాద్: కోహ్లి అలసటెరుగని పోరాటంతో భారత్‌ను గెలిపించాడు. అతను కడదాకా నిలిచాడు. కసిదీరా బంతుల్ని కొట్టాడు. దీంతో ప్రత్యర్థి బౌలర్లు, ఫీల్డర్లే కాదు బంతి కూడా దెబ్బ మీద దెబ్బలతో విసిగిపోయింది. విరాట్ ఆఖరి దాకా నిలువడంతో కొండంత లక్ష్యం కూడా చిన్నబోయింది. శుక్రవారం జరిగిన తొలి టి20లో టీమిండియా 6 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి (50 బంతుల్లో 94 నాటౌట్; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) విశ్వరూపంతో కరీబియన్ల భరతం పట్టాడు. ముందుగా వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీస్కోరు చేసింది. హెట్‌మైర్ (41 బంతుల్లో 56; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), లూయిస్ (17 బంతుల్లో 40; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) చెలరేగారు. భారత బౌలర్లలో చహల్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసి గెలిచింది. రాహుల్ (40 బంతుల్లో 62; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించాడు. ఈ విజయంతో మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇరుజట్ల మధ్య ఆదివారం తిరువనంతపురంలో రెండో టి20 జరుగుతుంది.

### విరుచుకుపడిన లూయిస్...

టాస్ నెగ్గిన కోహ్లి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దీంతో విండీస్ పరుగులు మొదలుపెట్టగా... ఓపెనర్ ఎవిన్ లూయిస్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. వాషింగ్టన్ సుందర్ వేసిన తొలి ఓవర్లోనే ఫోర్, సిక్సర్‌తో ఎదురుదాడికి దిగాడు. అయితే దీపక్ చాహర్ బౌలింగ్‌కు దిగిదిగగానే విండీస్ ఓపెనర్ సిమన్స్ (2) వికెట్‌ను పడేశాడు. క్రీజ్‌లోకి బ్రాండన్ కింగ్ రాగా... విండీస్ జోరు అంతకంతకూ పెరిగింది. చాహర్ మరుసటి ఓవర్లో లూయిస్ 6, 4 కొడితే, కింగ్ కూడా ఓ సిక్సర్ బాదాడు. ధాటిగా ఆడుతున్న లూయిస్‌ను సుందర్ ఎల్బీగా అవుట్ చేశాడు.


హెట్‌మైర్


రాహుల్

### హెట్‌మైర్ అర్ధసెంచరీ

తర్వాత క్రీజ్‌లోకి దిగిన ప్రతీ ఒక్కరూ బాదేయడంతో విండీస్ స్కోరు ఏ దశలోనూ 10 పరుగుల సగటుకు పడిపోలేదు. హెట్‌మైర్, కింగ్ (23 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) చకచకా పరుగులు సాధించారు. పదో ఓవర్ పూర్తికాకముందే జట్టు స్కోరు వందకు చేరింది. దూకుడుగా ఆడుతున్న కింగ్ జడేజా బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యాడు. తర్వాత హెట్‌మైర్‌కు కెప్టెన్ పొలార్డ్ జతయ్యాడు. ఇద్దరు మెరుపులు మెరిపించడంతో స్కోరు వేగం మరింత పుంజుకుంది. హెట్‌మైర్ 35 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌ల సాయంతో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఇద్దరిని ఒకే ఓవర్లో స్పిన్నర్ చహల్ ఔట్ చేయడంతో... హోల్డర్ (24 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), రామ్‌దిన్ (11 నాటౌట్) జట్టు స్కోరును 200 పరుగులు దాటించారు.

### రాహుల్ జిగేల్

లక్ష్యం కష్టసాధ్యమే అయినా... ఛేదనకు తగ్గట్లుగానే బ్యాట్‌కు పనిచెప్పారు భారత బ్యాట్స్‌మెన్. రాహుల్ వేగంగా ఆడాడు. రెండో ఓవర్లో మూడు బౌండరీలు బాదాడు. రోహిత్ శర్మ (8) విఫలమైనప్పటికీ తర్వాత కెప్టెన్ కోహ్లి జతకావడంతో భారత్ లక్ష్యంవైపు పరుగు పెట్టింది. ఆరో ఓవర్లో జట్టు 50 పరుగులు చేసింది. ఇద్దరూ వెస్టిండీస్ బౌలింగ్‌ను తుత్తునీయలు చేస్తూ పటిష్టమైన భాగస్వామ్యానికి బాట వేశారు. 11.4 ఓవర్లలో భారత్ 100 పరుగులను చేరుకుంది. కాసేపటికే రాహుల్ 37 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో అర్ధసెంచరీ సాధించాడు. రెండో వికెట్‌కు కోహ్లి, రాహుల్ 100 పరుగులు జోడించారు. అనంతరం భారీషాట్‌కు యత్నించి రాహుల్ నిష్క్రమించాడు.

### విరాట్... ధనాధన్...

పెద్ద లక్ష్యం ముందుండగా... హిట్‌మ్యాన్ (రోహిత్) చేతులెత్తేయగా... విరాట్ కోహ్లి ఇన్నింగ్స్‌కు మూలస్తంభమయ్యాడు. 200 పైచిలుకు లక్ష్యం కావడంతో తన వికెట్ విలువ ఏంటో తెలుసుకొని ఆడాడు. రాహుల్ చెలరేగేందుకు ఊతమిచ్చిన భారత కెప్టెన్ జట్టు గెలిచేదాకా క్రీజ్‌ను అంటిపెట్టుకున్నాడు. రాహుల్ జోరులో వెనుకబడినట్లు కనిపించిన కోహ్లి... అతను ఔటయ్యాక మాత్రం అంతా తానై ఇన్నింగ్స్‌ను నడిపించాడు. 10వ ఓవర్ ముగిసే సమయానికి రాహుల్ (46) చేసిన పరుగుల్లో కోహ్లి (20) సగమైనా చేయలేదు. కానీ మూడు ఓవర్ల వ్యవధిలోనే అతన్ని సమీపించాడు. హోల్డర్ వేసిన 11, 15వ ఓవర్లలో వరుసగా 6, 4 బాదిన కోహ్లి మ్యాచ్ సాగేకొద్దీ కసిదీరా బ్యాట్ ఝుళిపించాడు. విలియమ్స్‌నూ అదే తరహాలో (4, 6) శిక్షించాడు. రిషభ్ పంత్ (18), శ్రేయస్ అయ్యర్ (4)పెద్ద స్కోర్లేమీ చేయలేకపోయినా... విలియమ్స్ 19వ ఓవర్లో మరో 2 సిక్సర్లతో మ్యాచ్‌ను ముగించాడు. 2017లో కింగ్‌స్టన్‌లో జరిగిన టి20 మ్యాచ్ సందర్భంగా కోహ్లిని ఔట్ చేసినపుడు విలియమ్స్ చేసుకున్న 'నోట్‌బుక్ స్టయిల్' సంబరాన్ని... ఇప్పుడు విలియమ్స్ బౌలింగ్‌లో సిక్స్‌లు బాదినపుడు కోహ్లి కూడా అదే శైలిని అనుకరించిమరీ సంబరం చేసుకున్నాడు.

భారత కెప్టెన్ కోహ్లి అంతర్జాతీయ టి20ల్లో తన అత్యధిక వ్యక్తిగత స్కోరును నమోదు చేశాడు. ఈ మ్యాచ్‌కు ముందు కోహ్లి అత్యధిక వ్యక్తిగత స్కోరు 90 నాటౌట్ (2016లో అడిలైడ్‌లో ఆస్ట్రేలియాపై) ఉండేది.

**94**

### స్కోరు వివరాలు

**వెస్టిండీస్ ఇన్నింగ్స్:** సిమన్స్ (సి) రోహిత్ (బి) చాహర్ 2; లూయిస్ (ఎల్బీ) (బి) సుందర్ 40; కింగ్ (స్టంప్డ్) పంత్ (బి) జడేజా 31; హెట్‌మైర్ (సి) రోహిత్ (బి) చహల్ 56; పొలార్డ్ (బి) చహల్ 37; హోల్డర్ (నాటౌట్) 24; రామ్‌దిన్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 207.**
**వికెట్ల పతనం:** 1-13, 2-64, 3-101, 4-172, 5-173. **బౌలింగ్:** సుందర్ 3-0-34-1, చాహర్ 4-0-56-1, భువనేశ్వర్ 4-0- 36-0, జడేజా 4-0- 30-1, చహల్ 4-0-36-2, దూబే 1-0-13-0.
**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (సి) హెట్‌మైర్ (బి) పియర్ 8; రాహుల్ (సి) పొలార్డ్ (బి) పియర్ 62; కోహ్లి (నాటౌట్) 94; పంత్ (సి) హోల్డర్ (బి) కాట్రెల్ 18; శ్రేయస్ (సి అండ్ బి) పొలార్డ్ 4; శివమ్ దూబే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (18.4 ఓవర్లలో 4 వికెట్లకు) 209.**
**వికెట్ల పతనం:** 1-30, 2-130, 3-178, 4-193. **బౌలింగ్:** కాట్రెల్ 4-0-24-1, హోల్డర్ 4-0-46-0, పియర్ 4-0-44-2, వాల్ష్ 2-0-19-0, విలియమ్స్ 3.4-0-60-0, పొలార్డ్ 1-0-10-1.

## వొజ్నియాకి వీడ్కోలు

**ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత టెన్నిస్‌కు టాటా**

పారిస్: ప్రపంచ మాజీ నంబర్‌వన్, డెన్మార్క్ భామ కరోలైన్ వొజ్నియాకి టెన్నిస్‌కు వీడ్కోలు పలకనుంది. వచ్చే ఏడాది జనవరిలో జరిగే తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత ఆటకు గుడ్‌బై చెబుతానని వొజ్నియాకి ప్రకటించింది. 29 ఏళ్ల వొజ్నియాకి తన కెరీర్‌లో ఏకైక గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గతేడాది గెల్చుకుంది. 2009, 2014 యూఎస్ ఓపెన్ టోర్నీలలో రన్నరప్‌గా నిలిచింది. 'టెన్నిస్‌లో నేను కోరుకున్నవన్నీ సాధించాను. నా జీవితంలో ఆట కంటే ఇతర విషయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే సమయం వస్తే టెన్నిస్‌కు వీడ్కోలు పలకాలని అనుకున్నాను' అని కెరీర్‌లో 30 సింగిల్స్ టైటిల్స్ గెలిచిన వొజ్నియాకి తెలిపింది. 2005లో 15 ఏళ్ల ప్రాయంలో ప్రొఫెషనల్‌గా మారిన వొజ్నియాకి 2010లో అక్టోబరులో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. ఈ స్థానంలో ఆమె 71 వారాలు కొనసాగింది. వరుసగా 11 ఏళ్ల పాటు టాప్-20లో నిలిచిన వొజ్నియాకి గాయాల కారణంగా ఈ ఏడాది కేవలం ఒక టోర్నీలో ఫైనల్‌కు చేరింది. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో వొజ్నియాకి 37వ ర్యాంక్‌లో ఉంది.



# భారత్ పసిడి వేట


తాము సాధించిన పతకాలతో సిరిల్ వర్మ, జక్కంపూడి మేఘన, పుల్లెల గాయత్రి, ధ్రువ్ కపిల, గారగ కృష్ణప్రసాద్

- దక్షిణాసియా క్రీడల ఆరో రోజు 19 స్వర్ణాలు
- బ్యాడ్మింటన్‌లో సిరిల్ వర్మకు పసిడి పతకం

కఠ్మాండు (నేపాల్): బరిలోకి దిగిన ప్రతి ఈవెంట్‌లోనూ పైచేయి సాధిస్తూ దక్షిణాసియా క్రీడల్లో భారత క్రీడాకారులు పతకాల వేటను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ క్రీడల ఆరో రోజు శుక్రవారం భారత్ 19 స్వర్ణాలు, 18 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి మొత్తం 41 పతకాలు సొంతం చేసుకుంది. ఓవరాల్‌గా ప్రస్తుతం భారత్ 81 స్వర్ణాలు, 59 రజతాలు, 25 కాంస్యాలతో కలిపి మొత్తం 165 పతకాలతో 'టాప్'లో కొనసాగుతోంది.

శుక్రవారం బ్యాడ్మింటన్‌లో భారత ఆటగాళ్లు అదరగొట్టారు. పురుషుల సింగిల్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ సిరిల్ వర్మ స్వర్ణం నెగ్గాడు. ఫైనల్లో సిరిల్ వర్మ 17-21, 23-21, 21-13తో ఆర్యమాన్ టాండన్ (భారత్)పై గెలిచాడు. మహిళల సింగిల్స్‌లో పుల్లెల గాయత్రి రజతం దక్కించుకుంది. ఫైనల్లో అస్మిత (భారత్) 21-18, 25-23తో గాయత్రిని ఓడించి స్వర్ణం సొంతం చేసుకుంది. పురుషుల డబుల్స్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ గారగ కృష్ణప్రసాద్-ధ్రువ్ కపిల (భారత్) జంట 21-19, 19-21, 21-18తో సచిన్ డయాస్-బువనెక (శ్రీలంక) జోడీపై గెలిచి బంగారు పతకం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలుగమ్మాయి జక్కంపూడి మేఘన-ధ్రువ్ కపిల (భారత్) ద్వయం 21-16, 21-14తో సచిన్ డయాస్-ప్రమోదిక (శ్రీలంక) జంటపై నెగ్గి పసిడి పతకం సాధించింది.

అథ్లెటిక్స్‌లో తేజిందర్ పాల్ పురుషుల షాట్‌పుట్‌లో స్వర్ణం గెలిచాడు. తేజిందర్ ఇనుప గుండును 20.03 మీటర్ల దూరం విసిరి దక్షిణాసియా క్రీడల రికార్డును నెలకొల్పి విజేతగా నిలిచాడు. మహిళల షాట్‌పుట్‌లో భారత్‌కే చెందిన అభా ఖతువా పసిడి పతకం గెలిచింది. టేబుల్ టెన్నిస్ (టీటీ) పురుషుల, మహిళల వ్యక్తిగత విభాగాల్లో భారత్‌కు స్వర్ణాలు దక్కాయి. పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఆంథోనీ అమల్‌రాజ్ 4-3తో హర్మీత్ దేశాయ్ (భారత్)పై, మహిళల సింగిల్స్ ఫైనల్లో సుతీర్థ 4-2తో ఐహిక ముఖర్జీ (భారత్)పై గెలిచారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో అచింత షెయులి (పురుషుల 73 కేజీలు), రాఖీ హల్దర్ (మహిళల 64 కేజీలు), మన్‌ప్రీత్ కౌర్ (మహిళల 71 కేజీలు) స్వర్ణ పతకాలు గెలిచారు.

తెలంగాణ ప్రభుత్వం
**కమిషనర్ కార్యాలయం, ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు
NIT No. EE/25/2019-2&EE/30/2019-1 తేది :5-12-2019 (2వ పిలుపు)
నిర్మల్ జిల్లాలో రూ.75 లక్షల వ్యయంతో 2 దేవాలయాలు అభివృద్ధి కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. మరింత సమాచారం కోసం దర్శించండి https://tender.telan-gana.gov.in. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : 10-12-2019, బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేది (దాఖలు) : 17-12-2019.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్
ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్
DIPR RO. No.1885-DP/CL/ADVT/1/2019-20, Dt: 06-12-2019

తెలంగాణ ప్రభుత్వం
**రహదారులు మరియు భవనముల శాఖ**
టెండరు ప్రకటన
NIT No. 27 to 33/2019-20 తేది: 03.12.2019
పనుల సంఖ్య (7). పనుల పేరు: దుర్కి రోడ్‌కు లీడ్ రోడ్‌కు AM, ఉప్పల్‌వాయి-రామారెడ్డి రోడ్‌కు AM, మెదక్ జిల్లా పరిధులు వయా రాజంపేట్ గుండారం రోడ్డుకు NH 44 కు AM, కాలవరల్ రోడ్‌కు లీడ్ రోడ్‌కు AM మరియు ఇతర అన్ని సివిల్ పనుల కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుతున్నవి. మొత్తం ECV: 270.00 కోట్లు. దరఖాస్తు స్వీకరణకు తేది మరియు టెండరు షెడ్యూళ్ళ జారీకి తేది: 03.12.2019 నుండి 10.12.2019 మ. 3.00 గం. వరకు. టెండర్ల స్వీకరణకు తేది: 03.12.2019 నుండి 10.12.2019 మ. 3.00 గం. వరకు. టెండర్లు తెరుచు తేది: 10.12.2019 మ. 3.30 గం.కు. తదుపరి వివరాల కోసం దిగువ సంతకందారును సంప్రదించగలరు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (R&B) డివిజన్, కామారెడ్డి
DIPR.Ro.No. 1888-DP/CL/ADVT/1/2019-20, Dt 06/12/2019

తెలంగాణ ప్రభుత్వం
**కమిషనర్ కార్యాలయం, ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు
NIT No. EE/43/Tender Notice /2019 తేది :05-12-2019
4 దేవాలయాలు అంటే జనగాం జిల్లాలో 1 మరియు సిద్ధిపేట జిల్లాలో 3 అభివృద్ధి కోసం రూ. 89.50 లక్షల వ్యయంతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. మరింత సమాచారం కోసం దర్శించండి https://tender.telangana.gov.in. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : 7-12-2019, బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేది (దాఖలు) : 21-12-2019.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్
ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్
DIPR RO. No.1886-DP/CL/ADVT/1/2019-20, Dt: 06-12-2019

SBI **రియల్ ఎస్టేట్ & హౌసింగ్ బిజినెస్ యూనిట్, 2వ అంతస్తు, లోకల్ హెడ్ ఆఫీస్, కోఠి, హైదరాబాద్ - 500095**
**హోమ్ లోన్ కౌన్సెలర్ (HLC) ఎంప్యానల్‌మెంట్**
తెలంగాణలోని SBI కొరకు పర్ఫార్‌మెన్స్ లింక్డ్ పే అవుట్ ప్రాతిపదికపై హోమ్‌లోన్స్ అందించేందుకు (to source) HLC గా ఎంప్యానల్‌మెంట్ కోసం దిగువ తెలిపిన అర్హతా ప్రమాణాలను నెరవేర్చే భారతీయ పౌరుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి:
1. వయసు: 30.11.2019 నాటికి 18 సంవత్సరాలు లేదా ఆపైన ఉండాలి.
2. స్థానిక నివాసియై ఉండి, మొబైల్ హ్యాండ్ సెట్‌తో, మెట్రిక్యులేట్ & ఆపైన అర్హత కలిగి మరియు తెలుగు మరియు/లేదా ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడగలగాలి.
3. దరఖాస్తు ఫారాలను SBI బ్రాంచ్‌ల నుండి లేదా https://tinyurl.com/y8dq2hm3 లింక్ ద్వారా పొందవచ్చును.
4. పైన తెలిపిన అర్హత ప్రమాణాలను నెరవేరుస్తున్న ఆసక్తి గల వ్యక్తులు నిర్ణీత దరఖాస్తు ఫారంలో దరఖాస్తు చేయవచ్చును మరియు పైన తెలిపిన చిరునామాకు పోస్ట్ ద్వారా లేదా స్వయంగా 20.12.2019న సా.5.00 గం.లోగా డిప్యూటీ జనరల్ మేనేజర్ (REHBU)కు దాఖలు చేయాలి.

అనుబంధం - I
**తెలంగాణ ప్రభుత్వం**
**ఆర్థిక శాఖ**
**సెప్టెంబర్ 04, 2019న జారీచేసిన 7.11% తెలంగాణ SDL 2027 రీ-ఇష్యూ**

| | | |
|---|---|---|
| మొత్తం | : | రూ. 1000.00 కోట్లు |
| జారీ ధర | : | ప్రతి రూ.10,000.00లకు రూ.10,000.00 |
| కరెన్సీ | : | 8 సంవత్సరాలు |
| రుణ దరఖాస్తు స్వీకరణ వ్యవధి | : | మొత్తం అందిన వెంటనే నోటీసు లేకుండా 10.12.2019న వ్యాపార వేళల తరువాత తక్షణమే ముగుస్తుంది. |

పైన తెలిపిన రుణానికి తెలంగాణ ప్రభుత్వం సబ్‌స్క్రిప్షన్లను అభ్యర్థిస్తోంది. పూర్తి వివరాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ మరియు ముంబై నుండి ప్రభుత్వ వ్యాపార వేళలలో పొందవచ్చును.
కె.రామకృష్ణ రావు
ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ, ఆర్థిక శాఖ
DIPR RO No.1883-DP/CL/Advt/1/2019-20, Dt: 06.12.2019

## రెండు డే నైట్ టెస్టులు ఆడండి!

**భారత్‌ను కోరనున్న ఆస్ట్రేలియా**

మెల్‌బోర్న్/కోల్‌కతా: వచ్చే ఏడాది చివర్లో తమ దేశంలో పర్యటించనున్న భారత జట్టు నాలుగు టెస్టుల సిరీస్‌లో రెండు టెస్టులను డే నైట్‌లో ఆడాలని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) కోరుకుంటోంది. వచ్చే జనవరిలో భారత్‌లో వన్డే సిరీస్ ఆడేందుకు ఆస్ట్రేలియా రానున్న సందర్భంగా ఈ విషయంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో చర్చించాలని సీఏ చైర్మన్ ఎర్ల్ ఎడింగ్స్ భావిస్తున్నారు. అయితే ఆస్ట్రేలియా ప్రతిపాదనపట్ల బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ సానుకూలంగా స్పందించే అవకాశం కనిపించడంలేదు. 'అధికారికంగా క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి నాకు ఎలాంటి సమాచారం అందలేదు. అయినా ఒకే సిరీస్‌లో రెండు డే నైట్ టెస్టులంటే ఎక్కువే. సిరీస్‌లో ఒక డే నైట్ మ్యాచ్ ఉంటే చాలు' అని గంగూలీ వ్యాఖ్యానించాడు. వచ్చే ఏడాది నవంబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్న భారత్ నాలుగు టెస్టులు, మూడు వన్డేలు ఆడనుంది.

## ఎఫ్‌ఐహెచ్ అవార్డు రేసులో మన్‌ప్రీత్

లుసానే (స్విట్జర్లాండ్): అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) వార్షిక అవార్డుల్లో భారత్ నుంచి ముగ్గురు క్రీడాకారులను నామినేట్ చేశారు. భారత సీనియర్ పురుషుల జట్టు కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో ఉండగా... వివేక్ ప్రసాద్, లాల్‌రెమ్‌సియామి వరుసగా పురుషుల, మహిళల 'రైజింగ్ స్టార్ ఆఫ్ ద ఇయర్' అవార్డు బరిలో ఉన్నారు. 27 ఏళ్ల మన్‌ప్రీత్ భారత్ తరఫున 242 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించాడు. అతని సారథ్యంలోనే భారత జట్టు ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో రష్యాపై గెలిచి టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. 19 ఏళ్ల వివేక్ ప్రసాద్ గత ఏడాది యూత్ ఒలింపిక్స్‌లో భారత జట్టుకు రజతం దక్కడంలో కీలకపాత్ర పోషించాడు. 19 ఏళ్ల లాల్‌రెమ్‌సియామి ఆసియా క్రీడల్లో రజతం నెగ్గిన భారత మహిళల జట్టులో సభ్యురాలిగా ఉంది. జాతీయ సంఘాలు, ఆటగాళ్లు, అభిమానులు, హాకీ జర్నలిస్టులు ఓటింగ్‌లో పాల్గొనవచ్చు. ఓటింగ్ వచ్చే ఏడాది జనవరి 17 వరకు కొనసాగుతుంది. ఫిబ్రవరిలో విజేతలను ప్రకటిస్తారు.



సాక్షి బిజినెస్
శనివారం
7-12-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 334 ▼ | 97 ▼ |
| 40,445 | 11,922 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,656 | ▲ | 85 |
| డోజోన్స్ | 28,006 | ▲ | 328 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,240 | ▲ | 102 |
| డాక్స్ | 13,167 | ▲ | 112 |
| షాంఘై | 2,912 | ▲ | 13 |
| నికాయ్ | 23,354 | ▲ | 54 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.55 | 72.19 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 92.28 | 95.54 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.82 | 80.74 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.46 | 66.90 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.80 | 49.96 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.57 | 53.38 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.20 | 19.80 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.92 | 19.92 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.51 | 10.91 |

# భారత్‌లోకి హుస్క్వానా ప్రీమియం బైక్స్



**న్యూఢిల్లీ:** ఆస్ట్రియా మోటార్ సైకిల్ కంపెనీ కేటీఎమ్ ఉత్పత్తి చేస్తున్న హుస్క్వానా ప్రీమియం మోటార్ సైకిల్ బ్రాండ్‌ను.. దేశీయ ఆటో దిగ్గజం బజాజ్ ఆటో భారత్‌లో ప్రవేశ పెట్టింది. ఈ బ్రాండ్‌లోని విట్‌పిలెన్ 250, స్వార్ట్‌పిలెన్ 250 మోడళ్లను ఇక్కడి మార్కెట్లో శుక్రవారం ఆవిష్కరించింది. అత్యంత శక్తివంతమైన ఈ రెండు మోడళ్లను వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి కేటీఎం షోరూంల ద్వారా కొనుగోలు చేయవచ్చని బజాజ్ ఆటో ప్రెసిడెంట్ (ప్రోబైకింగ్) సుమీత్ నారంగ్ వెల్లడించారు. ఇక కేటీఎం ఏజీలో బజాజ్ ఆటోకు 48 శాతం వాటా ఉన్న విషయం తెలిసిందే కాగా, 1903 నుంచి మార్కెట్లో ఉన్న స్వీడిష్ మోటార్ సైకిల్ బ్రాండ్‌ను తాజాగా భారత బైక్ ప్రియులకు ఇక్కడ పరిచయం చేసింది.

# నెఫ్ట్ లావాదేవీలు ఇక 24/7

## డిసెంబర్ 16 నుంచి అమల్లోకి



**ముంబై:** నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్/ఎన్‌ఈఎఫ్‌టీ) వ్యవస్థ మరింత సౌలభ్యంగా మారనుంది. రోజులో 24 గంటలు, వారంలో అన్ని రోజులూ (ఆదివారం, అన్ని సెలవుదినాల్లోనూ) నెఫ్ట్ లావాదేవీలను అనుమతించనున్నట్టు ఆర్‌బీఐ శుక్రవారం ప్రకటించింది. డిసెంబర్ 16 నుంచి ఇది అమల్లోకి వస్తుందని తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. డిసెంబర్ 16న (డిసెంబర్ 15 అర్ధరాత్రి) 00.30 గంటలకు మొదటి నెఫ్ట్ సెటిల్‌మెంట్ జరుగుతుంది. లావాదేవీలు సాఫీగా సాగిపోయేందుకు వీలుగా బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద తమ కరెంటు ఖాతాల్లో తగినంత నిధుల లభ్యత ఉండేలా చూసుకోవాలని, అవసరమైన ఏర్పాట్లను కూడా చేసుకోవాలని కేంద్ర బ్యాంకు కోరింది. రెండు గంటల్లోపు లావాదేవీ మొత్తం స్వీకర్త ఖాతాలో జమ చేయడం లేదా పంపిన వ్యక్తిన ఖాతాకు వెనక్కి జమ చేయడం ఇక ముందూ కొనసాగనుంది. నెఫ్ట్ లావాదేవీల ప్రోత్సాహానికి గాను వీటిపై చార్జీలను ఆర్‌బీఐ లోగడే ఎత్తివేసింది. నెఫ్ట్ లావాదేవీలను గంటకోసారి ఒక బ్యాంచ్ కింద క్లియర్ చేస్తుండడం ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు.. మొదటి, మూడో శనివారాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రాసెస్ చేస్తున్నారు.

# నోకియా 2.3 ఆవిష్కరణ



## అంచనా ధర రూ. 8,600

**కైరో/ఈజిప్ట్:** ఫిన్‌లాండ్‌కు చెందిన నోకియా బ్రాండ్ ఫోన్స్ విక్రయ సంస్థ హెచ్‌ఎమ్‌డీ గ్లోబల్.. నోకియా 2.3 పేరిట అధునాతన స్మార్ట్ ఫోన్‌ను అంతర్జాతీయ మార్కెట్లో విడుదలచేసింది. దీని ధర 109 యూరోలు కాగా, భారత్‌లో రూ. 8,600 వరకు ఉండే అవకాశం ఉంది. 6.2 అంగుళాల డిస్‌ప్లే, 4000 ఎంఏహెచ్ బ్యాటరీ, 2 జీబీ ర్యామ్/32 జీబీ స్టోరేజ్, 13 మెగాపిక్సల్ డ్యుయల్ రియర్ కెమెరా వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ప్రత్యేకించి భారత మార్కెట్లో ఎప్పటికప్పుడు అధునాతన ఉత్పత్తులను ప్రవేశపెట్టడం ద్వారా దీర్ఘకాలిక వృద్ధిని కొనసాగించేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా సంస్థ గ్లోబల్ జనరల్ మేనేజర్ ప్రణవ్ ష్రాఫ్ అన్నారు.

# ఇక పోస్ట్‘పాలసీ’ మ్యాన్‌లు!

## బీమా పాలసీల విక్రయానికి ఐఆర్‌డీఏఐ మార్గదర్శకాలు



**న్యూఢిల్లీ:** తపాలా శాఖకు చెందిన పోస్ట్‌మ్యాన్‌లు, గ్రామీణ డాక్ సేవక్‌లు త్వరలో బీమా పాలసీ విక్రయదారుల అవతారం ఎత్తనున్నారు. వీరిని పాయింట్ ఆఫ్ సేల్స్ పర్సన్స్‌గా (విక్రయదారులు) ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) ప్రతిపాదించవచ్చని ఐఆర్‌డీఏఐ తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది. వీటి ప్రకారం.. తపాలా శాఖ పోస్ట్‌మ్యాన్‌లు, గ్రామీణ డాక్ సేవక్‌ల జాబితాను ఐఆర్‌డీఏఐకు పంపి అనుమతి కోరాల్సి ఉంటుంది. ప్రధానంగా బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని, పూర్తి స్థాయిలో బ్యాంకింగ్ సేవలు విస్తరించని ప్రాంతాల్లో (మారుమూల గ్రామీణ ప్రాంతాల వరకు) వీరు బీమా విస్తరణకు తోడ్పడతారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ఒకటికి మించిన బీమా కంపెనీలతో వ్యాపార ఒప్పందాలు కూడా చేసుకుని, పోస్ట్‌మ్యాన్‌లు, డాక్ సేవక్‌ల ద్వారా పాలసీల విక్రయాలను చేపట్టవచ్చు.

## ప్రభుత్వం సాయం చేయాలి..

# లేదంటే మూతే!!



- వొడా– ఐడియా బకాయిల భారంపై చైర్మన్ కుమార మంగళం బిర్లా వ్యాఖ్య
- ఎకానమీ మెరుగుపడాలంటే ట్యాక్స్ రేట్ల తగ్గింపు సరిపోదు
- ఉద్దీపన చర్యలు అవసరమని అభిప్రాయం

**న్యూఢిల్లీ:** కేంద్రానికి చెల్లించాల్సిన పాత బకాయిలకు సంబంధించి ప్రభుత్వం ఊరట చర్యలేమీ తీసుకోకపోతే కంపెనీని మూసివేయక తప్పదని టెలికం సంస్థ వొడాఫోన్– ఐడియా చైర్మన్ కుమార మంగళం బిర్లా వ్యాఖ్యానించారు. ‘ప్రభుత్వం నుంచి ఏ రకమైన తోడ్పాటూ లేకపోతే ఇక వొడాఫోన్ ఐడియా కథ ముగిసినట్లే. ఇందులో ఇంకా పెట్టుబడులు పెట్టడం వల్ల ప్రయోజనమేమీ ఉండదు. సంస్థను మూసేయాల్సి ఉంటుంది‘ అని శుక్రవారం ఒక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. అయితే, ఎకానమీని గాడిలో పెట్టే దిశగా.. సంక్షోభంలో ఉన్న టెలికం రంగాన్ని గట్టెక్కించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ‘టెలికం అనేది చాలా కీలక రంగమని ప్రభుత్వం గుర్తించింది. మొత్తం డిజిటల్ ఇండియా కార్యక్రమమంతా దీనిపైనే ఆధారపడి ఉంది. ఇది నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉంది కాబట్టి.. ప్రభుత్వం నుంచి మరింత తోడ్పాటు అవసరం‘ అని ఆయన చెప్పారు. ఏ రకమైన ఊరట చర్యలు కోరుకుంటున్నారన్న ప్రశ్నపై స్పందిస్తూ.. ‘ప్రధానమైన సమస్య .. సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్) వివాదమే. ఇది ప్రస్తుతం కోర్టులో ఉంది. ప్రభుత్వమే టెల్కోలకు వ్యతిరేకంగా ఈ కేసు వేసింది. చర్చల ద్వారా దీన్ని పరిష్కరించవచ్చు‘ అని బిర్లా పేర్కొన్నారు. ఏజీఆర్ లెక్కింపు వివాదంలో ఇటీవల కేంద్రానికి అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో టెలికం సంస్థలు ఏకంగా రూ. 1.4 లక్షల కోట్ల మేర లైసెన్సు ఫీజులు, స్పెక్ట్రం యూసేజీ చార్జీల బకాయిలు కట్టాల్సి రానుంది. దీంతో వీటికి కేటాయింపులు జరపాల్సి రావడం వల్ల వొడాఫోన్ ఐడియా సెప్టెంబర్ త్రైమాసికంలో ఏకంగా రూ.50,921 కోట్ల మేర రికార్డు స్థాయిలో నష్టాలు ప్రకటించడం తెలిసిందే.

**ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి..**

ఎకానమీకి ఊతమిచ్చేందుకు కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించటం మాత్రమే సరిపోదని, ఆర్థికంగా తోడ్పాటునిచ్చేలా పటిష్టమైన ఉద్దీపన ప్యాకేజీలాంటిది అవసరమని బిర్లా చెప్పారు. ఆ రూపంలో వచ్చే నిధులతో కొన్ని కార్పొరేట్లు రుణభారం తగ్గించుకోగలవని, మరికొన్ని ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింతగా విస్తరించుకోగలవని ఆయన వివరించారు. ఎకానమీని గట్టెక్కించడానికి ఆదాయ పన్ను రేటును తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోందన్న వార్తలపై స్పందిస్తూ.. ‘ఇది కేవలం వినియోగ డిమాండ్ పెంచడానికే పరిమితమైన సమస్య కాదు. ఆదాయాలు తక్కువగా ఉన్నాయి. ప్రజలు మరింతగా ఖర్చు చేయడానికి ఇష్టపడటం లేదు. దీన్నుంచి బైటపడాలంటే.. ఉద్దీపన చర్యలు ప్రకటించడం ఒక్కటే మార్గం. జీఎస్‌టీని 15 శాతానికి తగ్గించారనుకోండి.. అదే పెద్ద ఉద్దీపన చర్య కాగలదు‘ అని బిర్లా చెప్పారు. మరోవైపు ఇన్‌ఫ్రాపై ప్రభుత్వం మరింతగా పెట్టుబడులు పెట్టడం కూడా ఎకానమీపై బాగా సానుకూల ప్రభావం చూపగలదని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు అంచనాలను రిజర్వ్ బ్యాంక్ ఏకంగా 6.1 శాతం నుంచి 5 శాతానికి కుదించిన నేపథ్యంలో బిర్లా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఇక్కడ ఎస్‌యూవీలంటేనే ఇష్టం

**రెండేళ్లలో నాలుగు కొత్త ఎస్‌యూవీలు • ఫోక్స్‌వ్యాగన్ డైరెక్టర్ స్టీఫెన్ న్యాప్**



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** యూరోపియన్ కార్ల దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ వచ్చే రెండేళ్లలో కొత్తగా నాలుగు స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్‌ను (ఎస్‌యూవీ) మార్కెట్లోకి తేనుంది. ప్రస్తుతం టిగువన్ ఎస్‌యూవీని దేశీయ మార్కెట్లో కంపెనీ విక్రయిస్తోంది. భారతీయులకు ఎస్‌యూవీలపై మక్కువ ఎక్కువని ఫోక్స్‌వ్యాగన్ ప్యాసింజర్ కార్స్ డైరెక్టర్ స్టీఫెన్ న్యాప్ శుక్రవారమిక్కడ చెప్పారు. ఈ విభాగంలో రానున్న రోజుల్లో తమ స్థానాన్ని పదిలపర్చుకుంటామన్నారు. 2020లో ఢిల్లీలో జరిగే ఆటో ఎక్స్‌పోలో నూతన మోడళ్లను ప్రదర్శిస్తామని తెలియజేశారు. కంపెనీ 20వ కార్పొరేట్ బిజినెస్ సెంటర్‌ను ప్రారంభించేందుకు హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ‘ఫోక్స్‌వ్యాగన్ కార్లు ఖరీదైనవని కస్టమర్లు అనుకునేవారు. నాలుగేళ్ల వారంటీ, విడిభాగాల ధర 15 శాతం తగ్గించడం ద్వారా ఆ భావన నుంచి బయటపడేలా చేశాం’ అని చెప్పారు. ఎస్‌యూవీలతోపాటు మరో రెండు కొత్త మోడళ్లను అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది.

**అయిదేళ్లలో 3 శాతం..**

ప్రస్తుతం భారత కార్ల మార్కెట్లో ఫోక్స్‌వ్యాగన్‌కు 1.4 శాతం వాటా ఉంది. అయిదేళ్లలో 3 శాతం వాటా లక్ష్యంగా చేసుకున్నట్టు స్టీఫెన్ చెప్పారు. ‘ఇండియా 2.0 కార్యక్రమంలో భాగంగా 2022 నాటికి రూ.8,000 కోట్లు ఖర్చు చేయాలని గతేడాది నిర్ణయించాం. మోడళ్ల అభివృద్ధి, ఆర్ అండ్ డీ కోసం ఈ పెట్టుబడి పెడతాం. పుణే ఆర్ అండ్ డీ కేంద్రంలో ప్రస్తుతం 650 మంది ఇంజనీర్లు ఉన్నారు. దీనిని 5,000 స్థాయికి పెంచుతాం. భారత్ సహా అంతర్జాతీయ మార్కెట్ కోసం ఇక్కడ కార్లను అభివృద్ధి చేస్తాం. బీఎస్–4 వాహనాల తయారీని డిసెంబర్ నుంచి నిలిపేస్తున్నాం. మార్కెట్లో బీఎస్–4తో పోలిస్తే బీఎస్–6 వాహనాల ధర డీజిల్ 12– 15 శాతం, పెట్రోల్ 5 శాతం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. పాత మోడళ్లన్నిటినీ కొనసాగిస్తాం. చార్జింగ్ స్టేషన్లు విరివిగా అందుబాటులోకి వచ్చాక ఎలక్ట్రిక్ వెహికల్స్‌ను ప్రవేశపెడతాం’ అని తెలిపారు.

## లిక్విడేషన్‌కు నాగార్జున ఆయిల్ రిఫైనరీ



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** నాగార్జున ఆయిల్ రిఫైనరీ ఆస్తుల విక్రయానికి (లిక్విడేషన్) నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్ ఆదేశాలిచ్చింది. లిక్విడేటర్‌గా క్రాంతి కుమార్ కేదారిని నియమించింది. లిక్విడేషన్ నుంచి గట్టెక్కించేందుకు కోల్‌కతాకు చెందిన హల్దియా పెట్రోకెమికల్స్ బిడ్ దాఖలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. నాగార్జున ఆయిల్ రిఫైనరీ తీసుకున్న అప్పులు వడ్డీతో కలిపి రూ.9,800 కోట్ల దాకా ఉన్నట్టు సమాచారం.

## హువావే ‘జీటీ2 స్మార్ట్‌వాచ్’

**ధరల శ్రేణి రూ. 15,990–21,990**



**న్యూఢిల్లీ:** చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ కంపెనీ హువావే.. ‘జీటీ2’ పేరిట స్మార్ట్‌వాచ్‌లను విడుదలచేసింది. ఒక్కసారి చార్జ్ చేస్తే 2 వారాలు పనిచేసే విధంగా రూపొందించిన ఈ మోడల్ ధరల శ్రేణి రూ.15,990–21,990 మధ్య ఉంది. బ్లూటూత్ కాలింగ్, 1.2 అంగుళాల అమోలెడ్ టచ్ డిస్‌ప్లే, 3డీ గ్లాస్ స్క్రీన్, కిరిన్ ఎ1 చిప్‌సెట్ కలిగిన ఈ స్మార్ట్‌వాచీలను వినియోగదారులు ఈ నెల 12–18 వరకు ప్రీ–బుక్ చేసుకోవచ్చని కంపెనీ ప్రకటించింది.

## చమురు ఉత్పత్తిలో మరింత కోత

**ఒపెక్ దేశాల నిర్ణయం**



**వియెన్నా:** ముడి చమురు ఉత్పత్తిని మరింతగా తగ్గించాలని పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య (ఒపెక్), దాని మిత్ర దేశాలు నిర్ణయించాయి. దీని ప్రకారం వచ్చే ఏడాది జనవరి 1 నుంచి రోజుకు 5,00,000 బ్యారెళ్ల చమురు ఉత్పత్తికి కోత పడనుంది. ప్రస్తుత ఒప్పందం ప్రకారం అమలవుతున్న దానికి ఇది అదనం. దీంతో మొత్తం మీద ఉత్పత్తి కోత రోజుకు 1.7 మిలియన్ బ్యారెళ్లకు పెరగనుంది. వియెన్నాలోని ఒపెక్ ప్రధాన కార్యాలయంలో సమావేశం అనంతరం సభ్య దేశాలు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశాయి. ఉత్పత్తి తగ్గింపు విధానాన్ని వచ్చే ఏడాది మార్చి 5–6న నిర్వహించే అసాధారణ సమావేశంలో సమీక్షించనున్నట్లు పేర్కొన్నాయి.

## సౌదీ ఆరామ్‌కో విలువ...

# రూ.120 లక్షల కోట్లు

- ప్రపంచంలోనే అతి పెద్ద ఐపీఓ
- 2,560 కోట్ల డాలర్లతో ‘అలీబాబా’ రికార్డ్ బ్రేక్
- 12న సౌదీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టింగ్!



**రియాద్:** ప్రపంచంలోనే అతి పెద్ద మార్కెట్ విలువ గల కంపెనీగా సౌదీ అరేబియాకు చెందిన చమురు దిగ్గజం, సౌదీ ఆరామ్‌కో అవతరించనున్నది. అంతేకాకుండా ప్రపంచంలోనే అతి పెద్ద ఐపీఓగా ఈ కంపెనీ ఐపీఓ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్) నిలిచింది. ఐపీఓలో భాగంగా తన షేర్ ధరను 32 రియాల్స్(8.53 డాలర్లు–రూ.601)గా సౌదీ ఆరామ్‌కో నిర్ణయించింది. ఈ ధర పరంగా ఈ కంపెనీ ఐపీఓ సైజు 2,560 కోట్ల డాలర్లు (రూ.1,80,480 కోట్లు) అవుతుంది. ఇప్పటివరకూ 2,500 కోట్ల డాలర్లతో అతిపెద్ద ఐపీఓగా ఉన్న అలీబాబా రికార్డ్‌ను సౌదీ ఆరామ్‌కో బ్రేక్ చేసినట్లే. 2014లో చైనా ఆన్‌లైన్ ట్రేడింగ్ కంపెనీ అలీబాబా ఐపీఓ ద్వారా 2,500 కోట్ల డాలర్లు సమీకరించింది. కాగా అదనంగా వచ్చిన దరఖాస్తులను కూడా వినియోగించుకోవాలని (గ్రీన్ షూ ఆప్షన్) కంపెనీ భావిస్తే, సౌదీ ఆరామ్‌కో ఐపీఓ సైజు 2,940 కోట్ల డాలర్లకు చేరొచ్చని అంచనా.

**ప్రపంచంలోనే పెద్ద కంపెనీ...!**

మరోవైపు తాజా ఇష్యూ ధరను బట్టి సౌదీ ఆరామ్‌కో కంపెనీ విలువ 1.7 లక్షల కోట్ల డాలర్లుగా(సుమారు రూ.120 లక్షల కోట్లు) తేలుతుంది. మార్కెట్ విలువ పరంగా.. యాపిల్(1.2 లక్షల కోట్ల డాలర్లు); మైక్రోసాఫ్ట్, అలీబాబా(1.1 లక్షల కోట్ల డాలర్లు) కంటే ఎంతో ఎగువన సౌదీ ఆరామ్‌కో ఉంది. తాదవుల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో సౌదీ ఆరామ్‌కో షేర్లు ఈ నెల 12న లిస్టయ్యే అవకాశాలున్నాయి. 2020లో 7,500 కోట్ల డాలర్ల డివిడెండ్‌ను ఇవ్వాలని సౌదీ ఆరామ్‌కో భావిస్తోంది. ఇది యాపిల్ డివిడెండ్ కంటే ఐదు రెట్లు అధికం.

# 12,000 దిగువకు నిఫ్టీ

- మందగమన భయాలతో అమ్మకాలు
- 334 పాయింట్లు పతనమై 40,445కు సెన్సెక్స్
- 97 పాయింట్ల నష్టంతో 11,922కు నిఫ్టీ



కొనుగోళ్లకు పురికొల్పే అంశాలేవీ లేకపోవడం, మందగమన భయాల కారణంగా శుక్రవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతుండటంతో రేట్ల కోతకు ఆర్‌బీఐ విరామం ఇవ్వడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ద్రవ్యలోటుపై ఆందోళన ప్రతికూల ప్రభావం చూపించింది. ప్రపంచ మార్కెట్లు లాభాల్లో ఉన్నా, మన మార్కెట్ మాత్రం నష్టపోయింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 334 పాయింట్ల నష్టంతో 40,445 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 97 పాయింట్లు పతనమై 11,922 పాయింట్ల వద్ద ముగిశాయి. వారం పరంగా చూస్తే, సెన్సెక్స్, నిఫ్టీలు నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 349 పాయింట్లు, నిఫ్టీ 135 పాయింట్లు చొప్పున నష్టపోయాయి. బ్యాంక్, వాహన, ప్రభుత్వ రంగ, రియల్టీ, విద్యుత్తు రంగ షేర్లలో అమ్మకాలు జోరుగా సాగాయి.

**614 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్..**

సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైనా, ఆ తర్వాత నష్టాల్లోకి జారిపోయింది. చివరి వరకూ నష్టాలు కొనసాగాయి. ఆరంభంలో 172 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ ఒక దశలో 442 పాయింట్ల మేర పతనమైంది. మొత్తం మీద రోజంతా 614 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. వాణిజ్య ఒప్పందం దిశగా ఇరు దేశాలూ సరైన దారిలోనే ఉన్నాయన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా ట్వీట్ నేపథ్యంలో ఆసియా, యూరప్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి.

- ముడి చమురు ఉత్పత్తిలో మరింత కోత ఉండొచ్చన్న వార్తల కారణంగా ఆయిల్, గ్యాస్ షేర్లు నష్టపోయాయి.
- యస్ బ్యాంక్ రేటింగ్స్‌ను మూడీస్ సంస్థ డౌన్‌గ్రేడ్ చేయడంతో ఈ బ్యాంక్ షేర్ 10 శాతం నష్టంతో రూ.56 వద్ద ముగిసింది.
- ప్రభుత్వ తోడ్పాటు లేకపోతే కంపెనీని మూసేస్తామని కంపెనీ చైర్మన్ కుమార మంగళం బిర్లా వ్యాఖ్యానించడంతో వొడాఫోన్ ఐడియా షేర్ 5 శాతం నష్టంతో రూ.6.92 వద్ద ముగిసింది.
- బంపర్ లాభాలతో స్టాక్ మార్కెట్లో లిస్టయిన ప్రైవేటు రంగ సీఎస్‌బీ బ్యాంక్‌లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఈ షేర్ 8 శాతం నష్టంతో రూ. 274 వద్ద ముగిసింది.

## ఆర్‌బీఎల్ బ్యాంక్.. 2,025 కోట్ల సమీకరణ

**ముంబై:** ప్రైవేట్ రంగ ఆర్‌బీఎల్ బ్యాంక్ రూ.2,025 కోట్ల పెట్టుబడులను సమీకరించింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ దిగ్గజం బజాజ్ ఫైనాన్స్‌తో సహా మొత్తం 40 సంస్థల నుంచి ఈ నిధులను ఈ బ్యాంక్ సమీకరించింది. సంస్థాగత కేటాయింపులో భాగంగా ఒక్కో షేర్ రూ.352 ధర చొప్పున మొత్తం 5.77 కోట్ల షేర్లను జారీ చేసి ఈ పెట్టుబడులను సమీకరించామని ఆర్‌బీఎల్ బ్యాంక్ వెల్లడించింది.

# విదేశీ పెట్టుబడుల వివరాలు ఏటా చెప్పాలి

**ఈ–కామర్స్ సంస్థలకు కొత్త నిబంధన**



**న్యూఢిల్లీ:** ఈ–కామర్స్ సంస్థలు ఇకపై తమకు అందే విదేశీ పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) సంబంధించిన వివరాలను .. ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం తెలియజేయాల్సి రానుంది. తాము ఎఫ్‌డీఐ నిబంధనలను సక్రమంగా అమలు చేస్తున్నామంటూ ఏటా సెప్టెంబర్ 30లోగా ఆడిటర్ నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన నిబంధనను కేంద్రం శుక్రవారం నోటిఫై చేసింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ–కామర్స్ దిగ్గజాలపై దీని ప్రభావం ఉంటుంది. ఈ–కామర్స్ రంగంలో ఎఫ్‌డీఐ నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చూసేందుకు ఇది తోడ్పడగలదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, దీన్ని అమలు చేసే క్రమంలో ఆయా సంస్థల వ్యయాలు పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ–కామర్స్ కంపెనీలు ఎఫ్‌డీఐ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయని దేశీ వ్యాపారస్తుల సమాఖ్య సీఏఐటీ ఆరోపిస్తున్న నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. పుష్కలంగా విదేశీ పెట్టుబడుల ఊతంతో ఈ–కామర్స్ కంపెనీలు అడ్డగోలు డిస్కౌంట్లు ఇస్తూ చిన్న వ్యాపారాలను దెబ్బ తీస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

# ఎన్‌ఎస్‌ఈ చైర్మన్‌గా గిరీష్ చంద్ర చతుర్వేది



**న్యూఢిల్లీ:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ చైర్మన్‌గా గిరీష్ చంద్ర చతుర్వేది నియమితులయ్యారు. మునుపటి చైర్మన్ అశోక్ చావ్లా రాజీనామా తరువాత ఈ ఏడాది జనవరి నుంచి ఈ పోస్ట్ ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే కాగా, శుక్రవారం చతుర్వేది చైర్మన్ బాధ్యతలను స్వీకరించారని ఎన్‌ఎస్‌ఈ ప్రకటించింది. ఇందుకు సెబీ అనుమతి లభించినట్లు ప్రకటించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, పెట్రోలియం సహజ వాయువు మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శిగా సేవలందించిన ఈయన నియామకాన్ని స్వాగతిస్తున్నట్లు ఎక్స్ఛేంజ్ బోర్డ్ వెల్లడించింది.

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,170 | ▼ 310 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,300 | ▼ 300 |
| వెండి (కిలో) | 47,600 | ▲ 100 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,220 | ▼ 40 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,400 | ▼ 40 |
| వెండి (కిలో) | 47,600 | ▲ 100 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,220 | ▼ 40 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,400 | ▼ 40 |
| వెండి (కిలో) | 47,600 | ▲ 100 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,800 | ▼ 200 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,060 | ▼ 60 |
| వెండి (కిలో) | 45,400 | ▼ 100 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,110 | ▼ 110 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,380 | ▼ 100 |
| వెండి (కిలో) | 45,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,380 | ▼ 20 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,400 | ▼ 40 |
| వెండి (కిలో) | 47,600 | ▲ 100 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 07-12-2019

| | |
|---|---|
| విశాఖ | 460-00 |
| చిత్తూరు | 471-00 |
| వరంగల్ | 433-00 |
| **06-12-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 430-00 |
| విజయవాడ | 452-00 |
| గోదావరి | 452-00 |

epaper.sakshi.com

# ఆకతాయిల అరాచకం

- తెల్లవారుజామున భార్యాభర్తల అడ్డగింత
- మహిళ చేయి పట్టుకుని అసభ్య ప్రవర్తన
- 100కు కాల్.. నిందితుల అరెస్టు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఘటన

**పాల్వంచ:** తెల్లవారుజామున బస్సు దిగి ఇంటికి వెళ్తున్న ఓ యువ జంటను మద్యం మత్తులో ఉన్న ముగ్గురు ఆకతాయిలు అడ్డుకుని అసభ్యంగా ప్రవర్తించారు. చేతిలో ఉన్న బీరు సీసాలు పగులగొట్టి మహిళ చేయి పట్టుకుని లాగబోయారు. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఎస్‌బీఐ రోడ్డులో ఉన్న దాక్షిణి ల్యాబ్‌లో వాంకుడోతు శ్రీవిద్య టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త అనిల్‌కుమార్‌తో కలసి హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి తెల్లవారుజామున 3.30 గంటలకు పాల్వంచ బస్టాండ్‌లో దిగారు. అక్కడి నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఐటీడీఏ కాంప్లెక్స్ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేసే ఇద్దరు కాంపౌండర్లు సాయి, ప్రదీప్, వారి స్నేహితుడు సమీర్ కలసి దంపతులను అడ్డగించారు. అప్పటికే వారు మత్తులో ఊగిపోతున్నారు. మహిళను అసభ్య పదజాలంతో దూషిస్తూ, చేయి పట్టుకునే ప్రయత్నం చేశారు. మద్యం తాగి సీసాలను కింద పడేసి హల్‌చల్ చేశారు. దీంతో భయంతో వారు పరుగెత్తుకుంటూ దగ్గరలోని తమ ల్యాబ్‌లో పనిచేసే అన్వేష్ కుటుంబ సభ్యులను లేపి విషయాన్ని చెప్పారు. వెంటనే 100కు ఫోన్ చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ముగ్గురు ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. బ్రీతింగ్ ఎనలైజర్ ద్వారా పరీక్ష నిర్వహించి వారు మద్యం తాగినట్లు నిర్ధారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జె.ప్రవీణ్ తెలిపారు.

# ఆరోగ్యశ్రీనే భేష్: ఈటల



**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కంటే ఆరోగ్యశ్రీనే అన్ని విధాలా మేలైనదిగా ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అభిప్రాయపడ్డారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసే అంశంపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం సమావేశం నిర్వహించిన నేపథ్యంలో శుక్రవారం ఈటల వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ అమలు చేయాలన్న ఒత్తిడి కేంద్రం నుంచి ఎక్కువ కావడంతో ఆ విషయంలో ఏ విధంగా ముందుకెళ్లాలన్న విషయంపై చర్చించారు. ఆయుష్మాన్ భారత్ అమల్లో ఉన్న సాధక బాధకాలేంటి, ఆరోగ్యశ్రీలో ఉన్న అనుకూలతలేంటన్న దానిపై పరిశీలించారు. ఆరోగ్యశ్రీలో ఎక్కువ మంది లబ్ధిదారులున్నారని, ఆయుష్మాన్ భారత్ అమలు చేస్తే లబ్ధిదారుల సంఖ్య మూడో వంతుకు పడిపోయే ప్రమాదముందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక ఆయుష్మాన్ భారత్‌లో వ్యాధుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. ఈ రెండింటిని ఏకకాలంలో అమలు చేసే అవకాశముందా అన్న అంశంపై మంత్రి అధికారులతో చర్చించారు. ఒకవేళ అమలు చేస్తే ఏ పేరు ఉండాలన్న అంశంపైనా చర్చ జరిగింది. అయితే రెండింటిపై మరోమారు చర్చించి, ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వాలని, దానిపై సీఎం కేసీఆర్ తుది నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారం

**కోదాడ రూరల్:** సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని కొమరబండలో ఓ బాలికపై అత్యాచారం జరిగింది. గ్రామానికి చెందిన బాలిక (15) తొమ్మిదో తరగతి చదువుతోంది. నాలుగు రోజులుగా ఆరోగ్యం బాగుండకపోవడంతో ఇంటి వద్దే ఉంటోంది. ఇంటి సమీపంలో ఉండే ఆటోడ్రైవర్ ఎం.కోటి శుక్రవారం ఇంట్లోకి ప్రవేశించి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సమయంలో ఇంట్లోకి వచ్చిన బాలిక తండ్రిని చూసి పరారయ్యాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులుగౌడ్ తెలిపారు.

**సవరణ**
సాయినాథ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క A/c విషయంలో 05.12.2019న **"సాక్షి మరియు బిజినెస్ లైన్"** లో ప్రచురించబడిన మా ఫారం G ని రిఫర్ చేయండి. ప్రకటన క్రింది భాగంలో రిసొల్యూషన్ ప్రొఫెషనల్ BS లిమిటెడ్ అని పొరపాటున పేర్కొనబడినది. దానికి బదులుగా రిసొల్యూషన్ ప్రొఫెషనల్ **"సాయినాథ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్"** అని చదువుకోవలసిందిగా ఇందుమూలంగా తెలియచేయడమైనది. మిగిలిన ఇతర అంశాలలో ఎట్టి మార్పు లేదు.
**Dr కొండపల్లి వెంకట్ శ్రీనివాస్**
Reg.No.IBBI/IPA-001/IP-P00520/2017-18/10945
రిసొల్యూషన్ ప్రొఫెషనల్,
M/s సాయినాథ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్

# అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

## వర్ధంతి సభలో పలువురు వక్తలు


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం

**కవాడిగూడ:** అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి బీఆర్.అంబేడ్కర్ అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ 63వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం లోయర్ ట్యాంకుబండ్‌లో ఉన్న ఆయన విగ్రహం వద్ద వివిధ పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థలు, దళిత సంఘాల నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల అమలుకు బీజేపీ కట్టుబడి ఉందని, అందుకోసం రిజర్వేషన్లను పార్లమెంటులో పొడిగించిందని తెలిపారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా దేశానికి దశ,దిశ రూపకల్పన చేయడంతో పాటుగా ప్రతి ఒక్కరికి రాజ్యాంగ ఫలాలు అందాలని ఆశించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు.

**అంబేడ్కర్ విగ్రహానికి గుత్తా, పోచారం నివాళులు**

**సాక్షి, హైదరాబాద్:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 63వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలతో నివాళి అర్పించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ దేశానికి ఇచ్చిన స్ఫూర్తిని కొనియాడారు. సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబులు కూడా నివాళులర్పించారు.

**ANDHRA PRADESH POLLUTION CONTROL BOARD**
D.No. 33-26-14D/2, Near Sunrise Hospital, Kasturibaipet, VIJAYAWADA - 520 010, Andhra Pradesh.
**E-PROCUREMENT TENDER NOTICE**
*Tender No. APPCB-12022/1/2019-SS-CL-APPCB Dt.:23.11.2019*
Bids are invited for the supply, installation, commissioning of four (04) Continuous Ambient Air Quality Monitoring Stations (CAAQMS) and Operation & Maintenance Services followed by real time data transfer to APPCB and CPCB servers online. The tender document along with the schedule can be downloaded from www.apeprocurement.gov.in or https://tender.apeprocurement.gov.in. Bids shall be submitted online through e-Procurement platform only.
The last date for submission of bids : 23-12-2019 by 01.00 PM
For details contact : 80084 03053
Sd/- Member Secretary, APPCB, Vijayawada

# ఆ మృగాన్ని ఇంకా మేపుతారా?

## ఎన్‌కౌంటర్ చేయండి
## చిన్నారి శ్రీహిత తల్లి డిమాండ్


రచన

**హన్మకొండ చౌరస్తా :** ముక్కు పచ్చలారని 9 నెలల కుమార్తెపై అత్యాచారానికి పాల్పడిన మానవ మృగాన్ని ఆరు నెలలుగా జైలులో ఉంచి మేపుతూ తమను క్షోభ పెడుతున్నారని హన్మకొండకు చెందిన చిన్నారి శ్రీహిత తల్లి రచన ఆవేదన వ్యక్తం చేశారు. దిశ హంతకుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో శుక్రవారం ఆమె హన్మకొండలో విలేకరులతో మాట్లాడారు. తామేం పాపం చేశామని ప్రభుత్వం అన్యాయం చేస్తుందో అర్థం కావడం లేదని వాపోయారు. ఒడిలో నిద్రిస్తున్న పాపను ఎత్తుకెళ్లి అత్యంత కిరాతకానికి ఒడిగట్టిన దుర్మార్గుడిని ఉరితీయాలని జిల్లా కోర్టు తీర్పు ఇస్తే.. హైకోర్టు ఈ తీర్పును యావజ్జీవ శిక్షగా మార్చడం తమను బాధించిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన మానవ మృగాన్ని ఎన్‌కౌంటర్ చేయాలని.. అప్పుడే తమకు న్యాయం జరుగుతుందని.. పాప ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు.

**MSME-TOOL ROOM, HYDERABAD**
**(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)**
(A Government of India Society, Ministry of MSME)
Balanagar 'X' Roads, Hyderabad – 500 037 (TS) INDIA
**WALK –IN-INTERVIEW**
Central Institute of Tool Design, Balanagar, Hyderabad, an autonomous body, under the Ministry of MSME, Govt of India, looking for candidates to engage on contract basis for the post of Consultant (Accounts) & Office Assistant (Accounts) on full – time basis.

| SNo | Post | Qualification | Experience |
|---|---|---|---|
| 1. | Consultant (Accounts) | CA/ ICWA Qualified | 5+ Years |
| 2. | Office Assistant (Accounts) | MCom/ MFM/MBA (Fin)/Bcom | 2+ Years |

Interested candidates may walk-in for interview on **09.12.2019 from 10.00 AM – 01.00 PM.** Salary will be paid best in industry.
Date : 03.12.2019 Sd/- PRINCIPAL DIRECTOR

# సీఎం దృష్టికి ఉర్దూ ప్రత్యేక డీఎస్సీ

- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- ఎంఐఎం ఎమ్మెల్యేలు, అధికారులతో ప్రత్యేక భేటీ



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించే అంశాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తానని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఉర్దూ మీడియం పాఠశాలల సమస్యలపై ఎంఐఎం శాసనసభాపక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీతో పాటు ఎంఐఎం ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను గుర్తించి ప్రభుత్వానికి నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన వారు లేకపోవడం వల్ల ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటున్నాయని, ప్రత్యేక డీఎస్సీ నిర్వహించినా ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ కాకపోతే డీరిజర్వ్ చేసి భర్తీ చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో వెంటనే విద్యా వలంటీర్లను నియమించనున్నట్లు వెల్లడించారు. ఉర్దూ ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉంటే ఇతరులతో భర్తీ చేస్తున్నారన్న శాసనసభ్యుల ఫిర్యాదుకు స్పందించిన మంత్రి.. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎస్సీ, ఎస్టీలతో సమానంగా మైనారిటీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని అక్బరుద్దీన్ ఒవైసీ కోరగా, మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి ప్రతిపాదనలు వస్తే వెంటనే మైనారిటీలకు కూడా ప్రవేశాలు కల్పిస్తామని సబిత హామీఇచ్చారు. ఉర్దూ మీడియం పాఠశాలలకు టీ–శాట్, విద్యా నిపుణ చానెళ్ల ద్వారా డిజిటల్ తరగతులను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, కళాశాల విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్, ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ సయ్యద్ ఉమర్ జలీల్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఔత్సాహిక యువత కోసం**
భారత ప్రభుత్వం, ఎమ్ఎస్ఎమ్ఇ మంత్రిత్వ శాఖ, ఎటిఐ పథకం క్రింద స్పాన్సర్ చేసిన
**ఉచిత శిక్షణా కోర్సులు**
- యానిమేటర్
- ఎకౌంట్ ఎగ్జిక్యూటివ్
- బ్యాంకింగ్ టెక్నీషియన్
- టూల్ డిజైనర్
- అసిస్టెంట్ కెమెరామెన్
- ఐటి హార్డ్‌వేర్
- క్లౌడ్ ఇంజనీర్
- ఐటి సర్వీసెస్(లైనక్స్)
- జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్
- గ్రాఫిక్ డిజైనర్
- వెబ్ డిజైనింగ్
- ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్
- డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్
- మేకప్ ఆర్టిస్ట్
- అసిస్టెంట్ ఫ్యాషన్ డిజైనర్
- విఎఫ్ఎక్స్ ఎడిటర్

అర్హత : పదవ తరగతి, ఇంటర్ లేదా గ్రాడ్యుయేషన్
పత్రాలు : విద్యార్హత ధృవపత్రాలు, ఆధార్ కార్డ్ & 3 ఫోటోలు
వయస్సు : 18 – 40 సంవత్సరాలు.
నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ & మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ni-msme)
(భారత ప్రభుత్వ ఎమ్ఎస్ఎమ్ఇ మంత్రిత్వ శాఖ యొక్క సంస్థ)
యూసఫ్‌గూడ, హైదరాబాద్ - 500045. Website: www.nimsme.org
సంప్రదించండి:
040-23633244, 211, 9121336565, 9642375764

**HEAVY WATER PLANT (MANUGURU)**
**Notice Inviting E-Tenders**
The General Manager, Heavy Water Plant (Manuguru), Department of Atomic Energy, Government of India, Aswapuram, Bhadradri Kothagudem Dist. Telangana State - 507 116. Invites for and on behalf of President of India, Tender for the following contract :

| | |
|---|---|
| Tender Notice No. | HWPM/ADMN(EM) / CHSS-08/09/2019 |
| Name of the contract | Operation of Pharmacy in HWP(M) Colony Hospital, Aswapuram, Bhadradri Kothagudem District for supply of medicines on credit basis to CHSS beneficiaries of HWP(M) |
| Estimated cost | Rs. 200.00 Lakhs |
| Earnest Money | Rs. 4,00,000/- |
| Period of completion | 12 months |
| Dates of availability of Tender Documents for view and download | 04/12/2019 (10.00 Hrs) to 13/12/2019 (14.00 Hrs) |
| Last date and time of submission of bid | Upto 14.00 hours on 16/12/2019. |

Details can be obtained from the website: www.tenderwizard.com/DAE.
Detailed NIT can be viewed at www.hwb.gov.in
Sd/-
General Manager, HWP Manuguru
Signature of the tender inviting authority
HWP(M)/GEN/1(15)/2019/542. Dt. 06/12/2019.

# పతనావస్థలో దేశ ఆర్థిక వ్యవస్థ

## సీపీఐ నేత నారాయణ

**సాక్షి, హైదరాబాద్:** ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనైతిక, అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతోందని, ఈ విధానాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పతనావస్థకు చేరుకుందని సీపీఐ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. శనివారం నుంచి రెండ్రోజులపాటు నగరంలో జరుగనున్న పార్టీ జాతీయ కార్యవర్గ భేటీలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో కోల్‌కతాలో జరిగే పార్టీ జాతీయస్థాయి మహాసభల్లో అన్ని రాష్ట్రాల్లో పార్టీ బలోపేతం, సభ్యత్వ పునరుద్ధరణపై చర్చిస్తామన్నారు.



# కొత్త బిల్లులు పరిష్కారం చూపవు

- అత్యాచార ఘటనల నిరోధానికి రాజకీయ చిత్తశుద్ధి కావాలి
- ప్రజల ఆలోచనా ధోరణి, విద్యా వ్యవస్థలో మార్పులు రావాలి
- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- ముగిసిన ఏఐఎస్, సీసీఎస్ ఆఫీసర్ల ఫౌండేషన్ కోర్సు కార్యక్రమం

**సాక్షి, హైదరాబాద్:** ఉన్నావ్, హైదరాబాద్ లాంటి ఘటనలను నిరోధించేందుకు కావాల్సింది కొత్త బిల్లులు కావని, రాజకీయ చిత్తశుద్ధి, పాలనాపరమైన నైపుణ్యంతోనే అరికట్టడం సాధ్యమని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మహిళల అత్యాచార ఘటనలపై నిర్భయ లాంటి చట్టం ఉండగా కొత్తగా బిల్లులు ఎంత మాత్రం పరిష్కారం చూపలేవని, ప్రజల ఆలోచనా వైఖరి, విద్యా వ్యవస్థలో మార్పుతో పాటు దేశ సంస్కృతి పట్ల గౌరవం ఉన్నప్పుడే ఇలాంటి ఘటనలను రూపుమాపడం సాధ్యమవుతుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో జరిగిన ఆల్ ఇండియా సర్వీస్, సెంట్రల్ సివిల్ సర్వీస్ ఆఫీసర్ల 94వ ఫౌండేషన్ కోర్సు ముగింపు కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలు, గురువులు, పెద్దలను ఎలా గౌరవించాలో పాఠశాల స్థాయి నుంచి బోధిస్తూనే కఠిన చట్టాలను రూపొందించాలన్నారు. బాధితులు ఫిర్యాదులు చేసినప్పుడు సత్వరమే స్పందించడంతో పాటు, వేగవంతమైన విచారణ, సత్వర న్యాయం జరిగేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో నైతిక విలువలు వేగంగా పతనమవుతున్నాయని, భారతీయ మూలాల్లోకి తిరిగి వెళ్లాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో మనుగడ కోసం ప్రకృతిని, సంస్కృతిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు. 70 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో నేటికీ 18 నుంచి 20 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని, పేదరికానికి దారితీస్తున్న కారణాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందని వెంకయ్య నాయుడు అన్నారు. ప్రభుత్వాలు తాత్కాలికంగా ఇచ్చే తాయిలాలు పేదలకు ఎలాంటి మేలు చేయవని, సామాజిక, లింగ వివక్షతో పాటు ఆర్థిక అంతరాలు తొలగించాలని వెంకయ్యనాయుడు అన్నారు. ప్రజలకు చేరువై సుపరిపాలన ద్వారా ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. వ్యవసాయ, వ్యాపార రంగాలు దేశానికి రెండు కళ్లలాంటివని, వలసవాద ఆలోచనా ధోరణి నుంచి ప్రజలు బయటకు రావాలన్నారు.

### శిక్షణలో ప్రతిభ చూపిన వారికి అవార్డులు..

తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి వెంకయ్యనాయుడు నివాళి అర్పించారు. ఫౌండేషన్ కోర్సు జర్నల్‌ను విడుదల చేయడంతో పాటు, శిక్షణలో ప్రతిభ చూపిన పది మంది అధికారులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ జాయింట్ సెక్రటరీ రష్మి చౌదరి, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ బీపీ ఆచార్య, అదనపు డీజీ హర్‌ప్రీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయండి

**కేంద్ర మంత్రిని కోరిన తెలంగాణ స్థానిక సంస్థల ఫోరం**

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణలో మండల, జిల్లా పరిషత్‌లకు నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు రాష్ట్ర స్థానిక సంస్థల ఫోరం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులు శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలసి వినతిపత్రాన్ని అందించారు. 2014 నుంచి కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు విడుదల కాలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా పరిషత్‌లకు 20 శాతం, మండల పరిషత్‌లకు 30 శాతం నిధులు ఇవ్వాలని కోరామన్నారు. తమ విజ్ఞప్తులపై తోమర్ సానుకూలంగా స్పందించారని ఫోరం ప్రతినిధులు బొల్లా కరుణాకర్, కె.రమేశ్‌లు మీడియాకు తెలిపారు.




### ఉత్తమ పీఎస్ టాప్-10లో

# చొప్పదండి

**సాక్షి, న్యూఢిల్లీ:** ఉత్తమ పోలీసింగ్ విధానాలతో ప్రజలకు మెరుగైన సేవలను అందించడం ద్వారా జాతీయస్థాయిలో 10 పోలీస్ స్టేషన్ల (పీఎస్)లో తెలంగాణలోని కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల పోలీస్ స్టేషన్ ఒకటిగా నిలిచింది. టాప్–10 ర్యాంకులను కేంద్ర హోంశాఖ శుక్రవారం విడుదల చేసింది. తొలి ర్యాంకు అండమాన్ నికోబార్ దీవుల్లోని అబెర్దీన్ పోలీస్‌స్టేషన్ కైవసం చేసుకోగా.. చొప్పదండి పోలీస్ స్టేషన్ 8వ ర్యాంకు సొంతంచేసుకుంది. పోలీసు స్టేషన్లను ప్రజాస్పందన ఆధారంగా, పోలీసు సిబ్బంది పనితీరు ఆధారంగా గ్రేడింగ్ చేయడానికి ర్యాంకులు కేటాయించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచన మేరకు కేంద్ర హోంశాఖ ఈ సర్వే నిర్వహించింది. డేటా విశ్లేషణ, ప్రత్యక్ష పరిశీలన, ప్రజల అభిప్రాయాల ద్వారా దేశంలోని 15,579 పోలీస్ స్టేషన్లలో టాప్–10 పోలీస్ స్టేషన్లను గుర్తించారు. ర్యాంకింగ్ ప్రక్రియకు ముందు ప్రతి రాష్ట్రంలో ఉత్తమంగా పనిచేసే పోలీసు స్టేషన్లను ఎంపిక చేశారు. ఆస్తి నేరం, మహిళలపై నేరాలు, బలహీన వర్గాలపై నేరాల్లో పరిశోధనను పనితీరుకు ప్రాతిపదికగా ఎంచుకున్నారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com